ప్రజాపక్షం
6th
ANNIVERSARY
22nd October

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 328 | మంగళవారం | 29-10-2024 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00

కొత్తగా 'పట్టణాభివృద్ధి సంస్థ'ల ఏర్పాటు

త్వరగా నివేదికలు ఇవ్వాలి

బెటాలియన్ పోలీసుల ఆందోళనపై ప్రత్యేక నిఘా

లోపలి పేజీల్లో

ఎట్టకేలకు 2025లో

జనగణన!

- 31 ప్రశ్నల జాబితా సిద్ధం
- 2028 నాటికి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన

న్యూఢిల్లీ : కరోనా మహమ్మారి కారణంగా వాయిదాపడిన దేశ జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం వచ్చే ఏడాది ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఏడాది కాలంలో ఈ ప్రక్రియ పూర్తిచేసి 2026 నాటికి కొత్త జనాభా జాబితాను ప్రకటిస్తారు. ఇందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఐతే దీంతోపాటే కులగణన చేపట్టాలా? వద్దా? అనే విషయంపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దేశంలో ఒబిసి జనాభా ఎంతో తేల్చాలని కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. జనాభా కొత్త జాబితా సిద్ధం కాగానే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేస్తారు. జనాభా లెక్కలు సేకరించేందుకు కుటుంబ పెద్దను ప్రశ్నించేందుకు రిజిస్ట్రార్ జనరల్–సెన్సస్ కమిషనర్ 31 ప్రశ్నలు సిద్ధం చేశారు. కుటుంబ యజమాని భార్యా? లేక భర్తా? కుటుంబ సభ్యులు ఎంతమంది? కుటుంబ యజమాని దళితుడా? ఇతర కులాలకు చెందినవారా? కుటుంబంలో ఎంతమంది ఉంటారు? ఇంట్లో ఎన్ని గదులు ఉన్నాయి? కుటుంబంలో వివాహిత జంటలు ఎన్ని ఉన్నాయి? కుటుంబానికి ప్రధాన నీటి సరఫరా వనరు ఏది? విద్యుత్ వాడుతున్నారా? మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంటగది, ఎల్‌పిజి, పిఎన్‌జి వంటి సదుపాయాలు ఉన్నాయా? వంటకు

తరువాయి 2లో

కులగణనపై అఖిలపక్షం

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : వచ్చే జనగణనలో అన్ని కులాల లెక్కలను సంపూర్ణంగా గణిస్తారా?, జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభలో ప్రతి రాష్ట్రం సంఖ్యాబలాన్ని నిర్ధారిస్తారా అనే అంశాలపై స్పష్టత ఇచ్చేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తాజాగా రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారని, అంటే 2021 నుం చి సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న జనగణనను ఎట్టకేలకు చేపట్టనున్నట్లు అర్థమవుతుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అదే సమయంలో రెండు అంశాలపై స్పష్టత లేదని, 1951 నుంచి జరుగుతున్న జన భా లెక్కల కార్యక్రమంలో మాదిరిగానే ఈసారి కూడా ఎస్‌సి, ఎస్‌టిలతో పాటు దేశంలోని అన్ని కులాల

తరువాయి 2లో

విద్యుత్ ఛార్జీల

పెంపు లేనట్టే

స్పష్టం చేసిన ఇఆర్‌సి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను ఇఆర్‌సి తిరస్కరించింది. డిస్కమ్‌ల ప్రతిపాదనలను సోమవారం ఇఆర్‌సి తిరస్కరించడంతో సామాన్య వినియోగదారులకు ఊరట లభించింది. 800 యూనిట్లు దాటితే 10 నుంచి 50 శానికి ఫిక్స్‌డ్ ఛార్జీలు పెంచేందుకు అనుమతి ఇవ్వాలని డిస్కమ్‌ల ప్రతిపాదనలను కమిషన్ ఆమోదించలేదు. డిస్కమ్‌ల 8 పిటిషన్‌లపై కమిషన్ తన అభిప్రాయాలను వెల్లడించిందని ఇఆర్‌సి చైర్మన్ శ్రీరంగారావు తెలిపారు. సుదీర్ఘచర్చల అనంతరం డిస్కమ్‌ల ప్రతిపాదనను ఇఆర్‌సి తిరస్కరించింది. ఇటీవల రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు సవరించాలని విద్యుత్ పంపిణీ సంస్థలుప్రతిపాదించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నెలకు 800 యూనిట్ల కంటే ఎక్కువ యూనిట్ల విద్యుత్ వాడితే స్థిర ఛార్జీని రూ.10 నుంచి రూ.50 పెంచాలని ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదనలపై ఇఆర్‌సి విచారణ పూర్తి

తరువాయి 2లో

13 మంది ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీ జరిగింది. 13 మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, నల్లగొండ కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి కలెక్టర్‌గా హనుమంతరావు, మున్సిపల్ శాఖ డైరెక్టర్‌గా టి.కె.శ్రీదేవి, సిసిఎల్‌ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మంద మకరందు, టూరిజం డైరెక్టర్‌గా కె.హనుమంతులు, తెలంగాణ ప్రా ధాన్య ప్రాజెక్టుల కమిషనర్‌గా శశాంక, ఐ అండ్ పిఆర్ ప్రత్యేక కమిషనర్‌గా ఎస్.హరీష్, ఆర్ అండ్ ఆర్ భూసేకరణ

తరువాయి 2లో

కమ్యూనిస్టుల వర్గపోరాటాలే

కుల చైతన్యానికి స్ఫూర్తి

'జనగణనలో కుల గణన' సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

సమసమాజమే లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ జరిపిన వర్గపోరాటాలే నేటి కుల చైతన్యానికి స్ఫూర్తి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సమాజంలో అన్ని రంగాలు, వర్గాల కోసం మొట్ట మొదటి నుంచి పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని ఉద్ఘాటించారు. బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో 'జనగణనలో కులగణన' అంశంపై రాష్ట్ర సదస్సు సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. ఈ సదస్సులో కూనంనేని సాంబశివరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆర్.అంజయ్య నాయక్ (తెలంగాణ గిరిజన సమాఖ్య), కె.కాంతయ్య (తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం), డి.జి.సాయిలుగౌడ్ (గీత పనివారల సంఘం), బొడ్డుపల్లి కృష్ణ (రజక సంఘం), డి.టి.నర్సయ్య (మత్స్య కార్మిక సంఘం) హాజరయ్యారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన న్యాయం దక్కాలన్నదే సిపిఐ లక్ష్యమన్నారు. బిసిలకు తరతరాలుగా అన్యాయం జరుగుతున్న నేపథ్యంలో వారికి న్యాయం కోసం జరుగుతున్న బిసి ఉద్యమాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ప్రపంచ స్వరూపాన్ని మార్చింది ఎర్ర జెండానే అన్నారు. ఈ దేశ భౌతిక పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకున్న కమ్యూనిస్టు పార్టీ అన్ని వర్గాల అభ్యున్నతికి సమ సమాజం కోసం ఉద్యమించిందన్నారు. మతాలు, కులాలను అడ్డంపెట్టుకుని ఎప్పుడూ రాజకీయం చేయలేదని, అదే పని చేసి ఉంటే కమ్యూనిస్టులు ఎప్పుడో అధికారంలో ఉండేవారని ఆయన అన్నారు. అదే బ్రాహ్మణీయ అధిపత్యం ఉన్న బిజెపి కులాల వారీగా రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూనే మతాన్ని, దేవుళ్లను అడ్డంపెటుకుని రాజకీయాలు చేస్తుండడంతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం కులం అనేది ఈ సమాజాన్ని ఓ భూతంలా పట్టి పీడిస్తోందని, దాని కోరలు పీకాలంటే ఆదివాసీ, గిరిజన, దళిత, బిసి వర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారి వాటా వారికి దక్కాల్సిందేనని, అందుకే కమ్యూనిస్టు పార్టీగా తాము సైతం ఉద్యమిస్తున్నామని సాంబశివరావు స్పష్టం చేశారు. అన్నివర్గాలకు సమన్యాయం

తరువాయి 2లో

బిసి హక్కుల సాధన సమితి (BCHSS)
రాష్ట్ర సదస్సు

DISTRICT COLLECTORATE KHAMMAM
ఖమ్మంలో...

తక్షణమే రుణమాఫీ చేయాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ప్రజాపక్షం / వరంగల్/ ఖమ్మం

రైతు రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు ధర్నాలు జరిగాయి. వరంగల్ కలెక్టరేట్ వద్ద తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పాల్గొనగా, ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు పాల్గొన్నారు. కాగా, వరంగల్ జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు రైతులు ప్రదర్శన నిర్వహించి ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిప్రతాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈసందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ వానాకాలం, యాసంగికి, రైతు భరోసా, రెండు లక్షలకు పైగా ఉన్న, రెండు లక్షల లోపు ఉన్న రుణమాఫీ వెంటనే చేయాలని, భూమి హక్కుల చట్టం త్వరితగతిన చే యాలని, సన్నరకం వడ్లతో పాటు దొడ్డు రకం వడ్లకు కూడా క్వింటాకు రూ.500 బోనస్ యివ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ.500, మొక్కజొన్నకు రూ.330, కందులకు రూ.400, సోయాకు రూ.450, పత్తికి రూ. 475, చెరుకుకు రూ. 850, జొన్నలకు రూ. 380 బోనస్ ఇస్తామని చెప్పిన పాలకులు ఆచరణలో అమలు చేయటంలో వైఫల్యం చెందరన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పాలకులు రైతాంగానికి ఇచ్చిన హామీలన్నింటిని సకాలంలో అమలు చేయడానికి నికరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వానా కాలం రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆశలపై నీరు చల్లినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానా కాలం రైతు భరోసా ఇవ్వమని చెప్పటంతో రైతులలో ఆందోళన విపరీతంగా పెరిగిందన్నారు. ఆలస్యమైనా రైతు భరోసా ఇస్తారన్న నమ్మకంతో ప్రైవేటు అప్పులు తీసుకొచ్చి వ్యవసాయానికి పెట్టుబడి పెట్టారని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సకాలంలో రైతు భరోసా రుణమాఫీ అమలు కాకపోతే రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని, రైతుల ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను పరిష్కరించటానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వీరగోని శంకరయ్య మాట్లాడుతూ రైతులను రుణాల నుండి విముక్తి చేయమని దేశవ్యాప్తంగా పోరాడుతున్నామని, మన రాష్ట్రంలో పాలకులు స్వయంగా ఎన్నికల ప్రణాళికలో ప్రకటించి కూడా అమ లు చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు వజ్రాల అరుణ,

తరువాయి 12లో

'హైదరాబాద్ బ్రాండ్'ను

దెబ్బతీస్తే ఊరుకోం

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీసే విధంగా ఎవరూ వ్యవహరించినా ఊరుకునే ప్రసక్తే లేదని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నగర శివారు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఫామ్ హౌస్‌లో కొంతమంది భయ భ్రాంతులకు గురి చేసే విధంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీయడంతో పాటు ఆర్థికంగా దెబ్బ తినేలా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో మధ్య నిషేదం లేదని, విందు, వినోదాలు చేసుకునేటప్పుడు ఎక్సైజ్ నిబంధనల మేరకు మద్యం అనుమతులు తీసుకోవాలని తెలియదా అని ప్రశ్నించారు. అర్ధరాత్రి డిజె సౌండ్ పెట్టి పక్క వాళ్లకు ఇబ్బంది కలిగే ప్రయత్నం చేస్తే ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు చేపట్టగా అక్కడ అనుమతులు లేని విదేశీ మద్యం దొరికిందని, అది మాజీ మంత్రి కెటిఆర్ బావమరిది ఫాంహౌజ్ కావడంతో మీడియా దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రి ,మంత్రుల కుట్ర ఉందన్నడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పోలీసుల మనోధైర్యాన్ని ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడం సరైంది కాదని, ఇలాంటి వ్యాఖ్యలతో పోలీసులు సమర్థవంతంగా పనిచేయడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతుందన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని పోలీసులు ఎలాంటి వివక్ష లేకుండా దర్యాప్తు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ ఘటనపై బిజెపి అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తన వైఖరి స్పష్టం చేయాలని, బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఎందుకు

తరువాయి 2లో

పోలీసుల ఎదుట

రెండు రోజుల్లో హాజరవ్వాలి

రాజ్ పాకాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ : ఫాంహౌస్‌లో పార్టీ వ్యవహారంలో మాజీ మంత్రి కెటిఆర్ బావమరిది రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బిఎన్ఎస్ఎస్ 35(3) సెక్షన్ ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు మోకిల పోలీసులు తెలిపారు. నోటీసుల నేపథ్యంలో రాజ్ పాకాల రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, తనను అరెస్ట్ చేయకుండా ఆర్డర్స్ ఇవ్వాలని పిటిషన్‌లో ఆయన కోరారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. పోలీసుల ఎదుట హాజయ్యేందుకు ఆయనకు రెండు రోజుల సమయం ఇచ్చింది. రాజ్ పాకాల తరఫున మయూర్‌రెడ్డి వాదనలు వినిపించగా, ఇంట్లో పార్టీ చేసుకుంటే అక్రమంగా పోలీసులు వచ్చి రైడ్ చేశారన్నారు. ఆయన కంపెనీలో పని చేసే ఉద్యోగికి డ్రగ్స్ పాజిటివ్ వస్తే రాజ్ పాకాలను నిందితుడిగా చేర్చారని కోర్టుకు వివరించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసు పెట్టారని, సోమవారం ఉదయం 9.30కి నోటీసులు పంపించి.. 11 గంటలకు విచారణకు రమ్మన్నారని కోర్టుకు ఆయన తెలిపారు. పోలీసుల తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. అరెస్టు చేస్తామని తాము ఎక్కడా చెప్పలేదని, ఇప్పటి వరకు ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్రమంగా మద్యం సీసాలు లభించడంతోపాటు విజయ్ మద్దూరి అనే వ్యక్తికి డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్

తరువాయి 12లో

'టూరిజం' హోటళ్లలో

ధరల కుంభకోణం

- విచారణలో వెలుగు చూసిన వైనం
- చర్యలు శూన్యం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ స్టేట్ టూరిజం డౌలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) హోటళ్లలో ధరల కుంభకోణం బైటపడింది. అధికారుల ఆకస్మిక తనిఖీల్లో ఈ కుంభకోణం వెలుగు చూసి మూడు నెలలు గడిచింది. ఇందులో సిబ్బంది ఎన్ని నిధులు కాజేశారు? టూరిజం శాఖకు ఎంత నష్టం కలిగింది? అధికారుల హస్తం ఏమైనా ఉందా? ఈ కుంభకోణానికి బాధ్యులు ఎవరు? తనిఖీల్లో సాక్ష్యాలతో సహా బయట పడ్డ ఈ కుంభకోణంపై ఉన్నతాధికారులకు ఇంత వరకు నివేదిక ఎందుకు ఇవ్వలేదు? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టిజిటిడిసి పర్యటకుల కోసం 24 హోటళ్లను నిర్వహిస్తుంది. అందులో హైదరాబాద్‌లో

తరువాయి 12లో

భవిష్యత్తులో విదేశాలకు

మేడిన్ ఇండియా విమానాలు : మోదీ

గుజరాత్‌లో తొలి ప్రైవేటు విమాన ఫ్యాక్టరీని ప్రారంభించిన భారత, స్పెయిన్ ప్రధాన మంత్రులు

వడోదర : గుజరాత్ రాష్ట్రం వడోదరలో సి295 ఎయిర్‌క్రాఫ్ట్‌ను తయారు చేసే టాటా ఎయిర్ క్రాఫ్ట్ కాంప్లెక్స్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్‌లు సోమవారం నాడు ప్రారంభించారు. ఎయిర్‌బస్ సి295 మధ్యతరహా వ్యూహాత్మక రవాణా విమానం . దీనిని తొలుత స్పెయన్‌కు చెందిన ఏరోస్పేస్ కంపెనీ కాసా డిజైన్ చేసి ఉత్పత్తి చేసింది. ప్రస్తుతం ఆ కంపెనీ ఐరోపా మల్టీనేషనల్ ఎయిర్‌బస్ డిఫెన్స్, స్పేస్ డివిజన్‌లో భాగమైంది. వైద్యపరమైన తరలింపు, విపత్తు స్పందన, సముద్ర తీర గస్తీ విధులకు సి295 విమానం ఉపయోగపడుతుంది. సి295 కార్యక్రమం కింద 56 విమానాలను భారత వైమానిక దళానికి డెలివరీకి ఆర్డర్‌లు రాగా, వాటిలో 16 నేరుగా స్పెయిన్‌లోని ఎయిర్‌బస్ కంపెనీ నుంచి డెలివరీ కానున్నాయి. మిగతా 40 విమానాలు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వడోదరలో తయారు కానున్నాయి. భారత వైమానిక దళంలో 1960ల నాటి ఆవ్రో–748 విమానాలను కొత్త సి295లతో మారుస్తారు. వీటి ఉత్పత్తి పూర్తయ్యాక పౌర విమానాల ఉత్పత్తిని ప్రారంభిస్తారు. వడోదర ప్రారంభించిన విమాన ఉత్పత్తి కేంద్రం భారతదేశంలో తొలి ప్రైవేటు మిలిటరీ విమాన తయారీ కేంద్రం. దీని ప్రారంభోత్సవం అనంతరం మోదీ, సాంచెజ్‌లు అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలియతిరిగి చూశారు. భారత్, స్పెయిన్‌ల భాగస్వామ్యం కొత్త దిశను కొనుగొంటున్నాయని

తరువాయి 12లో

చిరంజీవికి ఎఎన్ఆర్ జాతీయ అవార్డు

ప్రదానం చేసిన అమితాబ్

హైదరాబాద్: ఎఎన్నార్ జాతీయ అవార్డును నటుడు చిరంజీవి అందుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన అక్కినేని జాతీయ పురస్కార వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా సెప్టెంబరు 20న నాగార్జున ఈ అవార్డును ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, సోమవారం జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమానికి అక్కినేని కుటుంబ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

అమితాబ్ మాటలు విన్నాక.. నోట మాట రాలేదు : చిరంజీవి

అవార్డు అందుకున్న తరువాత చిరంజీవి మాట్లాడుతూ 'నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత అమితాబ్ బచ్చన్‌కు ముందుగా ధన్యవాదాలు. నాకు ఎప్పుడు ఏ మంచి జరిగినా, నాకు ఎప్పుడైనా అవార్డు వచ్చినా ఆయన నుంచే తొలుతగా నాకు శుభాకాంక్షలు వస్తాయి. కొన్ని సార్లు ఇలా వచ్చి ఆశీర్వదిస్తుంటారు. ఆయన లాంటి బిగ్‌స్టార్ నాకు ఈ అవార్డు ప్రదానం చేయడం ఆనందదాయకం' అని అన్నారు. 'పద్మ భూషణ్' అవార్డు వచ్చినప్పుడు నన్ను సినిమా పరిశ్రమ సన్మానించింది. ఆ సమయంలో అమితాబ్ నా గురించి 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అని చెప్పారు. ఆ మాటలు విన్నాక నాలో చిన్న వణుకు కనిపించింది. నా నోట మాట రాలేదు. నా మనసు అమితానందంతో నిండిపోయింది. ఆ రోజు ఆయనకు ధన్యవాదాలు సరిగా చెప్పానో లేదో గుర్తులేదు. అప్పుడు నా పరిస్థితి అలాంటిది. ఇండియన్ సినిమాకి బాద్‌షా, షెహన్ షా, చక్రవర్తి అయిన అమితాబ్ బచ్చన్ నోటి నుంచి ఆ మాటలు రావడం అంటే ఎంత పెద్ద విషయమో కదా. ఆయన మాటలు నన్ను ఎంతో ప్రోత్సాహం ఇచ్చాయి. ఆయన మాటలు

తరువాయి 12లో

బెంజిమిన్ నెతన్యాహుకు అవమానం

מאשלה
עם המון
דם על הידיים
HOSTAGE DEAL NOW

జెరుసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు తీవ్ర అవమానం ఎదురైంది. గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడిలో మృతి చెందిన వారి సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్న బందీల బంధువులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఏడాది దాటినా, ఇప్పటికీ వారిని విడిపించలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 'షేమ్ షేమ్' అంటూ నినాదాలు చేశారు. కాగా, నెతన్యాహు తన ప్రసంగంలో ఇరాన్, హిజ్బొల్లా దాడులను ప్రస్తావించారు. అటు గాజాలో, ఇటు లెబనాన్‌లో అనుకున్న లక్ష్యాలను అందుకున్నామని ప్రకటించారు. టెల్ అవీవ్, బీరుట్, గాజా, టెహ్రాన్: ఇరాన్లోని టెహ్రాన్, ఇలాం, కుజెస్థాన్‌లో ఉన్న సైనిక స్థావరాలతోపాటు క్షిపణి, డ్రోన్ తయారీ, ప్రయోగ కేంద్రాలపైన కూడా దాడులు జరిపామని వివరించారు. ఆ దాడుల్లో లక్ష్యాలన్నీ పూర్తి చేశామని పేర్కొన్నారు. క్షిపణి తయారీకి ఇరాన్ ఉపయోగించే ఘన ఇంధన మిశ్రమం ఉత్పత్తి కేంద్రాన్ని కూడా నేలమట్టం చేసినట్టు తెలిపారు. ఈ నష్టం నుంచి ఇరాన్ కోలుకోవడానికి చాలాకాలం పడుతుందని నెతన్యాహు వ్యాఖ్యానించారు. ఆయన మరిన్ని వివరాలను ప్రకటించే ఉద్దేశంతో కనిపించినప్పటికీ, హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారి కుటుంబీకులు, స్నేహితులు పెద్దఎత్తున నిరసనలకు దిగడంతో, అర్ధాంతరంగానే ప్రసంగాన్ని ముగించాల్సి వచ్చింది. ఇజ్రాయెల్‌లో చాలా మంది ప్రజలు గాజాపై దాడులను వ్యతిరేకిస్తున్నారు. తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, హమాస్‌తో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. హమాస్ అగ్రనేతయాహ్యా సిన్వర్ మృతితో కాల్పుల విరమణకు సరైన వాతావరణం ఏర్పడిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. కానీ, నెతన్యాహు తన మొండి వైఖరిని వీడకుండా, దాడులను కొనసాగించడంతో ఇజ్రాయెల్ ప్రజలే నిరసనలకు దిగుతున్నారు. బందీలన విడిపించేందుకు తక్షణ ప్రయత్నాలు జరిగాలని వారు కోరుతున్నారు.

గాజాపై కొనసాగుతున్న దాడులు..

గాజాపై దాడులకు ఇజ్రాయెల్ స్వస్తి పలకడం లేదు. తాజాగా బేట్ లహియాలోని ఆరు భవనాలపై బాంబుల వర్షం కురిపించింది. దీనితో 47 మంది పాలస్తీనియన్లు మృతి చెందినట్టు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. హమాస్ ఉగ్రవాదులు దాగి ఉన్నారని పేర్కొంటూ జనావాసాలపైన కూడా ఇజ్రాయెల్ దాడులకు దిగడాన్ని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. మానవ హక్కుల సంఘాలు కూడా విమర్శలు గుప్పిస్తున్నాయి. చివరికి ఇజ్రాయెల్‌లోనూ నెతన్యాహు వైకరిపట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధ జరుగుతుందేమోన్న అనుమానాలు తలెత్తుతున్న తరుణంలో, నెతన్యాహు కాల్పుల విరమణ ప్రకటన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రపంచం

ఖమేనీ 'ఎక్స్' అకౌంట్‌పై వేటు

ఇజ్రాయెల్‌పై హెచ్చరికలు జారీ చేయడమే కారణం

జెరుసలేం: ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ 'ఎక్స్' అకౌంట్‌పై వేటు పడింది. ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ఇజ్రాయెల్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసినందుకే ఈ చర్య తీసుకున్నారు. నిబంధనలను ఖమేనీ ఉల్లంఘించారని, అందుకే ఆయన అకౌంట్‌ను సస్పెండ్ చేశామని 'ఎక్స్' ప్రకటించింది. ఖమేనీకి 'ఎక్స్'లో పలు వేర్వేరు ఖాతాలు ఉన్నాయి. వీటిలో హిబ్రూ భాషలో పోస్టులు పెట్టేందుకు ఉపయోగిస్తున్న అకౌంట్‌ను రద్దు చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడాన్ని ఖమేనీ ఒక పోస్టులో వ్యతిరేకించారు. తీవ్రమైన పొరపాటు చేసిన ఇజ్రాయెల్ భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని @Khamenei_Heb అనే అకౌంట్ ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసి పొరపాటు చేశారని, తమ శక్తిసామర్థ్యాలు, ధైర్యం, పట్టుదల ఎలాంటివో త్వరలోనే తెలుసుకుంటారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇలావుంటే, 'ఎక్స్'లో ఉన్న ప్రధాన ఖాతా ద్వారా ఖమేనీ ఆంగ్లంలో పోస్టులు పెడతారు. కొన్ని సందర్భాల్లో హిబ్రూ భాషను ఉపయోగిస్తారు. అరబ్బీలో పోస్టులకు మరో అకౌంట్ ఉంది. 'ఖమైనీ మీడియా' పేరుతో సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన పలు వీడియోలు, ప్రకటనలు, సందేశాలు, ప్రవచనాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి.

యుద్ధ వాతావరణం..

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. హిజ్బొల్లా కమాండర్ ఫౌద్ షకుర్ ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందడంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఈ నెల ఒకటో తేదీన ఇజ్రాయెల్‌పై వందలాది క్షిపణులతో విరుచుకుపడింది. అందుకు బదులుగా ఇజ్రాయెల్ కూడా లెబనాన్ కేంద్రంగా ఉన్న హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగిస్తున్నది. ఇరాన్‌పైన కూడా దాడి చేయడంతో, రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. తమపై దాడికి దిగడం ద్వారా ఇజ్రాయెల్ తప్పు చేసిందని, అందుకు తగిన మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని ఇరాన్ సూపర్ లీడర్ అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు తావిచ్చాయి. ఏ క్షణంలోనైనా రెండు దేశాల మధ్య యుద్ధం తప్పదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చైనాలో తగ్గిన జననాల రేటు మూతపడుతున్న పాఠశాలలు

బీజింగ్: ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల దేశంగా పేరొందిన చైనా ఇప్పుడు భారత్ తర్వాత రెండో స్థానంలోకి చేరగా, భారీగా తగ్గుతున్న జననాల రేటు ఆందోళన కలిగిస్తున్నది. ఈ మార్పు పలు రంగాలపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. విద్యారంగంపై ఇప్పటికే జననాల తగ్గుదల ప్రభావం కనిపిస్తున్నది. చైనా విద్యాశాఖ నివేదికను అనుసరించి గత ఏడాది కిండర్‌గార్డెన్‌తో పోలిస్తే ఈ ఏడాది 14,808 కిండర్‌గార్డెన్స్ మూతపడ్డాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2,74,407 కిండర్‌గార్డెన్ స్కూల్స్ ఉండగా, గత ఏడాది కంటే ఇది 11 శాతం తక్కువ. 2023లోనూ 5645 పాఠశాలలు మూతపడినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వరుసగా రెండో సంవత్సరం కూడా చైనా జనభా తగ్గడమే ఈ పరిస్థితికి కారణం. ప్రస్తుతం చైనా జనాభా 140 కోట్లుగా ఉంది. గత ఏడాది జననాల సంఖ్య సుమారు 20 లక్షలు తగ్గాయని అంచనా వేస్తున్నారు. 1949 తర్వాత అతి తక్కువగా, 90 లక్షల జననాలు నమోదయ్యాయి. ఒకవైపు జననాల తగ్గుదల, మరోవైపు వృద్ధుల సంఖ్య పెరుగుదల చైనాకు సవాళ్లు విసురుతున్నాయి. పెరుగుతున్న వృద్ధుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, వారికి అన్ని రకాల సహాయసహకారాలు అందించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ

ఫలితాల తర్వాత 'హింస' జరుగుతుందని ప్రచారం

వాషింగ్టన్ డిసి : అమెరికా అధ్యక్ష ఎన్నికలు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. రష్యా–ఉక్రేన్ యుద్ధం నుంచి ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల వరకూ ప్రతి అంశాన్నీ ఈ ఎన్నికలతోనే ముడిపెడుతున్నారు. కాగా, ఎన్నికల ఫలితాల తర్వాత హింసాత్మక ఘటనలు జరుగుతాయన్న ప్రచారం కొనసాగుతున్నది. గత ఎన్నికల్లో డెమోక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ఓడిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, అప్పటి అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ తన మద్దతుదారులను హింసకు పురికొల్పారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార మార్పిడి సజావుగా జరగకుండా ఇలాంటి అడ్డంకులు ఎవరైనా సృష్టించవచ్చని ది అసోసియేటెడ్ ప్రెస్–ఎన్ఓఆర్‌సి సెంటర్ ఫర్ పబ్లిక్ ఎఫైర్స్ రీసెర్చ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 40 శాతం మంది ఓటర్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో డెమోక్రాటిక్ అభ్యర్థిగా తొలుత ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌ను ఎంపిక చేసినప్పటికీ, మరోసారి రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలోకి దిగుతున్న ట్రంప్‌తో జరిగిన మొదటి డిబేట్ తర్వాత తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొన్నారు. ఫలితంగా ఆయన రేసు నుంచి వైదొగ్గా, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌కు ఆ అవకాశం దక్కిన విషయం తెలిసిందే. తొలి డిబేట్ అనంతరం ట్రంప్ ఆధిక్యంలో ఉన్నట్టు కనిపించినప్పటికీ, ఆ తర్వాత క్రమంగా హారిస్ పట్టు బిగించారని వివిధ సర్వేలు పేర్కొన్నాయి. రెండో డిబేట్ అనంతరం కమల విజయం ఖాయమన్న అభిప్రాయం కూడా వ్యక్తమైంది. కానీ, ఇప్పుడు మళ్లీ పరిస్థితి ట్రంప్‌కు కొంత అనుకూలంగా మారినట్టు సమాచారం. కమలకు ఇండియన్–అమెరికన్స్ మద్దతు కొంత తగ్గిందని తాజా సర్వే వెల్లడించింది. 2020 ఎన్నికల్లో, భారత అమెరికన్లలో 22 శాతం మంది ట్రంప్‌కు మద్దతునివ్వగా, ఇప్పుడు ఆ సంఖ్య 31 శాతానికి చేరిందని ఈ సర్వే తెలిపింది. ఈ పరిణామం సహజంగానే డెమోక్రాట్స్‌లో ఆందోళనకు కారణమవుతున్నది. 40 సంవత్సరాలలోపు వయసుగల ఇండియన్ అమెరికన్లలో ట్రంప్‌కు 48 శాతం మంది మద్దతునిస్తుంటే, కమలకు 44 శాతం మంది అనుకూలంగా ఉన్నారని ఈ సర్వే స్పష్టం చేసింది. మొత్తం మీద కొత్త సర్వే డెమోక్రాట్లకు తగ్గిన ఆదరణ, రిపబ్లికన్స్‌కు పెరిగిన మద్దతు, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అమెరికా ఎన్నికల్లో హోరాహోరీ తప్పదని స్పష్టం చేస్తున్నాయి.

'హైదరాబాద్ బ్రాండ్'ను దెబ్బతీస్తే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి)

స్పందించడం లేదో స్పష్టం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

డ్రగ్స్ అంశం వస్తే కెటిఆర్ పేరు వస్తోంది : షబ్బీర్ అలీ

కెటిఆర్‌కు డ్రగ్స్‌తో సంబంధం ఉన్నట్టు ఉందని, అందుకే డ్రగ్స్ అంశం రాగానే కెటిఆర్ పేరు వస్తోందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అనుమానం వ్యక్తం చేశారు. కెటిఆర్ ఇప్పటికైనా నార్కో టెస్ట్ చేయించుకుంటే నిజం తెలుతుందన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డ్రగ్స్ విషయంలో తమ పేర్లు ఎందుకు రావడం లేదన్నారు. కెటిఆర్ పేరే ఎందుకు వస్తోందన్నారు. జన్వాడ ఫాం హౌజ్ విచిత్రమైందన్నారు. పార్టీ జరిగిన దగ్గర ఒక వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నాడని తెలినా కెటిఆర్ బుకాయించడం ఆశ్చర్యం కలిగిస్తుందని షెబ్బీర్ అలీ విస్మయం వ్యక్తం చేశారు. కెసిఆర్ కుటుంబ ఆస్తులు ఎలా పెరిగాయో విచారణ జరపాలన్నారు. కెసిఆర్ కుటుంబంలో 50 మందిపై విచారణ జరిపితే, తెలంగాణ పేరుతో ఎంత లూటీ చేశారో ప్రజలకు తెలుస్తుందన్నారు. జన్వాడ పామ్ హౌస్‌పై వాస్తవాలు చూపించినందుకు ఆరోజు ఎంపిగా ఉన్న రేవంత్ రెడ్డిని 40 రోజులు జైల్లో పెట్టారన్నారు. అండర్ ట్రయల్ ముద్దాయిగా పెట్టి, రేవంత్ రెడ్డిని చంపాలని చూశారని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

బామ్మర్దిని కాపాడుకోవడానికే కెటిఆర్ యత్నం : యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మంత్రిగా పనిచేసిన కెటిఆర్‌కు చట్టాలపైన కనీస పరిజ్ఞానంలేదని, అతని బావమరిది రాజ్ పాకాలను కాపాడుకోవడానికే ఆయన నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఎ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీల్లో 6.5 లీటర్ల కంటే ఎక్కువ మద్యం ఉంటే ఎక్సైజ్ పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని నిబంధన ఉన్నదని గుర్తుచేశారు. 111 జీఓను అతిక్రమించి రాజ్ పాకాల జన్వాడలో ఇళ్లు ఎలా నిర్మించారు? వారెంట్ ఎలా ఇస్తారో 10 ఏండ్లు సిఎంగా పనిచేసిన కెసిఆర్‌కు తెలియదా? అని శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేయడానికి ఎలాంటి వారెంట్ అవసరంలేదని తెలుసుకోవాలన్నారు. రేవ్ పార్టీ జరిగిందని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదని, మీడియాలో కథనాలు మాత్రమే వచ్చాయని స్పష్టంచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసినట్టుగా ఫాంహౌస్‌లో స్టింగ్, కోవర్ట్ ఆపరేషన్ల లాంటివి ఇప్పుడు జన్వాడ ఫాం హౌస్‌లో జరగలేదని చెప్పారు. గతంలో జూబ్లీహిల్స్ హై లైఫ్ పబ్‌కు రాజ్ పాకాల యజమాని అని, డ్రగ్స్ తీసుకునే జూబ్లీహిల్స్ గ్యాంగ్‌లో రాజ్ పాకాల సభ్యుడనే ప్రచారం ఉన్నదని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. రాజ్ పాకాల మీడియా ముందుకొచ్చి వివరణ ఇచ్చి ఉంటే అనుమానాలు వచ్చేవి కావని అన్నారు. తనకు రాజ్ పాకాలనే కొకైన్ ఇచ్చాడని విజయ్ మద్దూరి అనే వ్యక్తి పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఇది చాలా సీరియస్ విషయమన్నారు. రాజ్‌పాకాల వెంటనే పోలీసులకు లొంగిపోయి వివరణ ఇచ్చుకోవాలని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

కులగణనపై అఖిలపక్షం

(మొదటి పేజీ తరువాయి)

గణను చేపడతారా? అని ప్రశ్నించారు. కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని రాజ్యాంగం చెబుతోందన్నారు. అలాగే జనగణనలో తేలే జనాభా లెక్కల ఆధారంగానే రాజ్యాంగంలోని 82వ అధికరణ చెబుతున్నట్లుగా లోక్‌సభలో రాష్ట్రాల సీట్ల సంఖ్యను నిర్ధారిస్తారా అని అడిగారు. అలా జరిగితే కుటుంబ నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు నష్టం కలిగించదా అని ప్రశ్నించారు.ఈ రెండు కీలక అంశాలపై త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడం సబబు అని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియాగా పని చేస్తున్న మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ కేంద్ర డిప్యూటీషన్‌ను 2024 డిసెంబర్ 6 నుంచి 2026 ఆగస్టు 4 వ తేదీ వరకు రాష్ట్రపతి పొడిగిస్తున్నట్లు అధికారిక నోటిఫికేషన్ వెలువడింది. 1995 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి నారాయణ్ ఉత్తర్‌ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన వారు. ఆయన 2020 నుంచి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధీనంలో ప్రస్తుత బాధ్యతలలో ఉన్నారు.

వచ్చే ఏడాది జనగణన!

(మొదటి పేజీ తరువాయి)

18వ లోక్‌సభలో 543 స్థానాలకు ఏడు దశలో ఎన్నికలు జరిగాయి. ఇక వచ్చేసారి నియోజకవర్గాల పునర్విభజన వల్ల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఐతే ముందుగా దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను ఏడాదికాలంలో పూర్తిచేయాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నది. దానిపైనే తదుపరి పునర్విభజన ప్రక్రియ కూడా ఆధారపడి ఉంటుంది. కుల గణనను మినహాయించి ఈ జనాభా లెక్కల సేకరణ చేసేందుకే ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు భోగట్టా. కానీ ప్రతిపక్షాలు దేశంలో కులగణన జరగాలని గట్టిపట్టుదలతో ఉన్నాయి. వివిధ సంక్షే పథకాలు, అభివృద్ధి పథకాలను అమలు చేయాలన్నా, గ్రామీణ, పట్టణ పేదలకు, వివిధ రాయితీలు, పథకాలు అమలు చేసేందుకు జనగణన జరిపితీరాల్సిందే. కరోనా మహమ్మారి వ్యాప్తి చెందడంతో నిర్ణీత ప్రకారం జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం 2021లో ప్రారంభం కాలేదు.

పదేళ్ళకోసారి జనగణన : దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభాలెక్కల సేకరణ జరుగుతుంది. 1882లో మొదటిసారి మనదేశంలో జనాభా లెక్కల సేకరణ చేశారు. స్వాతంత్ర్యానంతరం 1951 నుండీ పదేళ్ళకోసారి జనాభా లెక్కలు సేకరిస్తున్నారు. చివరిసారి 2011లో దేశంలో జనభా లెక్కలు సేకరించారు. దీని ప్రకారం దేశ జనాభా 121.10 కోట్లుగా నమోదైంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 20 కోట్ల మందితో దేశంలో అత్యధిక జనాభాగల రాష్ట్రంగా మొదటిస్థానంలో ఉంది. అతి తక్కువ జనాభాగల కేంద్ర పాలితప్రాంతం లక్ష్వదీప్. ఈ ప్రాంతంలో 64,429 మంది జనాభా ఉంది. భూభాగ పరగా చూస్తే రాజస్థాన్ అతిపెద్ద రాష్ట్రం. దీని విస్తీర్ణం 3,42,239 చదరపు కిలోమీటర్లు. గోవా అతి చిన్న రాష్ట్రం. దీని విస్తీర్ణం 3,702 చదరపు కిలోమీటర్లు. 2011 గణాంకాల ప్రకారం దేశంలో ప్రతి 1,000 మంది పురుషులకు 940 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారు. దేశంలో అక్షరాస్యత 74.4శాతంగా నమోదైంది. 2001 నుండి 2011 వరకూ పదేళ్ళకాలంలో 17.64 శాతం జనాభావృద్ధి జరిగింది. ఈ లెక్కల ప్రకారం దేశంలో 68.84 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. 31.16 శాతం పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. దేశంలో 28 రాష్ట్రాలు ఉన్నాయి. ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలున్నాయి. ఐతే గడచిన పది సంవత్సరాలలో ఉత్తర ప్రదేశ్ సహా అధిక జనాభాగల ఆరు రాష్ట్రాలలో జనాభావృద్ధి రేటు 1991–2001, 2001–2011 మధ్యకాలంలో క్షీణించింది. ఉత్తర ప్రదేశ్‌లో వృద్ధిరేటు 25.85 శాతం నుండి 20.09 శాతానికి క్షీణించగా, మహారాష్ట్రలో జనాభావృద్ధిరేటు 22.73 శాతం నుండి 15.99 శాతానికి తగ్గింది. బీహార్‌లో 28.62 శాతం నుండి 25.07 శాతానికి తగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో 17.77 నుండి 13.93 శాతానికి తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభావృద్ధి 14.59 శాతం నుండి 11.10 శాతానికి తగ్గింది. మధ్యప్రదేశ్‌లో జనాభావృద్ధి 24.26 శాతం నుండి 20.30 శాతానికి తగ్గింది. 2025లో జనాభా లెక్కలు సేకరిస్తే ఈ గణాంకాలు 2035 వరకూ చెల్లుబాటు అవుతాయి. ఇప్పటికీ వివిధ పథకాలను అమలు చేయడానికి ఈ లెక్కలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. ఆ మధ్య ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశం భారతదేశమేనని, చైనా ద్వితీయస్థానంలో ఉందని ఐక్యరాజ్యసమితి ప్రకటించిన తర్వాత దేశంలో ఇప్పటివరకూ అధికారికంగా ఈ విషయాన్ని ధృవీకరించడానికి జనగణన జరగలేదు. ప్రపంచంలో చైనాను అధిగమించి భారతదేశం అత్యధిక జనాభాగల మొదటిదేశంగా మారిందని 2023 ఏప్రిల్‌లో ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటన చేసింది. చైనా జనాభా తరుగుదల దిశలో ఉందని పేర్కొంది. భారత దేశం జనాభా ప్రస్తుతం సుమారుగా 142 కోట్లు ఉంటుందని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. దీనిని వచ్చే ఏడాది జనగణన ద్వారా ధృవీకరించాల్సి ఉంది. జనాభా లెక్కల సేకరణ తర్వాత నియోజకవర్గాల సరిహద్దులను తిరిగి నిర్ణయించే ప్రక్రియ 1952 నాటి పునర్విభజన చట్టం కింద డీ లిమిటేషన్ కమిషన్ ద్వారా నిర్దేశిస్తారు. గడచిన 72 ఏళ్ళలో నాలుగుసార్లు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరిగింది. 1952, 1963, 1973, 2002లలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ప్రధాన ఇంధనం ఏది? రేడియో, టెలివిజన్, టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్నాయా? స్మార్ట్‌ఫోన్ లేదా మొబైల్ ఫోన్ ఉన్నాయా? సొంత కారు ఉందా? సొంత జీపు లేదా వ్యాన్ వంటివి ఉన్నాయా? తదితరాలతోపాటు ఇతర ప్రశ్నలు అడుగుతారు.

దక్షిణాదిన రాజకీయపార్టీల్లో ఆందోళన : ఈ ప్రక్రియను ఏడాదికాలంలో పూర్తి చెయ్యాలంటే పెద్దసంఖ్యలో వివిధ శాఖలకు చెందినవారికి ఈ బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కూడా ప్రారంభిస్తారు. జనాభా లెక్కల సేకరణ పూర్తయిన తర్వాత దాని ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలంటే రాజ్యాంగంలోని 82 అధికరణను సవరించాల్సి ఉంటుంది. అందువల్ల నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేముందుగానే ప్రభుత్వం ఈ విషయాలను ఆలోచించుకోవాల్సి ఉంటుందని వర్గాలు తెలిపాయి. ఈ తతంతగమంతా 2028 నాటికి పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశం చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఐతే దీనిపై కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిర్దిష్ట ప్రకటన చేయవలసి ఉంటుంది. జనాభా లెక్కల సేకరణ దేశంలో 2025లో ప్రారంభమై ఏడాది కాలంలోనే పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను కూడా ప్రారంభిస్తే, తదుపరి 2029లో 19 పార్లమెంటు ఎన్నికలకు పూర్తిరంగం సిద్ధమైనట్లవుతుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై చాలా రాష్ట్రాలు ఇప్పటినుండీ భయాందోళన వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గాల సరిహద్దుల పునర్నిర్ధారణ ప్రక్రియద్వారా దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గేఅవకాశం ఉందని పలు పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, డెయిరీ కార్పొరేషన్ ఎండిగా కె.చంద్రశేఖరరెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.దిలీప్, కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు, హోంశాఖ జాయింట్ సెక్రటరీగా ఐషా మస్రత్ ఖానంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కమ్యూనిస్టుల వర్గపోరాటాలే కుల చైతన్యానికి స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

జరిగితే కమ్యూనిస్టు పార్టీ అంతిమ లక్ష్యమైన సమసమాజం స్థాపనకు మార్గం సుగమం అయినట్లే ఆయన అన్నారు.

బిసిలకు 40 ఏళ్ల రిజర్వేషన్లు లేకపోవడమే వెనకబాటుకు కారణం : చిరంజీవులు

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ సమాజంలో అన్ని విధాలుగా వెనకబాటు తనానికి గురైన బిసిలకు పాలకవర్గాలు ఎప్పుడూ అన్యాయం చేస్తూనే ఉన్నాయని గ్రహం వ్యక్తం చేశారు. 1951లో కులగణను చేపట్టాల్సి ఉండగా, అప్పటి ప్రధాని నెహ్రూ కులగణనను తిరస్కరించగా, చివరికి జనతాదళ్ ప్రభుత్వ హాయంలో అప్పటి ప్రధాని విపి.సింగ్ 1991లో బిసిలకు విద్యా, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. 1951 నుంచి 1991 వరకు అంటే దాదాపు 40 ఏళ్ల పాటు బిసిలు లక్షల సంఖ్యలో ఉద్యోగులు, విద్యా అవకాశాలను కొల్పోవడమే నేటి వెనకబాటుతనానికి కారణమని ఆయన చెప్పారు.

దేశంలో కులం అనేది సామాజిక వాస్తవం : ప్రొఫెసర్ ప్రంభజన్ యాదవ్

ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో 89 శాతంగా ఉన్న దళిత, బలహీన వర్గాలకు అధిపత్య బ్రహ్మణీయ సమాజం తరతరాలుగా అణిచివేయడంతో వెనకబాటు తనానికి ఈ వర్గాలు నెట్టివేయబడ్డాయన్నారు. అందుకే బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్న తరుణంలో దానిని సాధించుకునేందుకు సంఘటితంగా ఉద్యమించాల్సిందేనన్నారు. ఇందుకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ వర్గ పోరాటాల క్రమంలోనే కులాల ప్రతిపాదికన కూడా పోరాటాలు నిర్వహించి ఉంటే ఈ దేశంలో ఇతర పార్టీలు పుట్టేవే కాదేమోనని అన్నారు. ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేవరకు బిసి హక్కుల సాధన సమితి విశ్రమించబోదన్నారు. ఉద్యమంలో అవసరమైతే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. బిసి హక్కుల కోసం ఒక వైపు ఉద్యమిస్తూనే మరోవైపు అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను నిలువరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా బిసిహక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో చైతన్య జాతాను చేపట్టనున్నట్లు ప్రకటించారు. తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ 'సమాజంలో మనమెంతో మనకు అంత వాటా దక్కాల్సిందే' నని స్పష్టం చేశారు. అంజయ్య నాయక్ మాట్లాడుతూ 77 ఏళ్ల స్వతంత్ర్య భారతావణిలో ఆదివాసీ, గిరిజన, దళిత, బిసివర్గాలు నేటికీ రిజర్వేషన్లు అడుక్కునే పరిస్థితి ఉండడం దారుణమన్నారు. కె.కాంతయ్య మాట్లాడుతూ అగ్రవర్ణాలు అతి తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ దేశంలో మొదటి నుంచి కూడా బ్రహ్మణీయ అధిపత్యం కొనసాగడమే, 89 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలను శాసించడానికి కారణమైందన్నారు. సదస్సులో బిసి సంఘాల నాయకులు కొలా జనార్ధన్, చీమల శంకర్ (బిసి ఉద్యమ సంఘం) బిసి హక్కుల సాధన సమితి నాయకులు ధనంజయ నాయక్, తాటి వెంకటేశ్వరరావు, పి.యాదయ్య, మెరుగు కుమార్, కె.ప్రమిల, శ్రావణ్ కుమార్, ఎన్.రాజమౌళి, సి.హెచ్ దశరథ్, ఇ.ఉమామహేశ్, జె.లక్ష్మి వేదికపై ఆశీనులయ్యారు.

విద్యుత్ ఛార్జీల పెంపు లేనట్టే

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఈ నేపథ్యం లో ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ ఛార్జీలు ఎలా ఉన్నాయనే వివరాలతో డిస్కమ్‌లు ఈఆర్‌సికి తాజాగా నివేదికను అందజేశాయి. పరిశీలన అనంతరం పెంపు ప్రతిపాదనను ఈఆర్‌సి తిరస్కరించింది.

అన్ని ఫిటిషన్‌లపై ఎలాంటి లాప్స్ లేకుండా వెల్లడించాలని నిర్ణయించిందని శ్రీరంగారావు అన్నారు. 40 రోజుల తక్కువ సమయంలో నిర్ణయం వెలువరిస్తున్నాం. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, వినియోగదారులు, ప్రభుత్వ సబ్సిడి దృష్టిలో పెట్టుకొని కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. ఎనర్జీ చార్జీలు ఏ కేటగిరిగిలో కూడా పెంచడం లేదు. స్థిర చార్జీలు రూ.10 యధాతదంగా ఉంటాయి. పౌల్ట్రీ ఫామ్, గోట్ పామ్‌లను కమిషన్ ఆమోదించలేదు. హెచ్ కేటగిరిలో ప్రతిపాదనలు తిరస్కరించామని ఆయన వివరించారు. 132 కెవిఏ, 133 కెవిఏ, 11 కెవిలలో గతంలో మాదిరిగానే ఛార్జీలు ఉంటాయి. లిఫ్ట్ ఇరిగేషన్‌కు కమిషన్ ఆమోదించింది. టైమ్ ఆఫ్ డేలో పీక్ అవర్‌లో ఎలాంటి మార్పు లేదు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలకు నాన్ పీక్ అవర్‌లో రూపాయి నుంచి రూపాయిన్నర రాయితీ పెంచాం. చేనేత కార్మికులకు హార్స్ పవర్‌ను పెంచాం. హెచ్‌పి 10 నుంచి హెచ్‌పి 25కి పెంచాం. గృహ వినియోగదారులకు మినిమమ్ చార్జీలు తొలగించామని శ్రీరంగారావు తెలిపారు. గ్రిడ్ సపోర్ట్ చార్జీలు కమిషన్ ఆమోదించింది. ఆర్‌ఎస్‌పి ఇవి కేవలం ఐదు నెలల వరకే ఉంటాయి. రూ.11,499.52 కోట్లు ప్రభుత్వం సబ్సిడి ఇచ్చింది. రూ.1,800 కోట్లు ప్రతిపాదనలు ఇచ్చారు. డిస్కమ్‌ల రూ.57,728.90 పిటిషన్ వేస్తే, ఈఆర్‌సి రూ.54,183.28 కోట్లు ఆమోదించింది అని వివరాలు వెల్లడించారు.

2022లో ఫీజు రెగ్యులేషన్‌ను అమెండ్ చేశాం. విద్యుత్ పంపిణి సంస్థలు సకాలంలో పిటిషన్ వేయడంలో ఆలస్యం చేస్తున్నాయి. అందుకే వాటికి ఫైన్ వేస్తున్నాం. పేదలకు భారం కాకూడదని ఉద్దేశంతోనే జరిమానాలు వేస్తున్నాం. కోటి 50 లక్షల జరిమానా కమిషన్‌కు వచ్చాయి. ఏడాదికి రూ. 582 కోట్లు విద్యుత్ సంస్థలు కోల్పోతాయి. 5 ఏండ్లలో రూ. 2000 కోట్లు సంస్థలు కోల్పోయే అవసరం ఉంది. మొదటి సంవత్సరంగా భావించి ఆర్‌ఓఈ నిబంధనను ఒక ఏడాదికి మార్చాం. దీన్ని కమిషన్ తీసుకున్న కఠిన నిర్ణయంగా చూడొద్దు. విద్యుత్ సంస్థలు ఇప్పటియినా నవంబర్ 30 లోపు పిటిషన్ వేయాలి. ఇంత త్వరగా ఎందుకు ఆమోదం చేశారని అడుగుతున్నారని, వాళ్ళు పిటిషన్ వేశారు కాబట్టి చేయాల్సి వచ్చిందని శ్రీరంగారావు అన్నారు.

త్వరగా నివేదికలు ఇవ్వాలి

అధికారులకు పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాగ్ నివేదికలో లేవనెత్తిన అంశాలు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమర్పించిన నివేదికలను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ క్షుణంగా పరిశీలిస్తుందని కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ తెలిపారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన కమిటీ రెండవ సమావేశం సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో పిఏసి సభ్యులు కూనంనేని సాంబశివరావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టి.భానుప్రసాదావు, రామారావు పవార్, వేముల ప్రశాంత్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, అకౌంటెంట్ జనరల్ పి.మాధవి, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నర్సింహా చార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంప్ట్రోలర్ అడిటర్ జనరల్ (కాగ్) సమర్పించిన నివేదికలు, పిఏసి పరిశీలించిన ఆడిట్ పేరాలు, కాగ్ గుర్తించిన అంశాలకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సమర్పించిన వివరణతోపాటు పలు అంశాలపై కమిటీ చర్చించింది. ఈ సందర్భంగా చైర్మన్ అరికెపూడి గాంధీ మాట్లాడుతూ 32 ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 2024 సెప్టెంబరు 30వ తేదీ నాటికి కాగ్ నివేదికల ప్రకారం తెలంగాణకు సంబంధించి 302 ఆడిట్ పేరాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 202 ఆడిట్ పేరాలు పెండింగులో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 12 కమిటీల 4 సిఫార్సులు, 302 ఆడిట్ పేరాలకుగాను కొన్నింటికి అధికారులు వివరణతో పాటు తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికలు అందజేయగా, ఇంకా చాలా వాటికి రావాల్సి ఉందని వెల్లడించారు. వీటిని కమిటీ వీలైనంత త్వరగా కమిటీకి సమర్పించేలా సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకోవాలని చైర్మన్ కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పేరాలు కమిటీ చేసిన సిఫారసులకు సంబంధించిన వివరణలతో పాటు తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికలు సకాలంలో కమిటీకి సమర్పిస్తామని తెలిపారు. సంబంధిత శాఖల కార్యదర్శులు తమ ఆధ్వర్యంలోని శాఖాధిపతులను తక్షణం పంపించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయి నుంచి అవసరమైన సమాచారం రావడంలో ఆలస్యం కావడమే పెండింగ్‌కు కారణమవుతోందని, దీనిపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించనున్నట్లు ఆమె తెలిపారు. పెండింగ్‌లు లేకుండా లెజిస్లేచర్ సెక్రటేరియట్ సమన్వయంతో నోడల్ అధికారిని నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటామని సిఎస్ చెప్పారు. అకౌంటెంట్ జనరల్ పి.మాధవి మాట్లాడుతూ కాగ్ రిపోర్టులలోని ఆడిట్ పేరాలను పరిశీలించి అవసరమైన సిఫార్సులను చేయడంలో తమ వైపు నుండి అవసరమైన గైడెన్స్ కమిటీకి ఎల్లవేళలా ఉంటుందని, కమిటీ సభ్యుల సందేహాలను నివృత్తి చేయడానికి, అవసరమైన సమాచారం అందించడానికి తామెల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ ఆడిట్ పేరాలు, కమిటీ సిఫారసులకు సంబంధించి పెండింగులో ఉన్న వివరణాత్మక నోట్స్, చర్యా నివేదికలు సమర్పించే అంశంలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

బెటాలియన్ పోలీసుల ఆందోళనపై ప్రత్యేక నిఘా

సచివాలయం వద్ద భద్రత పెంపు

ఇందిరాపార్క్ వద్ద బెటాలియన్ పోలీసుల ధర్నా

ఇప్పటికే 10 మంది డిస్మిస్, 34 మంది సస్పెండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో బెటాలియన్ పోలీసుల ఆందోళనల నేపథ్యంలో సచివాలయ భద్రతా సిబ్బందిపై ప్రభుత్వం నిఘా పెంచింది. సిబ్బంది కదలికలు, వారి సోషల్ మీడియా యాక్టివిటీస్‌పై ఫోకస్ పెంచింది. ఈమేరకు సోమవారం సచివాలయ సిబ్బందికి పలు ఆదేశాలను చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సిఎస్‌ఒ)కు జారీ చేశారు. సోమవారం నుంచి సచివాలయం చుట్టూ 2 కి.మీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడటం, ధర్నాలు, రాస్తారోకోలు, సచివాలయ ముట్టడి లాంటి వాటిల్లో పాల్గొంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు. రాష్ట్రానికి అతి ముఖ్యమైన సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నందున ఇక్కడి సిబ్బంది అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోవద్దని, ఏ ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం అందరి మీద పడుతుందని పేర్కొన్నారు. కొంతమంది వాట్సాప్ గ్రూప్‌లో అడ్మిన్‌గా వ్యవహరిస్తూ మిగతా సిబ్బందిని ఆ గ్రూప్‌లలో యాడ్ చేస్తూ టిజిఎస్‌పి వ్యవస్థ గురించి, పోలీసు ఉన్నతాధికారుల గురించి రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని, ప్రతి కదలికపై నిఘా పెట్టామని తెలిపారు. అటువంటి గ్రూప్‌లలో ఎవరైనా ఉంటే తక్షణమే ఎగ్జిట్ కావాలని ఆదేశించారు. మీరు, మీ కుటుంబ సభ్యులు ఎటువంటి ధర్నాలలో, ర్యాలీలు, రాస్తారోకోలు వంటి అనుమతి లేని కార్యక్రమాల్లో పాల్గొంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం, పోలీసు అధికారులకు వ్యతిరేకంగా వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్, టెలిగ్రామ్‌లలో టీజీఎస్పీ వ్యవస్థ, పోలీసు ఆఫీసర్లు, ప్రభుత్వం గురించి వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా పోస్టులు చేయడం లేదా అలాంటి వాటికి లైక్, షేర్, కామెంట్ లాంటివి చేయవద్దని ఒక వేళ అలా చేస్తే వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని సిఎస్‌ఒ హెచ్చరించారు.

ఇందిరాపార్క్ వద్ద ధర్నా-అరెస్టు

రాష్ట్రంలో ఒకే పోలీసు విధానం ఉండాలని ఆందోళనలు జరిపిన టిజిఎస్‌పి బెటాలియన్‌లకు చెందిన

10 మంది సిబ్బందిని ప్రభుత్వం సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు మరో 34 మందిని సస్పెండ్ చేసింది. వీరందర్నీ తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతూ టిజిఎస్‌పి పోలీసులు సోమవారం ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నాకు బైఠాయించారు. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్తత తలెత్తింది. వీరంతా సచివాలయాన్ని ముట్టడించే అవకాశాలు ఉండటంతో పోలీసు బలగాలను మొహరించారు. వీరి ధర్నాకు ఎలాంటి అనుమతి లేకపోవడంతో ధర్నాకు బైఠాయించిన వారందినీ బలవంతంగా అరెస్టు చేసి గోషామహల్ స్టేడియంకు తరలించారు. స్వంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

సిఎం సెక్యూరిటీలో మార్పులు

తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసు (టిజిఎస్‌పి) బెటాలియన్ పోలీసుల ఆందోళనలు, డిస్మిస్, సస్పెండ్లతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతా సిబ్బందిని మారుస్తూ ఇంటెలిజెన్స్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు సిఎం ఇంటివద్ద విధులు నిర్వహించిన బెటాలియన్ పోలీస్ సిబ్బందిని సిఎం సెక్యూరిటీ వింగ్‌కు మార్చింది.ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులను నియమించారు. ఈ మార్పులను సోమవారం నుంచే అమలు చేశారు. కాగా, గతకొన్ని రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనలు చేస్తున్నారు. కర్నాటక, తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఇప్పటికే సెలవుల విషయంలో వెనక్కి తగ్గినట్లు పోలీస్ శాఖ ప్రకటన విడుదల చేసినా ఆందోళనలు ఆగడం లేదు. దీంతో సిఎం రేవంత్ ఇంటివద్ద విధులు నిర్వహిస్తున్న బెటాలియన్ పోలీసులను మారుస్తూ డిపార్ట్మెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

డ్రగ్స్‌తో పట్టుబడిన బిటెక్ విద్యార్థి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నెల్లూరులో బిటెక్ చేశాడు..సాఫ్ట్‌వేర్ స్కిల్స్ నేర్చుకోవడానికి హైదరాబాద్‌కు వచ్చి జెఎన్‌టియులో చేరాడు. చదువుతోపాటు డ్రగ్స్, గంజాయికి అలవాటు పడ్డాడు. వీటి కొనుగోలుకు డబ్బులు లేక పోవడంతో డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతూ ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే.. వనస్థలిపురం ఎస్‌విఆర్ గార్డెన్, క్రాంతిహిల్స్‌కాలనీ సుష్మా థియేటర్ సమీపంలో డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ ఏ టీమ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సుష్మా థియేటర్ సమీపంలో అనుమానంగా ఉన్న వ్యక్తిని పట్టుకున్నారు. తనిఖీలు నిర్వహించగా ఆతడి వద్ద 7 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ లభించాయి. డ్రగ్స్‌పాటు ఆతడి వద్ద ఉన్న బైక్‌తో పాటు సెల్ ఫోనును స్వాధీనం చేసుకున్నారు.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మంగళంపల్లి జనార్ధన్ మృతి

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్ధన్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం జరిగిన జనార్ధన్ అంత్యక్రియలకు పెద్ద ఎత్తున సిపిఐ శ్రేణులు, సాధారణ ప్రజలు పాల్గొన్నారు. ఆయన చిన్నతనంలోనే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై పలు ప్రజా సంఘాలతో పాటు పార్టీ నాయకుడిగా పనిచేస్తున్నారు. జనగామలో జరిగిన అనేక గుడిసెవాసుల పోరాటాలు, చేనేత కార్మిక సంఘాల పోరాటాలతో పాటు చిల్పూరు మండలంలో జరిగిన పలు భూ పోరాటాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కార్మికులకు కనీస వేతనాలు, పింఛన్లు, కూలీ రేట్ల పెంపు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

పలువురి నివాళి : మంగళంపల్లి జనార్ధన్ భౌతిక కాయానికి పలువురు నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, నాయకులు బోగ శ్రీరాములు, బికెఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, నాయకులు, సోమన్న, శ్రీశైలం, వైకుంఠం, అశోక్, కావటి యాదగిరి, జువార రమేష్, కాంగ్రెస్ నాయకులు మేడ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ జక్కుల అనిత వేణుమాధవ్, డాక్టర్ సిహెచ్ రాజమౌళి, రాంచందర్‌తో

పాటు పలు రాజకీయ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్రసమితి సంతాపం : చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఐ జనగామ జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి బాధాకరమని వారన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నట్లు సాంబశివరావు తెలిపారు.

ఉద్యమ చరిత్రను నేటి తరానికి అందిద్దాం

ప్రజాపక్షం / ఖమ్మం : వందేళ్ల ఉద్యమ చరితను నేటి తరానికి అందిద్దామని చరిత్రను తెలిపి నేటి తరాన్ని ఉద్యమం వైపు ఆకర్షించడంతో పాటు కార్యోన్ముఖులను చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. 1925 డిసెంబరు 26న ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమ విజయాలను చవిచూసిందని లక్ష్యం దిశగా పయనించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిందని ఆయన తెలిపారు. డిసెంబరు 26 నుంచి జరగనున్న శతాబ్ది ఉత్సవ లోగోను పువ్వాడ నాగేశ్వరరావు సిపిఐ నాయకులతో కలిసి స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్యానికి పూర్వం ఆ తర్వాత అనేక నిర్బంధాలను చవిచూసిందన్నారు. పాలకులు కమ్యూనిస్టుల పట్ల వ్యతిరేకతతో నిషేధించిన ప్రజల కోసం పనిచేయడంలో ఏనాడు వెనుకంజ వేయలేదన్నారు.

ఈ వందేళ్ల చరిత్రలో అనేక చారిత్రిక ఉద్యమాలకు కమ్యూనిస్టు పార్టీ నెలవైందన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువజన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని పువ్వాడ స్పష్టం చేశారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేశామని సిపిఐ చేపట్టిన ప్రతి ఉద్యమం ఒక చారిత్రిక అంశంగా మారిందని దున్నేవానికే భూమి దక్కాలని పనిచేసే వానికి పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కమ్యూనిస్టు పార్టీ నినాదించిందన్నారు.

వాడవాడలా ఉత్సవాలు : బాగం

సిపిఐ శత జయంతి ఉత్సవాలను వాడ వాడలా నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. డిసెంబరు 26 నుండి 2025 డిసెంబరు 25 వరకు ఏడాది పొడవునా ఉత్సవాలను నిర్వహించాలని జాతీయ సమితి నిర్ణయించిందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతా దేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు,పోటు కళావతి, బిజి క్లెమెంట్, రామ్మూర్తి, రావి శివరామకృష్ణ, రవీంద్ర బాబు, మేకల శ్రీను, సుధాకర్, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, మల్లికార్జున్, శ్రావణ్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని

నేడు నిరసన దీక్ష : ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మ ణ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం (నేడు) అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సత్యనారాయణ రెడ్డి భవన్ లో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్టలక్ష్మ ణ్ తెలిపారు. నిరసన దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి వద్ద వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు బోధన రుసుం, ఉపకార వేతనాలు గడిచిన మూడేళ్లుగా విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో డిగ్రీలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు మూడేళ్ల కోర్సు పూర్తి చేసినా ఫీజులు రాకపోవడంతో కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం లేదని, దీంతో వారు పై చదువులకు వెళ్లలేక ఇటు ఫీజులు చెల్లించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. తక్షణమే విద్యార్థులు పెండింగ్ ఫీజులు, ఉపకారా వేతనాలు విడుదల చేయాలని నేడు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటిక్యాల రామకృష్ణ,నెల్లి సత్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంశీవర్ధన్ రెడ్డి, చైతన్య యాదవ్, అన్వర్, ఉదయ్ కుమార్,హరీష్, నాయకులు అరుణ్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

టి-సాట్ ద్వారా ఉన్నత విద్య

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యను టిసాట్ ద్వార అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని టిసాట్ కార్యాలయాన్ని ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఇ.పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌లతో కలిసి సోమవారం సందర్శించారు. టిసాట్ సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి బాలకిష్టారెడ్డి బృందానికి ఈ సందర్భంగా స్వాగతం పలికారు. సిఈఓ తన ఛాంబర్‌లో టిసాట్ పనితీరు, ప్రాథమిక, ఇంటర్మీడియట్, పోటీ పరీక్షలు, ఇతర విభాగాలకు ఏవిధంగా ఉపయోగపడుతుందో బాలకిష్టా రెడ్డి బృందానికి వివరించారు. ఉన్నత విద్యలో భాగమైన విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించి టిసాట్ వేదికను ఉపయోగించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో నాణ్యమైన డిజిటల్ కంటెంట్‌ను ఉన్నత విద్యనభ్యసించే వారికి అందించే విధంగా ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసుకుందామని, ఉన్నత విద్యామండలి విడుదల చేసే పరీక్షా ఫలితాలను టిసాట్ వెబ్ సైట్ ద్వార విడుదల చేయాలని వేణుగోపాల్ రెడ్డి కోరగా బాలకిష్టారెడ్డి సానుకూలంగా స్పందించారు. అనంతరం టిసాట్ కార్యాలయంలోని స్టూడియోలతో పాటు వివిధ విభాగాలను ఛైర్మన్ బృందం కలియ తిరిగి, టిసాట్ మౌళిక సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన, విలువైన విద్యను తెలంగాణాలోని ప్రతి ఇంటికీ, ప్రతి వ్యక్తికీ అందించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఉన్నత విద్యా మండలి 52 మాడ్యూల్స్‌లో ఉన్నత విద్యకు సంబంధించిన కంటెంట్ అందుబాటులోకి తెచ్చే విధంగా సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యరంగాన్ని పటిష్టం చేస్తామని, ఆ ప్రక్రియలో భాగంగా టిసాట్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కుటుంబం పరువు పోతుందనే కెసిఆర్ బయటకొచ్చిండు

తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్

ప్రజాపక్షం / హైదరాబాద్ : తన కుటుంబం పరువు బజారున పడిందనే మాజీ సిఎం కెసిఆర్ బయటకు వచ్చారే తప్ప, ఆయనకు ప్రజల సమస్యలు పట్టవని తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. కెసిఆర్ తెలంగాణ ప్రజల కోసం డిజిపికి ఫోన్ చేయలేదని, ఆయన కుటుంబ కోసం ఫోన్ చేసుకున్నారని అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్‌కు రేవ్ పార్టీలు తప్ప ఏ పార్టీలు తెలియవని ఎద్దేవా చేశారు. రేవ్ పార్టీలో ఎవరున్నా వదిలిపెట్టొద్దని, వారందరినీ అరెస్టు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డిపై అవమానకరంగా మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే హరీశ్‌రావును అసెంబ్లీలో అడుగు పెట్టనీయబోమని సాయికుమార్ హెచ్చరించారు. ఇప్పటికే హరీశ్‌రావుపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద ఫిర్యాదు చేశామని, వెంటనే పోలీసులు అతనిని అరెస్టు చేయాలని కోరారు. సిఎం పదవికి రేవంత్ రెడ్డి వన్నె తెచ్చారని, సిఎం అంటే క్రెడిబులిటీ మాన్ అని రేవంత్‌రెడ్డి నిరూపించారని కొనియాడారు. హరీశ్‌రావు లాంటి నాయకుల వల్ల తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ

6 నుంచి పనులు ప్రారంభం

అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణాలు

6 వేల మందికి శిక్షణ ఇచ్చేలా మౌలిక సదుపాయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం డిజైన్లు తయారు చేయించింది. నవంబర్ ఆరు నుంచి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో దాదాపు 57 ఎకరాల విస్తీర్ణంలోని యూనివర్సిటీ స్థలంలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ తో పాటు అకాడమిక్ బ్లాక్, వర్క్ షాపులు, గర్ల్స్, బాయ్స్ హాస్టల్ బిల్డింగ్ లు, డైనింగ్ హాల్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. వీటితో పాటు ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్లు రూపొందించారు. సువిశాల ప్రాంగణంలో ఎక్కువ ఖాళీ స్థలం, గ్రీనరీ ఉండేలా భవన నమూనాలు తయారు చేయించారు. ఆరు వేల మంది విద్యార్థుల నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా క్యాంపస్ లో నిర్మాణాలను చేపట్టనుంది. అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లను అమర్చనున్నారు. వీటితో పాటు విద్యుత్తు వినియోగం తగ్గించేలా ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో గాలి వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్లలో వర్క్ షాపులు , అకడమిక్ బిల్డింగ్ లు నిర్మిస్తారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలుండేలా యూనివర్సిటీ క్యాంపస్‌ను దేశమందరి దృష్టిని ఆకర్షించేలా నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆర్టిటెక్ట్ ఇంజనీర్లకు, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మెఘా కంపెనీ ప్రతినిధులకు సూచించారు. నవంబర్ 6వ తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎనిమిది నుంచి పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది. స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి మెఘా కంపెనీ ఇటీవలే రూ.200 కోట్లు విరాళం అందించింది. తమ ఇంజనీరింగ్ నైపుణ్యంతో క్యాంపస్ ను అధునాతనంగా నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఇటీవలే అదానీ కంపెనీ స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు విరాళం అందించింది. వీటితో పాటు వివిధ కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యం, విరాళాల ద్వారా సమీకరించిన నిధులన్నీ కార్పస్ ఫండ్ జమ చేస్తోంది.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్ల సర్వీసులు పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : దీపావళి, ఛత్ పండుగల నేపథ్యంలో ప్రయాణీకులకు ఎలాంటి అవాంతరాలు రాకుండా దక్షిణ మధ్య రైల్వే అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. పండుగ కారణంగా రైలు ప్రయాణానికి పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ పండుగ సీజన్లో ప్రయాణీకుల భారీ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను ప్రముఖ మార్గాల్లో నడుపుతున్నారు. ఈ సీజన్లో, 850 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఉన్న రైళ్లకు అదనపు కోచ్లు జోడించారు. ప్రయాణికులు సాఫీగా టిక్కెట్లను తీసుకోవడానికి అనుకూలంగా ప్రధాన స్టేషన్లలో 14 అదనపు కౌంటర్లతో సాధారణ టికెటింగ్ కార్యకలాపాలను పెంచారు.

5న నుంచి ఆర్‌టిసి జెఎసి ఉద్యమబాట

విజయవంతం కోసం నేతల డిపోల పర్యటనలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తమ దీర్ఘకాల సమస్యలపై ఆర్‌టిసి ఉద్యోగులు నవంబర్ 5 నుంచి ఉద్యమ బాట పట్టనున్నారు. టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో నవంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని, డిసెంబర్ 5న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం నిర్వహించ తలపెట్టారు. ఈ కార్యక్రమాలు విజయవంతం చేయుటకు జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదగిరిలు రాణిగంజ్, కంటోన్మెంట్, పికెట్ డిపోలు, చేంజ్ ఓవర్ పాయింట్, సంగీత్, జోనల్ అకౌంట్స్ ఆఫీస్‌లలో పర్యటించి ఉద్యమ కార్యాచరణ విజయవంతం చేయాలని ఉద్యోగులందరినీ కోరడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని గత సంవత్సర కాలం నుండి ప్రభుత్వానికి తమ నిరసనల ద్వారా తెలియజేసినప్పటికీ వాటిపట్ల సానుకూలంగా స్పందించలేదన్నారు. తమ యూనియన్లను పునరుద్ధరించడం, 2021వేతన సవరణ అమలు చేయడం, ఆర్టీసి సంస్థను అభివృద్ధి చేయడం, కొత్త బస్సులను కొనుగోలు చేయడం, ఉద్యోగ నియామకాలను చేపట్టడం, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలతో సమానంగా ఆర్టీసి ఉద్యోగుల జీతాలను ఇవ్వడం, బ్రెడ్ విన్నర్ స్కీమ్ లో ఇచ్చే ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపదికగా ఇవ్వడం, రిటైరైన ఉద్యోగులకు 2017 వేతన సవరణ అమలు చేస్తూ వారి బకాయిలన్నిటినీ చెల్లించడం, పిఎఫ్, సిసిఎస్, ఎస్‌ఆర్ బిఎస్, ఎస్బిటి లకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించడం వంటి అనేక అంశాలు నేటికీ పరిష్కారం లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెఎసి ప్రతినిధులు ఎన్ కమలాకర్ గౌడ్, ఎం. హెచ్ అలీ, కె.ఎస్. పాల్, బి.డి.రావ్, ఎం.ఎ. మజీద్, రామ్ రెడ్డి, బాబు, రమేష్, భిక్షపతి, ఆర్.ఎన్.రెడ్డి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
మల్కాజ్‌గిరి సర్కిల్-28
NIT. No. 36/EE-28/SBZ/GHMC/2024-25

పని పేరు: నిర్వహణ పనులు, ఇతర పనులు - 02. **అంచనా విలువ :** రూ.4.00 లక్షలు, **బిడ్ల దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్ల దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 28.10.2024న మ.02.00గం.ల నుండి 31.10.2024న మ.02.00గం.ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. సెల్ నెం. 9154796465. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
డివిజన్ నెం.28, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 5977-PP/CL/ADVT/1/2024-25, Date: 28-10-2024

శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి దేవస్థానము
పాలకుర్తి గ్రా।। & మం।।, జనగామ జిల్లా

Letter No. SSLNST/Tender Notice/2024. సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము తేది: 26.10.2024

దేవాదాయ ధర్మాదాయశాఖ, జనగామ జిల్లా, పాలకుర్తి గ్రా।। & మం।। శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి దేవస్థానము యొక్క టెండర్లు శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమిషనర్, దేవాదాయ-ధర్మాదాయ శాఖ, హైద్రాబాద్ గారి కార్యాలయములో తేది: 06.11.2024 బుధవారము రోజున ఉ.11:00 గం.ల నుండి సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దులపై టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరాలకోసం దేవస్థాన కార్యాలయమును సంప్రదించగలరు.

క్ర.సం.	వేలము వివరములు	డిపాజిట్ సొమ్ము	కాలపరిమితి
01.	కొబ్బరి కాయలు మరియు ఇతర పూజా సామాగ్రి(అభిషేక సామాగ్రి, వాహన పూజా సామాగ్రి మినహాయించి) అమ్ముకొను హక్కు	రూ.5,00,000/-	తేది: 20.11.2024 నుండి 19.11.2025 వరకు
02.	తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు	రూ. 5,00,000/-	తేది: 21.10.2024 నుండి 20.10.2025 వరకు
03.	కొబ్బరిచిప్పలు ప్రోగుచేసుకొను హక్కు	రూ.1,00,000/-	తేది: 04.01.2025 నుండి 03.01.2026 వరకు

DIPR R.O. No. : 5964-PP/CL/ADVT/1/2024-25, Date: 28-10-2024 సం/- కార్యనిర్వహణాధికారి

ఫోకస్

ఆలోచనా ధోరణి మారాలి!

యువతరంగం

మెరుగైన సమాజం ఏర్పడాలంటే, అత్యధిక శాతం మంది యువత ఆలోచనా ధోరణి మారాలి. మార్కులు, ర్యాంకుల సునామీలో కొట్టుకుపోయి, ఒడ్డుకు తీరే సమయంలో, ఇంజనీరింగ్ లేదా ఎంబిఎలో చేరి, అది పూర్తికాకముందే ఉద్యోగాల కోసం మానసిక ఒత్తిడిని ఎదుర్కొని, ఉద్యోగం వచ్చిన తర్వాత, అప్పులు, ఇఎంఐల ఊబిలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతూ జీవితాలను గడిపేస్తున్న వారే నేటి సమాజంలో అధికంగా కనిపిస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడంతో, ఇంజనీరింగ్‌లో సీటు సులభమైంది. వైద్య విద్యకే కొంత పోటీ. ఏది ఏమైనా, ముందు చదువు.. ఆ తర్వాత ఒక పెద్ద మల్టీనేషనల్ కంపెనీ (ఎంఎన్‌సి)లో కొలువు... ఇవే నేటి యువత ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఉద్యోగం దక్కిన వెంటనే, ఈ పరుగు పందెంలో గెలిచి సంబరపడుతున్నారే తప్ప, ఉద్యోగం చేసేవారిగా కాకుండా, ఇచ్చేవారిగా ఎందుకు ఎదగకూడదనే ఆలోచన అత్యధిక శాతం మందికి రావడం లేదు. జీవితాలను వచ్చే 30 35 సంవత్సరాల పాటు ఎంఎన్‌సిలకు మానిసలుగా మారేలా చేసుకుంటున్నారు. ఒకప్పుడు బానిసలు ఉండేవారు. బానిసల వ్యాపారం జోరుగా సాగేది. వారిని తాళ్లతో కట్టేసేవారు. గొలుసులతో బంధించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కానీ, ఎంతో మంది సూటుబూటు వేసుకొని, సోమవారం నుంచి శుక్రవారం వరకూ పెద్దపెద్ద ఎంఎన్సిల కోసం యంత్రాలుగా పని చేస్తున్నారు. శని, ఆదివారాల్లో పేరుకుపోయిన పనులను చక్కబెట్టుకుంటూ ఆధునిక బానిసల్లా మారిపోతున్నారు. కాలంతో పరుగులు తీస్తూ, సాటివారినేకాదు.. తన వారిని కూడా పట్టించుకోవడం లేదు. అంత తీరిక, ఓపిక వారికి లేదు. నిజానికి ఈ పరిస్థితి వారు కోరుకొని తెచ్చుకున్నారని అనుకోవడానికి వీల్లేదు. బాల్యం నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నూరిపోసిన భవిష్యత్ లక్ష్యాల ఫలితమిది. ఐదు అంకెల జీతం, కారు, ఓ సొంత ఇల్లు.. ఇవే అత్యధికుల స్వప్నాలు. తాను.. తన కుటుంబం.. ఇంతకు మించిన ప్రపంచం లేదు. సమాజ పరిస్థితులు వారికి అవసరం లేదు. ‘ఎవడు ఎటు పోతే నాకేంటి?’ అనే ధోరణి. నిర్మాణాత్మక లక్ష్యం లేకుండా జీవిస్తున్నట్లు కనిపిస్తుంది. ఎంత మంది తమతమ గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిన తర్వాత వ్యాపారంలోకి అడుగుపెట్టాలని కోరుకుంటున్నారు? అని అడిగితే, నూటికి ఒక్క శాతాన్ని మించి సానుకూలంగా సమాధానం చెప్పకపోవచ్చు. అదికూడా అనుమానమే. వ్యాపారం వరకూ ఎందుకు.. సివిల్ సర్వీసెస్, లా, జర్నలిజం తదితర కోర్సుల పట్ల కూడా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఈ ధోరణి మారాలి. అందుకు, ముందుగా తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాలి. చిన్నత నుంచే తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తే, ఉత్తమ ఫలితాలు ఉంటాయన్నది అందరూ ఒప్పుకునే సిద్ధాంతం. కానీ, ఆచరించడానికే రాద్ధాంతం.

ఉద్యోగం
ఉపాధి
సివిల్స్
వ్యాపారం

ఉద్యోగితలో స్విట్జర్లాండ్ నంబర్ వన్

ప్రపంచ వ్యాప్తంగా 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసుగలవారి సంఖ్య 1.2 బిలియన్లు. అంటే, పూర్తి జనాభావాలో వారి వాటా 16 శాతం. 2030 నాటికి యువత శాతం మరో 7 శాతం పెరుగుతుందని అంచనా. అంటే, అప్పటికి యువతీయువకుల జనాభా 1.3 బిలియన్లకు చేరుతుంది. ప్రపంచ యువతలో 85 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాలలో నివసిస్తున్నారు, 60 శాతం ఆసియాలో ఉన్నారు. ఒక నివేదికను అనుసరించి, 2022లో సగటు కళాశాల విద్యార్థిపై విద్యారుణం 37,574 డాలర్లు కాగా, క్రెడిట్ కార్డ్ రుణంలో 3,100 డాలర్లు. 96 శాతం మంది టీనేజర్లు ప్రతిరోజూ ఇంటర్నెట్ని ఉపయోగిస్తున్నారు. 46 శాతం మంది దాదాపు నిరంతరం ఇంటర్నెట్ బ్రౌజింగ్‌లోనే గడిపేస్తున్నారు. అన్ని వయసుల వారిలో 69 శాతం మంది యువకులకు విధాన అభివృద్ధిలో ఎక్కువ అవకాశాలు ఉండాలని కోరుకుంటున్నారు. అప్పుడే రాజకీయ వ్యవస్థలను మెరుగుపరుస్తాయని స్పష్టం చేస్తున్నారు. కాగా, 67 శాతం మంది ప్రజలు మంచి భవిష్యత్తును విశ్వసిస్తున్నారు. 15 నుండి 17 సంవత్సరాల వయస్సు గల వారు అత్యంత ఆశాజనకంగా ఉన్నారు. ఇలావుంటే, అంతర్జాతీయ సర్వే ప్రకారం, 2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక యువత నిరుద్యోగితా రేటు గల దేశాలు ఆఫ్రికాలోనే ఎక్కువ. జిబౌటీలో 76 శాతం మంది యువతీయువకులు నిరుద్యోగులే. ప్రపంచంలో అత్యధిక నిరుద్యోగులున్న దేశం ఇదే. ఎస్వతిని, లిబియా వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అత్యల్ప నిరుద్యోగం ఉన్న దేశం స్విట్జర్లాండ్. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి అక్కడ నిరుద్యోగిత 2.7 శాతంగా ఉంది. ఉద్యోగావకాశాలు కల్పించడంలో ఆ దేశం నంబర్‌వన్ స్థానాన్ని సంపాదించింది. తర్వాతి స్థానం ఖజకస్థాన్ ఆక్రమిస్తుంది. అక్కడ నిరుద్యోగిత గత ఏడాదితో పోలిస్తే 3.2 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గింది. ఈ జాబితాలో జపాన్, దక్షిణ కొరియా సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాయి.

జపాన్‌లో నిరుద్యోగిత వరుసగా రెండో సంవత్సరం కూడా 4.1 శాతంగానే కొనసాగుతున్నది. కాగా, దక్షిణ కొరియాలో ఇది 5.1 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గింది. నాలుగు నుంచి పది స్థానాల్లో వరుసగా హాంకాంగ్ (5.4 శాతం), థాయిలాండ్ (5.7 శాతం), జర్మనీ (6.9 శాతం), మాల్డోవా (7.6 శాతం), వియత్నాం (7.99 శాతం), మాల్టా (9.5 శాతం) నైజీరియా (10.1 శాతం) ఉన్నాయి,

పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) ఎప్పుడు స్థాపించబడింది?
  5 జూన్ 1972
- జిలేమ్ కణజాలాన్ని తయారు చేసే మూలకాలకు పేరు పెట్టండి?
  Xylem కణజాలం నాలుగు రకాల మూలకాలను కలిగి ఉంటుంది, అవి ట్రాచీడ్లు, నాళాలు, జిలేమ్ ఫైబర్స్ మరియు జిలేమ్ పరేన్చైమా.
- హెమిస్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?
  జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో ఉంది.
- భగత్ సింగ్‌ను ఎప్పుడు ఉరితీశారు?
  23 మార్చి 1931
- భారత జాతీయ కాంగ్రెస్ యొక్క మొదటి ఆంగ్ల అధ్యక్షుడి పేరు?
  జార్జ్ యూల్ భారత జాతీయ కాంగ్రెస్ యొక్క మొదటి ఆంగ్లేయ అధ్యక్షుడు.
- నోటి లోపలి పొరను ఏర్పరిచే కణజాలానికి పేరు పెట్టండి?
  ఎపిథీలియల్ కణజాలం
- లిగమెంట్ యొక్క పని ఏమిటి?
  లిగమెంట్ అనేది ఒక ఎముకను మరొక ఎముకతో కలిపే ఒక రకమైన బంధన కణజాలం. ఈ కణజాలాలు బలంగా సాగేవి.
- మౌర్య సామ్రాజ్యాన్ని ఎవరు స్థాపించారు?
  చంద్రగుప్త మౌర్యుడు మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు.
- నలంద విశ్వవిద్యాలయాన్ని ఎవరు ధ్వంసం చేశారు?
  భక్తియార్ ఖిల్జీ 1193లో నలంద విశ్వవిద్యాలయాన్ని నాశనం చేశాడు.
- అరుంధతీ రాయ్ ఏ సంవత్సరంలో బుకర్ ప్రైజ్ గెలుచుకున్నారు?
  1997లో.
- చంద్రునిపై ఉన్న వస్తువు బరువు, భూమిపై ఉన్న వస్తువు బరువు మధ్య సంబంధం ఏమిటి?
  చంద్రుడు భూమి బరువులో ఆరవ వంతు బరువు కలిగి ఉంటాడు.
- నేలలో ఖనిజాల ప్రధాన మూలం ఏది?
  మట్టిని కప్పి ఉంచే మాతృ శిల మట్టిలోని ఖనిజాలకు ప్రధాన మూలం.
- భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్‌లో వాక్, భావప్రకటనా స్వేచ్ఛ ప్రస్తావించబడింది?
  ఆర్టికల్ 1920. ‘గ్యారంటీ సిస్టమ్’ ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
  1849లో, భారతదేశంలో రైలు నెట్‌వర్క్ అభివృద్ధికి ‘గ్యారంటీ సిస్టమ్‘ ప్రారంభించబడింది.
- ఎలక్ట్రిక్ బల్బులో ఏ వాయువు నిండి ఉంటుంది?
  ఎలక్ట్రిక్ బల్బులో నైట్రోజన్ వాయువు నింపబడుతుంది.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
  మార్చి 8న
- భారతదేశంలో మొట్టమొదటి ప్రాంతీయ భాషా వార్తాపత్రిక ఏది?
  సమాచార్ దర్పణ్
- గురుముఖి లిపిని పరిచయం చేసిన సిక్కు గురువు ఎవరు?
  రెండవ సిక్కు గురువు అయిన గురు అంగద్ కనుగొన్నారు.
- భారతదేశంలోని ఏ రాష్ట్రంలో హార్న్‌బిల్ పండుగను జరుపుకుంటారు?
  నాగాలాండ్
- గోండ్వానా ల్యాండ్‌లో భాగం కాని ఖండం ఏది?
  యూరప్
- బార్చాన్స్ అంటే ఏమిటి?
  చంద్రవంక ఆకారంలో ఇసుక తిన్నెలున
- భారత ఎడారిలో ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నాయి?
  తక్కువ వర్షపాతంతో కూడిన వేడి, పొడి వాతావరణం

ఒకవైపు రొట్టెల అమ్మకం.. మరోవైపు పుస్తక పఠనం

ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాకు చెందిన 19 ఏళ్ల సజాద్ మెహ్రాజ్ పేదరికంలోనే పుట్టాడు... పెరిగాడు. కుటుంబానికి ఆసరాగా ఉండడానికి రొట్టెలు అమ్మేవాడు. ఒకవైపు ఆదాయం కోసం కష్టపడుతూనే, మరోవైపు పుస్తక పఠనం కొనసాగించాడు. వైద్య వృత్తి చేపట్టాలన్న తన కలను సాకారం చేసుకోవడానికి కష్టపడ్డాడు. సంకల్పం, కోరిక, పట్టుదల, కృషి ఉంటే కలలను నెరవేర్చుకోవడం అసాధ్యం కాదని నిరూపించాడు. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్‌ను సాధించి ఈ యూత్ ఐకాన్ ఎంతో మంది ఔత్సాహిక విద్యార్థులకు మార్గదర్శిగా నిలుస్తున్నాడు. నీట్‌లో 750 మార్కులకుగాను 650 మార్కులు సంపాదించి, తన ఆత్మవిశ్వాసాన్ని నిరూపించుకున్నాడు. తన అంకితభావం, అచంచలమైన నిబద్ధత, సంకల్పానికి హద్దులు లేవని నిరూపించాడు. నీట్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు యూట్యూబ్‌నే ట్యుటోరియల్‌గా ఎంచుకున్నాడు సజాద్. ‘వీధి వ్యాపారులను పాఠశాలలోకి ఎందుకు అనుమతించాలి? వారు స్కూల్‌లో చేసినంత మాత్రాన ఏం సాధిస్తారు?’ అంటూ ఎంతోమంది ఎన్నిరకాలుగా విమర్శించినా, అవమానించినా సజాద్ కుంగిపోలేదు. తన లక్ష్యాన్ని మరచిపోలేదు. ఆ గ్రామంలో సజాద్ సోదరే తొలి వైద్యురాలు. ఆమె ప్రోత్సాహంతో అతను తనను విమర్శించేవారిని పట్టించుకోకుండా చదువు కొనసాగించాడు. తండ్రి అనారోగ్యంతో మంచం పట్టడంతో, కుటుంబ పోషణకు ప్రారంభించిన స్టాల్‌లో రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటలు పని చేస్తూ, ఖాళీ సమయంలో ఆన్‌లైన్ పాఠాలు వినేవాడు. పాఠాలు వింటూనే రోజుకు సగటున 300 రొట్టెలు సిద్ధం చేసేవాడు. ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే అతని దినచర్య సాయంత్రం వరకూ సాగుతుంది. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకునే సజాద్ వైద్య విద్యను అభ్యసించాలన్న తన కలను నెరవేర్చుకోవడానికి రాత్రి పొద్దుపోయే వరకూ చదువుకునేవాడు. చిన్నతనం నుంచే కష్టపడడం అతనికి అలావాటైంది. కానీ, చదువుకు ఈ కష్టాలు అడ్డుకాలేదు. ఎనిమిదో తరగతిలో స్థానిక క్లస్టర్‌లో టాపర్‌గా నిలిచాడు. తొమ్మిదో తరగడినిలో అత్యధిక మార్కులు సంపాదించి, కశ్మీర్ ఎడ్యుకేషన్ ఇన్నియేటివ్ నుంచి స్కాలర్‌షిప్ పొందాడు. అదే ఉత్సాహంతో టెన్త్, ప్లస్ టూ కూడా పూర్తి చేశాడు. నీట్ పరీక్షలో ఉత్తీర్ణుడై, ప్రస్తుతం శ్రీనగర్‌లోని జిఎంసి వైద్యకళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్నాడు. డాక్టర్‌గా తన ప్రాంతంలోని ప్రజలకు సేవలు అందించాలన్నది అతని ఆలోచన. శ్రమించి లక్ష్యాన్ని చేరుకున్న సజాద్ అభినందనీయుడు. యువతకు మార్గదర్శకుడు.

నీట్ సాధించిన టీనేజ్ సంచలనం

యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

లేబర్ సంక్షేమ బోర్డు ఆన్‌లైన్ సేవలందించేలా చర్యలు

ఎఐటియుసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : లేబర్ సంక్షేమ బోర్డు ఆన్‌లైన్ సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ మరియు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీకి బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ రెండు నెలలుగా సంక్షేమ బోర్డు లేబర్ ఆన్‌లైన్ వ్యవస్థ పనిచేయకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నాన్నారు. ఆన్‌లైన్ పనిచేయకపోవడంతో వివాహ, మెటర్నిటీ, యాక్సిడెంట్ల కేసులు, నార్మల్ డెత్‌లు, డిసెబులిటీ లాంటి కేసులు చాలావరకు కరీంనగర్ లేబర్ కార్యాలయంలో దాఖలు చేసినప్పటికీ నేటికీ డబ్బులు రావడం లేదన్నారు. ఫలితంగా సామాన్య పేద కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా మెటర్నిటీ, మ్యారేజ్, యాక్సిడెంట్, నార్మల్ డెత్, డిసేబులిటీ వాటిని రెన్యువల్ చేయడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో కూలీ పనులు చేసుకునే కార్మికులు నష్టపోతున్నారని, వీరికి మరల అవకాశం కల్పించాలని కోరారు. పెండింగ్ ఫైల్స్‌కు సంబంధించిన డబ్బులు వెంటనే చెల్లించాలని, ఆన్‌లైన్ సర్వీసులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, తంబ్ సిస్టం తొలగించాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సత్తయ్య, జంగ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలివ్వండి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకొని ఉంటున్న గుడిసెలకు పట్టాలిచ్చి క్రమబద్ధీకరించి వారికి పట్టాలివ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన కురవి శివారులోని గుడిసెవాసుల సమావేశంలో నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో సంవత్సరం క్రితం పేదలు తిర్లాపురం రెవెన్యూ శివారు అసైన్మెంట్ భూమిలో ఇండ్లను ప్రభుత్వం క్రమబద్ధీకరించి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం కావస్తున్న అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సబబు కాదన్నారు. అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందేలా గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా కెటాయించాలని కోరారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, కుర్యాల వీరన్న, మదు, మల్లమ్మ, అచ్చమ్మ, జానకి, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే రైతు భరోసా జమచేయాలి

కలెక్టరేట్ల ఎదుట రైతు సంఘం ధర్నా

భద్రాచలం

ప్రజాపక్షం/భద్రాచలం : రైతులకిచ్చిన హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదని ఎఐకెఎస్ అనుబంధం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అధ్యక్షుడు చంద్ర నరేంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐకెఎస్ అధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది కావస్తున్నప్పటికీ మాఫీకి పూనుకోలేదన్నారు. కంటి తడుపుగా లక్ష లోపు రుణాలు అనేక నిబంధనలు విధించి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇప్పటి వరకు ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన రైతు భరోసా జమ చేయకుండా కాలయాపన చేస్తూ పరోక్షంగా రైతాంగాన్ని అప్పుల ఊబిలోనికి నెట్టేస్తున్నారన్నారు. ధరణి పోర్టల్‌పై అనేక ఆరోపణలు చేసి రద్దు చేస్తున్నట్లు ప్రకటించుకున్న ప్రభుత్వం అందుకు తగిన విధంగా నూతన రెవెన్యూ చట్టం తీసుకురావడంలో జాప్యం చేస్తోందని, తద్వారా సాగుదారులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. పెండింగ్ భూములకు అటవీ హక్కు చట్టం ప్రకారం పోటుపట్టాలు, ఇటీవల కురుసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్న నష్టపరిహారం విడుదల చేయాలని, కల్తీ విత్తనాలు విక్రయించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, కొమరి హన్మంతరావు, గుగులోతు రామచందర్, నరజాతి రమేష్, యాస రోశయ్య, ఇమ్మానుయేల్, సీతారామిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకట్రావు, శ్రీను, గిరి, సుధాకర్, విజయ్, మోహన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ

సూర్యాపేట : రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపుతో రైతు రుణమాఫీ, రైతు భరోసా అందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వానకాలం, యాసంగి పంటలకు ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి భూమి హక్కుల చట్టాన్ని త్వరితగతిన తీసుకవచ్చి భూమి పట్టా పాస్ బుక్కులు ఇచ్చి రైతులకు ఉపశమనం కల్పించాలన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న రూ. 500 బోనస్‌ను దొడ్డ రకం ధాన్యానికి కూడా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్, ఎల్లంల యాదగిరి, దంతాల రాంబాబు, రామిశెట్టి కోటయ్య, ముక్క వీరబాబు, ధనరాజురెడ్డి, దంతాల రాంబాబు, పద్మరేఖ, నాగయ్య, శేషయ్య, లింగయ్య, మనోజ్, అంజయ్య, వెంకన్న, రమేష్, ఏసు, ఏలియా పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం

జయశంకర్ భూపాలపల్లి : రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నారపు రాజేందర్ అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పైళ్ల శాంతి కుమార్, పెంట రవి, కుడుదుల వెంకటేష్, సదానందం, రాజయ్య, సదయ్య, మోహన్, కుమారస్వామి, రఘుపతి, సారంగపాణి, పెద్దపల్లి రమేష్, ఎండి నబి, రాజయ్య, సురేందర్, ఇందిరా, రాజేశ్వరి, రమేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు

నల్లగొండటౌన్ : రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రైతు సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరి రావు మాట్లాడుతూ రైతు భరోసా కింద ఎకరానికి పదిహేను వేలు అందించాలని, రెండు లక్షల పైబడి రుణమాఫీ చేయాలని, ధాన్యం దొడ్డ రకాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద కొర్రీలు లేకుండా పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినవారిలో జిల్లా అధ్యక్షులు ఎండి మోహినుద్దీన్, జిల్లా గౌరవ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

సూర్యాపేట...

ఐకెపి సెంటర్లలో కొనుగోలు చేయాలి

భువనగిరి : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు యాదాద్రి భువనగిరి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరు రాజయ్య మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. రైతు భరోసాను రైతులకు వర్తింపజేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేయాలని దళారు వ్యవస్థను అరికట్టాలని రాజయ్య డిమాండ్ చేశారు. ధర్నాలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, నాయకులు జక్క దయాకర్ రెడ్డి, రైతులు గుంటుపల్లి సత్తయ్య, తెడ్డు ఆంజనేయులు, ఎర్ర యాదయ్య, గణేష్, యుద్ధంరెడ్డి బోదాసు స్వామి, రవికృష్ణ, దొండ ఎల్లయ్య పాల్గొన్నారు.

సంపూర్ణంగా రుణమాఫీ

రంగారెడ్డి ప్రతినిధి : రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేసి రైతు భరోసా ఇవ్వాలని రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణమాఫీ సంపూర్ణంగా చేయాలని, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రం జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమం లో సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్‌రెడ్డి, రైతుసంఘం నాయకులు చల్లా నారాయణరెడ్డి, బాలయ్య,రజినీకాంత్, బాల్‌రెడ్డి, జాజాల అంజయ్య, జర్పుల శివనాయక్, రమావత్ చత్రు నాయక్, అమర్ సింగ్, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

జయశంకర్ భూపాలపల్లి...

రంగారెడ్డి...

భువనగిరి...

నల్గొండ...

‘ముడా’ మనీ ల్యాండరింగ్ కేసులో ‘ఇడి’ తాజా సోదాలు

- బెంగళూరు, మైసూరులలోని పలు ప్రాంగణాలపై నిర్వహణ
- సోదాలకు గురైన వారిలో ఒక బిల్డర్ సహా కొంతమంది కేసు సంబంధిత వ్యక్తులు
- అక్టోబరు 18న ముడా ఆఫీస్‌లో మొదటిరౌండ్ సోదాలు జరిగిన 10రోజులకు మరోవిడత

బెంగళూరు : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) మనీల్యాండరింగ్ కేసు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సిఎం సిద్ధరామయ్య, ఆయన కుటుంబసభ్యులు, కొంతమంది ఇతరులు ముడా మనీల్యాండరింగ్ ఆరోపణల కేసు సంబంధిత వ్యక్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం తాజా సోదాలు నిర్వహించింది.బెంగళూరు, మైసూరులలో పలు ప్రాంగణాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు తాజాసోదాలు జరిపినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. బెంగళూరులోని ఒక బిల్డర్ సహా ఈ కేసుతో సంబంధిత వ్యక్తులపై సోదాలు జరిపినట్లు వారు చెప్పారు. ఈ దర్యాప్తు సంస్థ మొదటి రౌండ్ సోదాలను అక్టోబరు 18న మైసూరులోని ముడా కార్యాలయం, ఇతర స్థలాలలో నిర్వహించిన విషయం విదితమే. గత వారం మైసూరు నగరాభివృద్ధి సంస్థ బెంగళూరులోని జోనల్ కార్యాలయంలో దిగువ ర్యాంక్ అధికారులను ప్రశ్నించిన విషయం విదితమే. లోకాయుక్త ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కింద కర్నాటక ముఖ్యమంత్రి, ఇతరులపై కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) నమోదు చేసింది. సిద్ధరామయ్య తన సతీమణి బి.ఎం.పార్వతికి ముడా కేటాయించిన 14 స్థలాల కేటాయింపులో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై లోకాయుక్త, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి బి.ఎం.పార్వతి, బావమరిది మల్లికార్జునస్వామి, మల్లికార్జునస్వామి దేవరాజ్ అనే వ్యక్తినుంచి భూమి కొనుగోలు చేసి పార్వతికి బహుకరించినందుకు దేవరాజు, మరికొంతమంది ఇతరులను ఈ కేసులో లోకాయుక్త, ఇడి రెండు దర్యాప్తు సంస్థలు కూడా వారిని నిందితులుగా చేర్చింది. ఇటీవల సిఎం భార్య పార్వతిని మైసూరులో లోకాయుక్త విచారించింది. మైసూరులో ముడా సేకరించిన అత్యంత విలువకలిగిన 14స్థలాలను విజయనగర్ లేఔట్ 3వ, 4వ దశలలో మంచి డిమాండ్ ఉన్న ప్రాంతంలో కేటాయించారన్న ఆరోపణలు ఆమెపై వచ్చాయి. ముఖ్యమంత్రి సతీమణి బి.ఎం.పార్వతి కి సంబంధించిన 3.16 ఎకరాల భూమికి బదులు 50: 50 నిష్పత్తి పథకం కింద రెసిడెన్షియల్ లేఔట్‌గా అభివృద్ధి చేసి ప్లాట్లను మైసూరు నగరాభివృద్ధి సంస్థ కేటాయించిందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పలుకుబడిని ఉపయోగించి ప్రభావితం చేశారన్న అభియోగాన్ని ఎదుర్కొంటున్నారు. మైసూరు తాలూకా కసాబా హొబ్లి డివిజన్‌లోని కాసరే గ్రామంలో 464సర్వే నెంబర్ కింద 3.16 ఎకరాల భూమికి సంబంధించిముఖ్యమంత్రి భార్య బి.ఎం.పార్వతికి ఎలాంటి లీగల్ టైటిల్ లేదని ఆమె ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తీవ్రస్థాయిలో వివాదాస్పద అంశంగా మారి చర్చనీయాంశం కావడంతో పార్వతి తనకు ముడా కేటాయించిన ప్లాట్లను తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన కుటుంబం ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని, తనను రాజకీయంగాఅప్రతిష్టపాల్జేయాలన్నదురుద్దేశంతో ప్రతిపక్షం బురదజల్లుతోందని ఆరోపించారు. తనపై నమోదు చేసిన ఈ తరహా రాజకీయ కేసు ఇదే మొట్టమొదటిది అని సిద్ధరామయ్య తన ప్రత్యర్థులపై ఆరోపణలు చేసిన విషయ ం తెలిసిందే.

రాజ్యాంగ విలువల అణచివేత

వయనాడ్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంకాగాంధీ

వయనాడ్ : కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకాగాంధీ వాద్రా సోమవారం రెండవసారి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. ఈ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ విలువలు నిరంతరం అణచవేయబడుతున్నాయని విమర్శించారు. వయనాడ్ జిల్లాలో సోమవారం మీనన్‌గాడి జిల్లాలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ప్రియాంకగాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో నెలకొన్న హింసను ప్రస్తావించారు. దేశంలో మైనారిటీలకు వ్యతిరేకంగా దాడులు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాల మధ్య భయాన్ని, కోపాన్ని, బాధలను వ్యాప్తి చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. మైనారిటీలపై జరిగిన దాడులను కూడా మీరు చూసే ఉంటారని ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు. అదే విధంగా మణిపూర్‌లో దాడులు జరగడం కూడా మనం చూశామని, ఒక ప్రణాళికాబద్ధంగా పదే పదే ప్రజల్లో కోపం, భయం, ద్వేషాన్ని వ్యాప్తి చేస్తుండడం మనం చూస్తూనే ఉన్నామని ప్రియాంక అన్నారు. సామాన్య ప్రజలకు కాకుండా ప్రధాని మోదీ స్నేహితులకు అనుకూలంగా ఒక విధానం తరువాత మరొక విధానాన్ని తయారు చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కష్టపడుతున్న రైతులపై ఎలాంటి దయ, కరుణ చూపించడం లేదని మండిపడ్డారు. గిరిజన ప్రజలను ఏ మాత్రం అర్థం చేసుకోకుడా వారి భూములను లాక్కుని ధనవంతులకు ధారాదత్తం చేస్తుందని ప్రియాంకా గాంధీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తన సోదరుడు రాహుల్‌గాంధీని ప్రస్తావిస్తూ అతను వయనాడ్ బాధాపత్త హృదయాలతో వదిలి వెళ్లారని తనకు తెలుసునన్నారు. తన సోదరిడిపై ఉన్న ప్రేమతో కూడా మీ అందరూ ఇక్కడికి వచ్చారని తెలుసన్నారు. నేడు తాము అతిపెద్ద యుద్ధం చేస్తున్నామని, దానికి రాహుల్ నేతృత్వం వహిస్తున్నారన్నారు. దేశం నిర్మించిన విలువల కోసం తామందరం పోరాడుతున్నామని చెప్పారు. మన ప్రజాస్వామ్యం కోసం, సమానత్వం కోసం పోరాటం చేస్తున్నామని, ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ సైనికులేనని తెలిపారు. తాను ఎంపిగా ఎన్నికైన తరువాత సాధ్యమైనంత మేరకు కష్టపడి పనిచేస్తానని హామీనిచ్చారు. మీకు అండగా ఉంటానని, మీ కోసం పోరాటం చేస్తానని ప్రజలకు ఆమె భరోసానిచ్చారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పుతానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కాగా, సమావేశానికి ముందు 150 మీటర్ల దూరం వరకు రోడ్ షో నిర్వహించారు.

మోదీ, జిన్‌పింగ్ భేటీ వెనుక రష్యా పాత్ర లేదు

న్యూఢిల్లీ : ఇటీవల రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సమ్మిట్ సందర్భంగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య భేటీ వెనుక రష్యా పాత్ర లేదని భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఆ ఐదేళ్ళ స్థబ్దత తరువాత జరిగిన భేటీ ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో సానుకూల పరిణామమని,దానిని తాము మన స్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సంపూర్ణంగా విజయవంతమైందని, ఈ కూటమి సమ్మిళతమైనదే తప్ప కొందరికే పరిమితమైనది కాదని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ కూటమి పాశ్చాత్య వ్యతిరేకి లేదా పాశ్చాత్యేతర కూటమినో కాదని స్పష్టం చేశారు. ఢిల్లీలో సోమవారం నాడు ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

వక్ఫ్ బోర్డు ప్రెజెంటేషన్‌లో ఇష్టారాజ్యాంగా మార్పులా ?

- సమావేశం నుంచాఇ ప్రతిపక్ష నేతల వాకౌట్

న్యూఢిల్లీ : వక్ఫ్ బిల్లుపై నియమించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) సమావేశం నుంచి పలువురు ప్రతిపక్ష నేతలు వాకౌట్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఢిల్లీ వక్ఫ్ బోర్డు చేసిన ప్రెజెంటేషన్‌ను నిరసిస్తూ వారు సమావేశం నుంచి బైటికి వెళ్ళిపోయారు. ఢిల్లీ ప్రభుత్వం దృష్టిలో లేకుండానే ఢిల్లీ వక్ఫ్ బోర్డ్ అడ్మినిస్ట్రేటర్ కమిటీ ఎదుట హాజరయ్యారని, ప్రెజెంటేషన్‌లో మార్పులు చేశారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. వాకౌట్ చేసిన వారిలో ఆప్ సభ్యులు సంజయ్ సింగ్, డిఎంకె సభ్యులు మొహమ్మద్ అబ్దుల్లా , కాంగ్రెస్ ఎంపి నసీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు. ఎంసిడి కమిషనర్, వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ అశ్విని కుమార్ వక్ఫ్ బోర్డు రూపొందించిన తొలి నివేదికను పూర్తిగా మార్చారని, దానికి ఢిల్లీ ముఖ్యమంత్రి నుంచి ఆమోదం కూడా తీసుకోలేదని ప్రతిపక్ష ఎంపిలు అన్నారు.

పంజాబ్‌లో 50 శాతం తగ్గిన వ్యవసాయ వ్యర్థాల దగ్ధం కేసులు

చండీగఢ్ : పంజాబ్‌లో వ్యవసాయ వ్యర్థాల దహనం వల్లే దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతుందంటూ పదే పదే విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే పంటకాలానికి ముందు వ్యవసాయ వ్యర్థాల దహనం ఘటనలు గత ఏడాది నుంచి 50 శాతం తగ్గాయి. దీంతో దేశరాజధానిపై వాయు కాలుష్య ప్రభావం కొద్ది మేరకు మాత్రమే పడుతున్నట్లు భావిస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కొయ్యకాళ్లక దగ్ధం కేసులు చాలా తగ్గాయి. సెప్టెంబరు 15వ తేదీ నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు పరిశీలిస్తే పంజాబ్‌లో వ్యవసాయ వ్యవర్థాల దగ్ధం కేసులు 1995 నమోదు కాగా, గత ఏడాది ఇదే సమయంలో 4,059 కేసులు నమోదైనట్లు పంజాబ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ గణాంకాల ద్వారా వెల్లడైంది. కాగా, 2022 నుంచి 75 శాతం మేరకు తగ్గాయి. ఆ ఏడాదిలో 8,147 కేసులను గుర్తించారు. పంజాబ్, హర్యానాతో పాటు ఢిల్లీకి చుట్టుపక్కల ఉన్న రాష్ట్రాల్లో అక్టోబరు, నవంబరు సమయంలో వరి కోతలు ముగిసిన తరువాత వ్యవర్థాలను దగులబెడుతారు. దీంతో ఢిల్లీలో వాయ కాలుష్యం పెరుగుతుందని పలు విమర్శలు ఉన్నా యి. పంజాబ్‌లో ప్రస్తుతం ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఇక ఆదివారం నాడు పంజాబ్‌లో 138 వ్యవసాయ వర్థాల ఘటనలు చోటు చే సుకోగా ఫిరోజ్‌పూర్‌లో అత్యంగా బయటపడ్డా యి. ఆ తరువాత సంగ్రూ ర్, ఫతేగఢ్ సాహిబ్‌లో ఉన్నట్లు గణాంల ద్వారా వెల్లడైంది. 2022, 2023లో ఇదే రోజున పంజాబ్‌లో వరుసగా 1,111, 766 ఘటనలు జరిగాయి. ఇదిలా ఉండగా, వ్యవసాయ వ్యర్థాల ఘటనలు తగ్గినప్పటికీ ఢిల్లీలో వాయి కాలుష్యంపై గణనీయమైన ప్రభావం చూపలేదు. అక్కడ వాయు నాణ్యత చాలా పేళవంగా ఉంది. ఎక్యూఐ 355గా ఉంది.

‘మహా’లో సిఎం, డిప్యూటీ సిఎం వరుస నామినేషన్లు

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం మొదలైంది. ముఖ్యమంత్రి, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే , ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తదితర ప్రముఖులు సోమవారంనాడు నామినేషన్లు వేశారు. కొప్రి పచ్పాఖడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే, బారామతి నియోజకవర్గం నుంచి అజిత్ పవార్ నామినేషన్ వేశారు. ఆయన మేనల్లుడు, శరద్ పవార్ మనుమడు యుగేంద్ర పవార్ బారామతి నియోజకవర్గం నుంచి ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను ఓడించగా, మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పవార్ వర్సెస్ పవార్ (అజిత్ పవార్–యుగేంద్ర పవార్) మధ్య బారామతిలో ఆసక్తికరమైన పోటీ నెలకొంది. అజిత్ పవార్ సోమవారంనాడు నామినేషన్ వేయడానికి ముందు రోడ్ షోలో పాల్గొన్నారు. యుగేంద్ర యాదవ్ పోటీపై మాట్లాడుతూ, పోటీలో ఎవరున్నా ఈసారి కూడా బారామతి ప్రజలు తననే ఎన్నుకుంటారనే నమ్మకం తనకుందన్నారు. కాగా, పోటీ దురదృష్టకరమే అయినా కుటుంబంలోని తామంతా పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌తోనే ఉండాలని నిర్ణయించినట్టు యుగేంద్ర యాదవ్ చెప్పారు. శరద్ పవార్ వల్లే బారామతి సహా చుట్టపక్కల ఎంతో అభివృద్ధి చెందిందన్నా రు. సొంత మేనమామపైనే పోటీకి దిగడం కష్టమ ని అనుకోవడం లేదని, అలాగని తేలిగ్గానూ తీసుకోవడం లేదని చెప్పారు. బారామతి ప్రజలు ప వార్ సాహెబ్ వెంటే ఉన్నారని, అది లోక్‌సభ ఎన్నికల్లో రుజువైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అదే ఆదరణ చూపుతారనే నమ్మకం ఉందని తెలిపారు.

‘బారామతి’ యువతరంనేత యుగేంద్ర పవార్‌ను తప్పక గెలిపిస్తుంది

విలేకరుల సమావేశంలో ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్‌పవార్ ధీమా

పుణే : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో బారామతి అసెంబ్లీ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న బారామతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్‌సిపిని చీల్చిన తన మేనల్లుడు అజిత్‌పవార్‌పై గట్టి అభ్యర్థిని బరిలో నిలిపేందుకు శరద్‌పవార్ తన రాజకీయ అనుభవాన్ని అంతా రంగరించి వ్యూహరచన చేశారు. అజిత్‌పవార్ సోదరుడైన శ్రీనివాస్ కుమారుడు యుగేంద్ర పవార్‌ను తన పార్టీ ఎన్‌సిపి(ఎస్‌పి) అభ్యర్థిగా నిర్ణయించారు. ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్‌పవార్, ఆయన కూతురు బారామతి ఎంపి సుప్రియా సూలేతో కలిసి వచ్చిన యుగేంద్ర పవార్ సోమవారం నాడు ఇక్కడ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం శరద్‌పవార్ విలేకరులతో మాట్లాడుతూ బారామతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్‌సిపి (ఎస్‌పి) తరపున విదేశాలలో విద్యను అభ్యసించిన మంచి విద్యావంతుడైన యువనేత యుగేంద్ర పవార్‌ను బరిలో నిలిపామని, బారామతి నియోజక వర్గం ప్రజలు తప్పకుండా యువనాయకత్వాన్ని అంగీకస్తారన్న నమ్మకం ఉందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన పంచదార సంబంధిత పరిశ్రమలో మంచి పేరున్న యువ అడ్మినిస్ట్రేటర్ అని పరిచయం చేశారు. శరద్‌పవార్ మాట్లాడుతూ తాను 57సంవత్సరాల క్రితం తన నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు బారామతికి వచ్చానని, అది మొదలు ఇప్పటి వరకూ నియోజకవర్గ ప్రజలు తనను ప్రతీ ఎన్నికలలోనూ గెలిపిస్తున్నారని తెలియజేశారు. బారామతి నియోజకవర్గ ప్రజలతో తనకున్న విడదీయరాని సంబంధం ఇది అన్నారు. యుగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తాను యువతరం నాయకుడినే అయినప్పటికీ తన వెనక రాజకీయ ఉద్ధండులు శరద్ పవార్ ఉన్నారని, ఆయన అపారఅనుభవంతో తాను బారామతి అభివృద్ధికి పాటుపడతానని, ప్రజలు తనను గెలిపించాలని అభ్యర్థించారు. నామినేషన్ పత్రా లు దాఖలు చేయడానికి ముందు యుగేంద్రపవార్ బారామతి అసెంబ్లీ నియోజవకవర్గం పరిధిలోని అమరాయి గ్రామంలో ఉన్నటువంటి శరద్‌పవార్ పాత ఇంటికి తన అత్త సుప్రియా సూలేతో కలిసి వెళ్లారు. అక్కడి ప్రజలను పలుకరించారు.

288 సీట్లలో ప్రతిపక్ష ‘ఎంవిఎ’ 95 శాతం పైగా ఏకాభిప్రాయం

మహారాష్ట్రలో కూటమి పరిస్థితిపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధినేత శరద్‌పవార్ వెల్లడి

ప్రత్యర్థి రాజకీయ పార్టీలను చీల్చేవారిపై పోరాటం ఆగదని బిజెపిపై విమర్శనాస్త్రాలు

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు బిజెపి, మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) హోరాహోరీ పోటీపడుతున్నాయి. నామినేషన్ల దాఖలు గడువు(అక్టోబరు 29) కు ఒక రోజు ముందు అంటే సోమవారం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధినేత శరద్‌పవార్ విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్రలోని మొత్తం 288అసెంబ్లీ సీట్లలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి 90నుంచి 95శాతానికి పైగా ఏకాభిప్రాయాన్ని సాధించిందన్నారు. శరద్‌పవార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపిపై విరుచుకుపడ్డారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీలలో చీలికలను సృష్టించిన వారిపై, వారి భావజాలంపై రాజీపడేవారిపై తమ పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్ష ఎంవిఎ కూటమి తరపున స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న వారెవరైతే ఉన్నారో వారు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందారని అధికార మహాయుతి ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 20న జరుగనున్నాయి. అయితే ఓట్ల లెక్కింపు నవంబరు 23న జరుగనున్న విషయం తెలిసిందే. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)తో ఎన్‌సిపి(ఎస్‌పి), కాంగ్రెస్, ఉద్ధవ్ థాక్రే శివసేన (యుబిటి) జతకట్టి కూటమిగా ఏర్పడ్డాయి. జూన్ 22న శివసేనలో చీలిక రావడంతో థాకరే ప్రభుత్వం కూలిపోవడానికి కారణం అయ్యింది. జులై 23లో శరద్‌పవార్ స్థాపించిన ఎన్‌సిపి రెండు పార్టీలుగా విడిపోయిన తర్వాత ఆయన మేనల్లుడు అజిత్‌పవార్ 2023 జులైలో అధికార కూటమిలో చేరిపోయిన విషయం విదితమే. ఈ ఏడాది మార్చిలో ఉప ముఖ్యమంత్రి, బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ తనపై చేసిన విమర్శలకు ప్రతిదాడి చేస్తూ‘2019లో ‘ఐ విల్ బి బ్యాక్’ అసెంబ్లీ ఎన్నికల ప్రచార శ్రేణిపై తాను ఎదుర్కొన్న అపహాస్యం, ఛీత్కారాలను ప్రతిఘటించాను. జూన్ 2022లో ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు తర్వాత, అదికూడా రెండు పార్టీలను విభజించిన తర్వాత తాను తిరిగి అధికారంలోకి వచ్చాను’ అని పేర్కొన్నాడు. ప్రతిపక్షంగా మీ ముందున్న సవాళ్ల నేపథ్యంలో ‘లడ్‌కీ బహిన్’ లాంటి ప్రభుత్వ పథకాల అమలు చేయడం సాధ్యమేనా అని ప్రశ్నించిన విలేకరులకు శరద్‌పవార్ సమాధానమి స్తూ అధికారంలో ఉన్నవారు ఎంతో కాలం పాటు అలాంటి స్కీ మ్‌ను రూపొందించలేదని చెప్పారు. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయిన తర్వాతనే అధికార మహాయుతి లడ్‌కీ బహిన్ స్కీమ్‌ను ప్రారంభించారని మాజీ ముఖ్యమంత్రి అయిన శరద్‌పవార్ ఆరోపించారు. మహారాష్ట్రలోని మొత్తం 48లోక్‌సభ స్థానాలలోమహా వికాస్ అఘాడి 31స్థానాలను గెలుచుకున్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర ప్రభుత్వం లడ్‌కీ బహిన్ స్కీమ్ కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.1500 అందజేసింది.

ఆ తప్పు మేమూ చేయాల్సి వస్తుంది...

కాంగ్రెస్‌కు రౌత్ హెచ్చరిక

ముంబయి: సోలాపూర్ సౌత్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించడంపై పై శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ మండిపడారు. ''మేము ఇప్పటికే అభ్యర్థిని(అమర్ పాటిల్) ప్రకటించిన సోలాపూర్ సౌత్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి (దిలీప్ మానే) బరిలోకి దిగుతున్నట్లుగా ఆ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో ఈ విధంగా ఉండటం బహుశా టైపింగ్ పొరబాటని అనుకుంటున్నాను. మా వైపు నుంచి కూడా అలా జరిగే అవకాశం ఉండొచ్చు'' కాని పక్షంలో ఆ తప్పు మేమూ చేయాల్సి వస్తుంది.. ఇటువంటి చర్యల వల్ల మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)లో సమస్యలు వచ్చే ప్రమాదముంది'' అని ఆయన హెచ్చరించారు. సీటు షేరింగ్‌లో భాగంగా శివసేన (యుబిటి) పోటీ చేయాలని నిర్ణయించుకున్న మిరాజ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్థానిక కాంగ్రెస్ నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని సమాచారం వచ్చిందని..మిత్రపక్షాలకు వ్యతిరేకంగా చేస్తున్న ఈ ఆలోచనలు సరైనవి కాదని అన్నారు. కాగా సోలాపూర్ సౌత్ స్థానంలో పోటీ చేయాలని పార్టీ హైకమాండ నిర్ణయించినట్లుగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర స్థాయిలో వ్యాఖ్యానించలేమని.. సంజయ్ రౌత్ కూటమి నేతలతో చర్చించాలని సూచిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కాంగ్రెస్, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి), కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో కూటమి సభ్యులుగా పోటీ చేస్తున్నాయి.. మంగళవారంతో నామినేషన్ల దాఖలు అంశం ముగుస్తుంది. నవంబర్ 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు 200కు పైగా స్థానాల్లో ప్రతిపక్ష ఎంవిఎ అభ్యర్థులను ప్రకటించింది. కాగా శివసేన (యుబిటి), కాంగ్రెస్‌ల మధ్య కొన్ని సీట్ల విషయంలో ప్రతిష్టంభన నెలకొంది.

కేరళ సిఎం కాన్వాయ్‌కి ప్రమాదం

ఐదు వాహనాలు ఢీ

తిరువనంతపురం : కేరళ సిఎం పినరయి విజయన్ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. తిరువనంతపురం జిల్లా వామనపురం వద్ద సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కాన్వాయ్‌లోని ఐదు వాహనాలు వెనుక నుంచి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇందులో పోలీసు ఎస్కార్ట్, ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న కారు, అంబులెన్స్ కూడా ఉండడం గమనార్హం. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో ముఖ్యమంత్రి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇక అక్కడే ఉన్న సిసిటివి ఫుటేజీల్లో ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మా సిద్ధాంతాలే కాపీ..!

విజయ్ పార్టీపై డిఎంకె విమర్శ

చెన్నై: సినిమాల్లోంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్, ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగం (టివికె) సిద్ధాంతాలను అధికార డిఎంకె, ప్రతిపక్ష అన్నాడిఎంకె కొట్టివేశాయి. తమ సిద్ధాంతాలనే ఆయన కాపీ చేశారని డిఎంకె వ్యాఖ్యానించగా, వివిధ పార్టీల రాజకీయ సైద్ధాంతకీయ అంశాలను ’కాక్‌టైల్’ చేశారని అన్నాడిఎంకె అభివర్ణించింది. తమిళనాడులోని విల్లుపురం జిల్లా విక్రవాండి వద్ద ఆదివారం సాయంత్రం భారీఎత్తున నిర్వహించిన టివికె మహానాడులో తొలిసారి ఆయన కార్యకర్తల సమక్షంలో మాట్లాడారు. ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలను తాము పాటిస్తామని, లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాల ప్రాతిపదికగా పనిచేస్తామని చెప్పారు. ద్రావిడ భావజాలాన్ని కాపాడుతున్నామని చెప్పుకుంటూ రాష్ట్రాన్ని కుటుంబ సంస్థలా వాడుకుంటున్న వారు తమ శత్రువులని డీఎంకేను టార్గెట్ చేశారు. ద్రావిడ తరహా పాలన పేరుచెప్పి ఓ కుటుంబ పరిపాలన సాగుతోందని, పెరియార్, అన్నాదురై పేర్లు చెప్పుకుని పాలన కొనసాగిస్తున్నారని విజయ్ ధ్వజమెత్తారు. కాగా, టివికె విధానాలని చెప్పుకుంటున్నవన్నీ తమ పార్టీ విధానాలేని, తమను చూసి కాపీ కొట్టినవేనని డిఎంకె నేత టికెఎస్ ఇలాంగోవన్ మీడియాతో మాడ్లాడుతూ అన్నారు. ఆయన (విజయ్) చెప్పినవన్నీ గతంలో తాము చెప్పినవేననీ, తాము ఏదైతే చెప్పామో దానినే పాటిస్తున్నామని చెప్పారు. డీఎంకె సుదీర్ఘమైన ఇన్నింగ్స్‌లో ఎందరో ప్రత్యర్థులను, ఎన్నో పార్టీలను చూసిందన్నారు. ఇది ఆయన మొదటి కాన్ఫరెన్స్ కాబట్టి ఏం జరుగుతుందో చూద్దామని చెప్పారు. సైద్ధాంతికత, 75 ఏళ్ల ప్రయాణం సాగించిన పార్టీ డీఎంకే అని, ప్రజాసమస్యలపైనే పార్టీ పోరాడుతూ వచ్చిందని వివరించారు. అయితే ఆ పార్టీ మాత్రం స్థాపించిన రేండేళ్లలోనే 2026లో అధికారంలోకి రావాలని ఆశిస్తోందన్నారు. టివికె నేతలు డిఎంకె నేతల్లా ప్రజల కోసం పోరాటాలు చేసి జైళ్లకు వెళ్లలేదన్నారు. డీఎంకేకూ, ఇతర పార్టీలకు ఉన్న తేడా అదేనని, తాము చాలా పటిష్టంగా ఉన్నామని, ప్రజల కోసమే తాము పనిచేస్తామని, ప్రజల కోసమే తామున్నామని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు అన్నాడిఎంకె ప్రతినిధి కోవై సత్యన్ అభినందనలు తెలుపుతూనే, ఆయన పార్టీ అనుకున్నది సాధించాలంటే చాలా జర్నీ చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని పార్టీల సిద్ధాంతాలను కలగలిపిన ఐడియాలజీగా టివికె ఐడియాలజీని ఆయన అభివర్ణించారు. కొత్త సీసాలో పాత సారాగా పేర్కొన్నారు.

సమస్య ఉందని.. ఎమ్మెల్యేనే కోర్టుకు వస్తే ఎలా?

న్యూఢిల్లీ : ప్రభుత్వ యంత్రాంగంతో ముడిపడి ఉన్న సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఓ ప్రజాప్రతినిధి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంపై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అభివృద్ధి పనుల విషయంలో ఒక ఎమ్మెల్యేనే కోర్టును ఆశ్రయిస్తే ఎలా? అని ప్రశ్నించింది. ఇంత నిస్సహాయత ప్రదర్శించడం తగదని, అసెంబ్లీలో లేదా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఈ సమస్యను లేవనెత్తాలని సూచించింది. ఢిల్లీలోని ఓ పైవంతెనకు మరమ్మతులు చేపట్టి, పునఃప్రారంభించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే జితేంద్ర మహాజన్ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం.. సదరు ప్రజాప్రతినిధి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ‘ఎమ్మెల్యేలే కోర్టులకు రావడం మొదలుపెడితే ఏం జరుగుతుంది? ఇంత నిస్సహాయత ప్రదర్శించవద్దు. ఎన్నో అంచనాలతో ప్రజలు ప్రజాప్రతినిధి వద్దకు వస్తారు. ఆ సమస్యను ఎలా ఎత్తిచూపాలో తెలిసి ఉండాలి. అసెంబ్లీ లేదా ఇతర మార్గాల్లో ఈ సమస్యను లేవనెత్తాలి. వారే కోర్టులను ఆశ్రయించడం అనేది ప్రభుత్వ పనితీరును మంచిగా ప్రతిబింబించదు'' అని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
మంగళవారం, అక్టోబరు 29

విస్తృతమవుతున్న బ్రిక్స్

రష్యాలోని కజాన్ నగరంలో గతవారం జరిగిన 'బ్రిక్స్' 16వ అగ్రనాయక సమావేశం ఫలప్రదమైందనవచ్చు. ఆది సభ్యులైన ఐదు దేశాల పేర్ల ప్రథమాక్షరాల కూర్పుతో 'బ్రిక్స్'గా పిలవబడుతున్న (బి–బ్రెజిల్, ఆర్ –రష్యా, ఐ–ఇండియా, సి–చైనా, ఎస్–సౌతాఫ్రికా) ఈ సంస్థ అంతర్జాతీయ వ్యవహారాల్లో బహుళపక్ష సంబంధాల వృద్ధి లక్ష్యంగా పశ్చిమ దేశాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఏర్పడింది. దక్షిణాఫ్రికా కూడా కొంత ఆలస్యంగానే ఇందులో భాగస్వామి అయింది. దాంతో బ్రిక్ –బ్రిక్స్ అయింది. 2023 మొదలు మరో 5 దేశాలు – ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఇథియోపియా, ఇరాన్– సభ్యత్వం పొందాయి. అంతేగాక ఈ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా జరిగిన విస్తృత సమావేశంలో మరో 30దేశాల నేతలు పాల్గొనటం బ్రిక్స్ లక్ష్యాలతో భావసారూప్యత పెరుగుతున్నట్లు విదితమవుతున్నది. సోవియట్ యూనియన్ పతనం తదుపరి అమెరికా ఏకధృవ ప్రపంచం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రపంచాధిపత్య ఎత్తుగడలకు వ్యతిరేకంగా బహుళపక్ష అంతర్జాతీయ వ్యవస్థను కాంక్షించే దేశాలు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ప్రాంతీయ సహకార కూటములు ఏర్పాటు చేసుకున్నాయి. బ్రిక్స్ అటువంటిదే అయినా బలమైన ఆర్థిక వ్యవస్థలు కలిగిన కూటమి. ప్రస్తుతం 10 దేశాలు సభ్యులుగా ఉన్న బ్రిక్స్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాల్గవవంతుకు, ప్రపంచ జనాభాలో దాదాపు సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది. ప్రపంచ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్, డబ్ల్యు.టి.ఒ వంటి ప్రపంచ ఆర్థిక – వాణిజ్య సంస్థల పెత్తనానికి వ్యతిరేకంగా ఏర్పడిన సంస్థల్లో బ్రిక్స్ ప్రధానమైంది. అయితే ఈ సభ్యదేశాల మధ్య సమస్యలు లేకపోలేదు. భారత్–చైనా వాస్తవాధీన రేఖ వెంట తూర్పు లఢాక్‌లో నాలుగేళ్లుగా కొనసాగుతున్న సైనిక మోహరింపుకు ఈ కజాన్ సభ సందర్భంలో ప్రధాని నరేంద్రమోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ ముఖాముఖీ సమావేశంతో పరిష్కారం లభించింది. ఇది సరిహద్దు సమస్య పరిష్కారానికి బాటవేస్తే ఇరుదేశాల సంబంధాల్లో గుణాత్మక మార్పు తెస్తుంది. అలాగే ఇరాన్–యుఎఇ, ఈజిప్టు – ఇథియోపియాల మధ్య సమస్యలున్నాయి. అంతేగాక చైనాకు వ్యతిరేకంగా అమెరికా ఏర్పాటు చేసిన క్వాడ్‌లో అమెరి కా, ఆస్ట్రేలియా, జపాన్‌లతోపాటు భారత్ సభ్యురాలిగా ఉంది. అలాగే ఇండో–పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేంవర్క్‌లో కూడా భారత్ సభ్యురాలు. అందువల్ల ఇటువంటి వైరుధ్యాలను అధిగమించాలంటే బ్రిక్స్ సభ్యదేశాల మధ్య పరస్పర విశ్వాసం, మైత్రి, సహకారం వృద్ధి చెందాలి.

ఒక ప్రధాన విషయంపై క్రమంగా ఏకీభావం పెరుగుతున్నది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ పెత్తనానికి వ్యతిరేకంగా ప్రాంతీయ కరెన్సీలో సభ్యదేశాలమధ్య వర్తక–వాణిజ్యాభివృద్ధి. రష్యా–ఉక్రేన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలను దాటవేసేందుకు రష్యా–భారత్ మధ్య ఆయిల్ వాణిజ్యం, ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థ ఈ సందర్భంగా ప్రస్తావించదగినవి. ఈ సమావేశంలో నరేంద్రమోదీ తమ ప్రసంగంలో, ''బ్రిక్స్ దేశాల ద్రవ్య సంలీనత పెరగటాన్ని మేము ఆహ్వానిస్తాం. స్థానిక కరెన్సీలో వాణిజ్యం, సజావుగా క్రాస్–బార్డర్ చెల్లింపులు మన ఆర్థిక సహకారాన్ని పటిష్టం చేస్తాయి'' అన్నారు. ఈ వ్యవస్థలోకి చేరాల్సిందిగా అనేక దేశాలను ఆయన ఆహ్వానించారు.

ఉక్రేన్‌తో ఎడతెగని యుద్ధంతో రష్యా ఏకాకి అయిందన్న భావనను తొలగించిన కజాన్ శిఖరాగ్రసభ ఆమోదించిన డిక్లరేషన్ బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్న సందేశాన్ని గట్టిగా వినిపించాయి. తమ సభ్యులపై – ఉదాహరణకు రష్యా, ఇరాన్‌లపై ఏకపక్ష ఆంక్షలు అంగీకారయోగ్యం కాదని చెప్పింది. ఇంటర్‌బ్యాంక్ సహకార యంత్రాంగం, ధాన్యం ఆదాన ప్రదానం, క్రాస్ బార్డర్ చెల్లింపుల ఏర్పాటు, బీమా కంపెనీ, తమ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ వృద్ధిని ప్రోత్సహించాలని సమావేశం నిర్ణయించింది. ప్రస్తుతమున్న అంతర్జాతీయ పాలనా వ్యవస్థలకు ప్రత్యామ్నాయాలకోసం ప్రయత్నించాలన్న ఉద్దేశం అభిలషణీయమే అయినా అది ఏమంత సులువు కాదు. డాలర్‌ను, అమెరికా – పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని కాదని ప్రత్యామ్నాయంగా ఎదగటానికి సభ్యదేశాల మధ్య ఆర్థిక సంబంధాలు వృద్ధి చెందటమే కాదు, అంతర్జాతీయ సమస్యలపై ఏకీభావం వృద్ధిచెందటం కూడా అవసరం. ఆ దిశలో నిలకడగా ప్రయాణించటానికి నడుం కట్టాలి.

యూరప్ మితవాదంపై పోరుకు వామపక్షశక్తుల ఐక్యవేదిక

బ్రిటన్ ఎంపి జెరెమై కోర్బైన్ పిలుపు

యూరప్‌లో వామపక్ష శక్తుల ఐక్యవేదిక ఆవిర్భవించాల్సిన ఆవసరం ఉందని బ్రిటీష్ పార్లమెంటు సభ్యుడు, లేబర్‌పార్టీ మాజీ నాయకుడు జెరెమై కోర్బైన్ పిలుపు ఇచ్చారు. జాతి వివక్షను సమర్థిస్తూ, వలసదారుల వ్యతిరేకవైఖరి అనుసరిస్తున్న మితవాదశక్తులతో పోరాటం చేయాలంటే విశాలప్రాతిపదికపై యూరప్‌లో వామపక్ష శక్తుల ఐక్యవేదిక నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కోర్బైన్ చెబుతున్నారు. స్పెయిన్‌లో ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు ఆవిర్భవించిన ఆ దేశ అతివాద వామపక్షం ''పొడెమోస్'' పార్టీ దశాబ్ద వార్షికోత్సవ వేడుకలు గడచినవారం మాడ్రిడ్ నగరంలో జరిగాయి. ఈ వార్షికోత్సవ సభలో ప్రసంగించిన జెరెమై కోర్బైన్ యూరప్‌లో వామపక్ష శక్తుల విశాల ఐక్యవేదిక ఆవశ్యకతను ప్రముఖంగా తెరమీదకు తెచ్చారు. ఆయన ప్రసంగం సర్వత్రా అందరిలో ఎంతో ఆసక్తిని ప్రేరేపించింది. యూరప్‌ఖండ వ్యాప్తంగా అనేక దేశాలలో తాండవిస్తున్న నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుని యువకులను ఆకర్షించి తనవైపు తిప్పుకునేందుకు మితవాదపార్టీలు చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకునేందుకు పలు దేశాలలో విభిన్నరూపాలలో ఉధృతస్థాయిలో పోరాటాలు చేస్తున్న వామపక్షాలు కోర్బైన్ చేసిన ప్రతిపాదనలను ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి. యూరప్‌లోకి తరలివస్తున్న వసలదారులపై సామాన్య ప్రజలు చూపించే ద్వేషం, వైరభావాలపైనే ఇప్పుడు మితవాదశక్తుల పునరుత్థాన ప్రాభవాలు ఆధారపడిఉన్నాయి. యూరప్‌లో నివసించే స్థానిక ప్రజల ఉద్యోగ ఉపాధి అవకాశాలు తగ్గిపోవడానికి వలసదారులే కారణమని మధ్యతరగతి ప్రజలు గట్టిగా భావిస్తున్న తరుణంలో వామపక్షాలు, ఇతర మితవాద వ్యతిరేక శక్తులు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని జెరెమై కోర్బైన్ హెచ్చరిస్తున్నారు.

శ్రామికవర్గం పొట్టకొట్టి పొదుపు చర్యలు

''యూరప్ అంతటా వామపక్ష ఐక్యతను నిర్మించాలని మేము ఆశిస్తున్నాం. ఇందులో మూడు కీలక విషయాలు ఉన్నాయి. మొదటిది ఏమిటంటే పచ్చిమితవాద ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ప్రజాసమూహాలను కూడగట్టేందుకు బలమైన, శక్తిమంతమైన ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు చర్యలకు వ్యతిరేకంగా, శాంతిసాధనకు, పచ్చిమితవాదశక్తులను వ్యతిరేకిస్తూ ఈ ఉద్యమ నిర్మాణం జరగాలి. ఇప్పుడు తిరిగి పొదుపు చర్యల యుగాన్ని పునరుద్ధరించేదిశగా యూరప్ ప్రయాణం సాగుతున్నది. ఇందులోభాగంగా యూరప్‌ఖండ వ్యాప్తంగా శ్రామికుల వేతనాలపై దాడుల పరిస్థితులను మనం కళ్ళకుకట్టినట్టు చూస్తున్నాం. శ్రామికవర్గ జీవన ప్రామాణికతలు దిగజారిపోయాయి. ఎదుగూబొదుగూ లేకుండా వేతనాలు స్తంభించిపోయాయి. ఇలాంటి సమయంలోనే యూరప్‌లో గతంలో ఎన్నడూలేనంత ఎక్కువమంది బిలియనీర్లు, ధనికస్వామ్యశక్తులు పుట్టుకొచ్చారు'' అని వార్షికోత్సవ ప్రసంగంలో కోర్బైన్ చెప్పారు. వాస్తవానికి యూరప్‌లో అసమానతలు అనివార్యమైన విషయం కాదు, అసమానతలుండే అవసరం లేదు. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలే అసమానతలకు కారణం. అందరిదగ్గరనుండీ సొమ్ములు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు వాటిని కొద్దిమందికి మాత్రమే కట్టబెడుతున్నాయి. ఈ ఏడాది జులై 4న జరిగిన బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన లేబర్‌పార్టీ ప్రభుత్వం 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా గతవారంలో వేడుకలు చేసుకుంది. ఆ సందర్భంగా పాలకపక్షం అత్యంత కఠినమైనవిగా పేర్కొనే రెండు మార్గాలను ఎన్నుకుంది. తల్లిదండ్రులు సంతానాన్ని ఇద్దరు బిడ్డలకే పరిమితం చేయడాన్ని కొనసాగించడం ద్వారా బ్రిటన్‌లో పిల్లల్ని పేదరికంలోనే ఉంచేయడం, 2.50 లక్షలమంది పేద పిల్లలను దారిద్ర్యంలోంచి బైటకు తెచ్చేందుకు తిరస్కరించడం. తల్లిదండ్రులు మూడోబిడ్డను కంటే ప్రభుత్వ పన్ను రాయితీలను కోల్పోతారు. 2017లో అమలులోకి వచ్చిన ఈ విధానాన్ని కొనసాగించాలని లేబర్‌పార్టీ నిర్ణయించింది. ఈ పరిమితిని రద్దుచేస్తే బ్రిటన్‌లో 2.50 లక్షలమంది పిల్లలను పేదరికం నుండి బయటకు తీసుకురావాల్సి వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం 1.3 బిలియన్ పౌండ్లు ఖర్చు చేయవలసి వస్తుంది. ఈ ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఇక రెండో నిర్ణయం ఏమిటంటే శీతాకాలంలో కోటిమంది పెన్షనర్లకు ఇచ్చే ఇంధన అలవెన్స్‌లో కోత విధించడం. పొదుపు చర్యలు తీసుకోవాలంటే ఇలా కోతలు విధించకుండా అమలుచేసే చాలా ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయన్నదే కోర్బైన్ వాదన.

అందుకు తగిన వివరణలను కూడా ఆయన ఇచ్చారు. సంపదపన్నులను 10 బిలియన్ పౌండ్లకు పైగా పెంచాలని ఆయన ప్రతిపాదించారు. ప్రైవేటు కాంట్రాక్టులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ధనాన్ని వృథాచేయవద్దని కూడా ఆయన ప్రతిపాదించారు. విద్యుత్, నీటి నిర్వహణ యాజమాన్యాన్ని ప్రభుత్వ అజమాయిషీలోకి తీసుకురావడం ద్వారా వాటి మౌలిక పునఃపంపిణీ కార్యక్రమా న్ని చేపట్టాలని, తద్వారా ఖర్చులు తగ్గించాలని ఆయన ప్రతిపాదించారు. తా ము అధికారంలోకి వస్తే పరిస్థితులన్నీ మారిపోతాయని చెప్పిన ప్రభుత్వం దీనికి బదులుగా ప్రకృతి వనరులను ప్రజలకు దూరం చేసే మార్గాలను ఎంచుకుందని కోర్బైన్ విమర్శించారు. ఇక్క డ బ్రిటన్‌లో ఉండటానికి చాలా ధనం ఉంది, కానీ ఆ సంపద కొద్దిమంది అయోగ్యుల, అక్రమ వ్యక్తుల చేతుల్లో ఉంది. క్రూరమైన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నాల్లో మంత్రులు మొసలి కన్నీరు కార్చడం ద్వారా మంత్రులు తమను తెలివితక్కువ దద్దమ్మలను చేయలేరని జెరెమై కోర్బైన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

భద్రత అంటే పొరుగుదేశాన్ని ధ్వంసం చేయడం కాదు

''పొదుపు చర్యలు పాటించాలనే నిర్ణయం కఠినమైన ప్రత్యామ్నాయం కాదు. అదొక తప్పుడు నిర్ణయం. తప్పుడు ప్రత్యామ్నాయ పద్ధతి. ప్రభుత్వ కోశాగారంలో డబ్బులేదని మాకు (ప్రజలకు) చెబుతున్నారు. అదే సమయంలో రక్షణ వ్యయాన్ని మాత్రం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 2.5 శాతానికి పెంచారు. భద్రతను పెంచుకోవడం అంటే మన పొరుగుదేశాన్ని బెదిరించడంకాదు, ఆ దేశాన్ని ధ్వంసం చేయడంకాదు, భద్రత పెంచుకోవడమంటే పొరుగుదేశంకంటే మెరుగైన అభివృద్ధి సాధించడం. అంటే భూగోళాన్ని భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఆవాసయోగ్యంగా,ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడం. మన బిడ్డలలో విశ్వాసాన్ని కలిగించడం భద్రత పెంచుకోవడం అంటే, యుద్ధం, పేదరికం, ఆర్థిక సంక్షోభంతో వలసలు పోవడం, ఇళ్ళువదిలి పారిపోవడం, దిక్కుమాలిన పరిస్థితుల్లోకి దిగజారిపోవడంకాదు. భద్రత అంటే ప్రతిఒక్క మనిషీ చాలినన్ని ప్రకృతి వనరులతో ఆరోగ్యంగా, సంతోషంగా జీవించడం'' అని కోర్బైన్ తన ప్రసంగంలో చెప్పారు.

ఫిరంగుల రాక్షసాగ్రహం ఆయుధ పరిశ్రమలకే లాభం

ఇజ్రాయెల్ ప్రస్తుతం చేస్తున్న యుద్ధనేపథ్యంపై కూడా కోర్బైన్ స్పష్టమైన అభిప్రాయాలు తెలియజేశారు. ''ప్రపంచం ఇప్పుడు యుద్ధంలో ఉంది. మనందరం శాంతి సాధన దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉంది, కానీ బ్రిటన్ ప్రభుత్వం ఈ మధ్యనే ఉక్రేన్‌కు 600 బిలియన్ పౌండ్ల సహాయం ప్రకటించింది. మనం యుద్ధ నివారణకు పరిష్కారాలు సాధించాలిగానీ ఆయుధపోటీని పెంచకూడదు. యుద్ధాన్ని వ్యాప్తిచేసే ప్రమాదాన్ని పెంచకూడదు. అన్ని యుద్ధాలూ చర్చల ద్వారా లేదా దౌత్యపరమైన పరిష్కారాల ద్వారా ముగిసిపోవాలి. మరి వేలాదిమంది ప్రజల ప్రాణాలు కాపాడటంకోసం ఈ పని ఎందుకు చేయడం లేదు?'' అని కోర్బైన్ తన ప్రసంగంలో ప్రశ్నించా రు. ''అవిశ్రాంతంగా కొనసాగే యుద్ధాలవల్ల ఒకే ఒక్క పరిశ్రమ ప్రయోజనం పొందుతుంది. అదే ఆయుధ పరిశ్రమ'' అని ఇటీవల ఆయన విడుదల చేసిన ''ఫిరంగుల రాక్షసాగ్రహం'' అనే ఒక పుస్తకంలో పేర్కొన్నారు. పాల్ రోజెర్స్, రోహ్నా మిఫీ, ఆంద్రూ ఫైన్‌స్టెయిన్‌లతో కలిసి కోర్బైన్ ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఈ యుద్ధాలు ఎందుకు అలా ''సాగుతూ సాగుతూనే ఉన్నాయి'' అనే విషయాన్ని మనం అర్థం చేసుకోవడానికి, యుద్ధాలపై మనకు ఒక అవగాహన రావడానికి కోర్బైన్ రాసిన ''ఫిరంగుల రాక్షసాగ్రహం'' పుస్తకం దోహదం చేస్తుంది. ''ఉక్రేన్ కావచ్చు, సూడాన్, పశ్చిమ పపువా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో కావచ్చు, ఏదేశంలో జరిగినాగానీ ఈ యుద్ధాల అసలైన కారణాన్ని మీడియా ప్రచురించడంలేదు. ఈ అన్ని యుద్ధాల ద్వారా ప్రపంచ ఆయుధ పరిశ్రమ మానవజాతి జీవితాలను పణంగా పెట్టి, భూగోళంపై విధ్వంసం సృష్టించి లక్షల బిలియన్ల డాలర్ల వ్యాపారం చేస్తున్న విషయం ఇప్పుడు గాజాలో పరిణామాల ద్వారా మనకు చాలా స్పష్టంగా కళ్ళకు కట్టినట్టు కనిపిస్తోంది'' అని 'పొడెమాస్' వార్షికోత్సవ సభ ప్రసంగంలో జెరెమై కోర్బై పేర్కొన్నారు. యూరప్‌లో ప్రభుత్వాలన్నీ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ పరిణామాలను చూపించి భయపెడుతున్నాయి. యుద్ధంవల్ల మరింతగా వలసలు పెరుగుతున్నాయి. మునుపెన్నడూలేని విధంగా పర్యావరణం నాశనమవుతోంది. యుద్ధాలవల్ల నిరాశ్రయులైపోయినవారికి, సురక్షితమైన జీవన ఆవాసంకోసం వెదకులాడేవారికే మా సంఘీభావం. రాజకీయనాయకులు వలసదారులను భయభ్రాంతులను చేస్తుంటే పచ్చిమితవాదులు తలలు ఊపుతున్నారు. వలసవచ్చినవారికి స్వస్థలాలకు పంపాలని రాజకీయ నాయకులు చెప్పినప్పుడు పచ్చిమితవాదులు 'సై' అంటున్నారు. రాజకీయ ఆశయం లేకుండా విద్వేష రాజకీయాలను మనం ఓడించలేం. భయాన్ని, చీలికలను సవాలు చేయాలంటే వలసవాదుల విజయగాథలను అందరి దృష్టికీ తీసుకురావాలి. ఎక్కడోపుట్టిన మన జీవితాలు వలస ప్రాంతాలలో ఎంత సంతోషంగా, సంపద్వంతంగా ఉంటాయో చెప్పాలి. వీటన్నింటికీ మించి వలస వచ్చినవాళ్ళంతా 'మీలాంటి వాళ్ళు, మన లాంటివాళ్ళే''అని అందరికీ తెలియజెప్పాలి. అందువల్ల నలుపు, తెలుపు అనే వర్ణ వివక్షను ఎదుర్కొనేందుకు, ఒక కృతనిశ్చయం తీసుకునేందుకు వామపక్షాలకు ఇదే సరైన తరుణం.ముందు వలసవచ్చిన వారిని రక్షించాలి. ఉత్తమ ప్రపంచ సాధనకోసం అందరినీ ప్రేరేపించాలి. ఆ విధంగా మనం పూర్తిగా పచ్చిమితవాదులను ఓడించగలుగుతాం'' అని జెరెమై కోర్బైన్ తన ప్రసంగంలో చెప్పారు.

సాత్యకి చక్రవర్తి
(ఐపిఎ సర్వీస్)

ఆర్టీసీ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

ఎన్నికలు వాయిదా ఎందుకు?

ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్‌ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

ఆర్టీసి కార్మికులు బయటి వ్యక్తుల నుండి ఎక్కువ వడ్డీకి కుటుంబ అవసరాలకోసం అప్పులు తీసుకొచ్చి ఇబ్బందులు పడకుండా ఉండడం కోసం 1952వ సంవత్సరంలో కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయడమైనది. నాటినుండి నేటి వరకు సొసైటీ దినదిన ప్రవర్ధమానమవుతూ వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 02.11.2015న ఈ సొసైటీ మళ్ళీ రిజిస్టర్ చేయబడింది. ప్రతి 5 సంవత్సరాలకు సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి. ఇది విధాన నిర్ణయం. కాని 2021 సంవత్సరం నుండి నేటివరకు పాలకమండలి ఎన్నికలు జరిపే ప్రయత్నం ఆర్టీసి యాజమాన్యం చేయడంలేదు. కోఆపరేటివ్ సొసైటీ సెక్రటరీ మరియు ఆర్టీసి ట్రేడ్ యూనియన్లు పాలక మండలి ఎన్నికలు జరపాలని ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ పాలకమండలి కాలపరిమితిని ఇప్పటికే 3 సార్లు పొడిగించారు. ఈ పొడిగించిన పాలకమండలి సమయం కూడా అయిపోయినందున వెంట నే ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు కోరుతున్నారు.

సిసిఎస్ కు ఆర్టీసి యాజమాన్యం సుమారు 1,000 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అది ఇంతవరకు చెల్లించకపోవటం వల్ల ఆర్టీసి ఉద్యోగులకు లోన్లు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆర్టీసికి ఇవ్వాల్సిన ఫండ్స్ విడుదల చేయదు కాని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు మూసీనది పరీవాహక ప్రాంతంలో ఇళ్ళు కట్టించి ఓ 3 నెలల పాటు ఆ నాయకులు ఆ ఇళ్ళలో ఉండాలని ప్రభుత్వం సవాలు విసురుతోంది. ప్రతి సవాలుగా బిఆర్‌ఎస్ నాయకులు 3 నెలలు కాదు, సంవత్సరం ఉంటాం అంటున్నారు. ఆ నాయకులకు ఇళ్ళు కట్టించి ఇచ్చేబదులు ఆ సొమ్మేదో ఆర్టీసి కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించిన ఆర్టీసి కార్మికులు ఎంతో సంతోషపడతారు కదా. ఆర్టీసి కార్మికుల జీతాల నుండి 4.5శాతం రికవరీ చేయగా వచ్చిన 15 కోట్ల రూపాయలను ప్రతినెల ఆర్టీసి సంస్థ వారి అవసరాలకు వాడుకుంటూ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి ఎగనామం పెడుతోంది. ప్రభుత్వం కూడా ఆర్టిసికి ఇవ్వాల్సిన మహాలక్ష్మి పథకానికి ప్రతినెల 300కోట్లు మొత్తం ఇవ్వకుండా కొంత ఎగనామం పెడుతూనే ఉంది. గత పుష్కర కాలంగా ఆర్టీసి మేనేజిమెంట్ ఉద్యోగుల జీతాలనుండి రికవరీ అయిన సొమ్మును ఫండ్స్ రూపంలో పంపకుండా సొసైటీని మోసం చేస్తోంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాల భవనాలకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలకు అద్దెలు ఎలాగైతే చెల్లించడం లేదో అలాగే ఆర్టీసి యాజమాన్యం కూడా కోఆపరేటివ్ క్రెడి ట్ సొసైటీకి బకాయిలు చెల్లించలేక నానా అవస్థ పడుతోంది.

కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో 31,611మంది షేర్ హోల్డర్స్ ఉన్నారు. 9వేల మంది షేర్ హోల్డర్స్ సొసైటీ పరిస్థితి బాగాలేదని వారి సభ్యత్వాన్ని ఉపసంహరించుకోవటం సొసైటీ మనుగడకు గొడ్డలిపెట్టు అయింది. సొసైటీలో గత దశాబ్దకాలంగా రిక్రూట్మెంట్ లేక ఉద్యోగులపై పనిభారం పెరిగి ఒత్తిడికి లోనవుతున్నారు. పదోన్నతులు కూడా సొసైటీలో ఇవ్వడం లేదు. 2021 వేతన సవరణ కూడా ఆ ఉద్యోగులకు జరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసి కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆసియా ఖండంలోనే నెంబర్ 1 సొసైటీగా గుర్తించబడింది. కాని ఆర్టీసి యాజమాన్యం నిర్వాకం వల్ల సొసైటీ ప్రతిష్ఠ దిగజారి షేర్ హోల్డర్లు సభ్యత్వాన్ని ఉపసంహరించుకునే దుస్థితి ఏర్పడింది. గత 6నెలలుగా రిటైరైన ఉద్యోగులు కోఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న ఫిక్సెడ్ డిపాజిట్లపై వడ్డీ ఇవ్వకపోవడంతో రిటైరైన ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికంతటికీ కారణం ప్రతినెల సొసైటీకి విడుదల కావలసిన ఫండ్స్ ఆర్టీసి యాజమాన్యం విడుదల చేయకపోవటమే. ఓట్లు వేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించిన కార్మికవర్గం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంటే ప్రభుత్వ మంత్రులు ఇంట గెలిచి రచ్చ గెలవాలి అనే విషయాన్ని మరిచిపోయి మూసీ సుందరీకరణ ఒక్కటే పరమార్థం అంటూ దేశ విదేశాలు తిరుగుతూ మూసీ నదిని లండన్ లో థేమ్స్ లాగా, దక్షిణ కొరియాలో సియోల్ లాగా అభివృద్ధి చేస్తామంటున్నారే కాని ఆర్టీసి అభివృద్ధి గురించి, కార్మికుల ఇక్కట్ల గురించి వారికి పట్టటం లేదు.

ప్రభుత్వోద్యోగులకు డిఎలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర నిధులు ఉండవు కాని, సుందరీకరణ కు మాత్రం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామనడం విడ్డూరం గా ఉంది. ఆర్టీసి సంస్థ నష్టాల నుండి ఎలా బయటపడాలో చెప్పడానికి ఆ సంస్థకు నిపుణులైన ఫైనాన్షియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ కూడా ఉన్నారు. వారు సంస్థని ఆర్థిక నష్టాల నుండి ఎలా బయటపడేయాలో ఆలోచించటం మానేసి వేల కోట్ల నష్టాలలో ఉన్న సంస్థ నుండి లక్షలలో జీతాలు తీసుకుంటూ ఉద్యోగుల కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సిసిఎస్)కి ఫండ్స్ రిలీజ్ చేయకుండా, సంస్థ అవసరాలకు వాడుకోవడం వారి మేధావితనానికే మచ్చ. సొసైటీల రిజిస్ట్రార్ పాలకమండలి కాలపరిమితి మళ్ళీ పొడిగించకుండా వెంటనే కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

మానవాళిని ఏకంచేస్తున్న అంతర్జాలం!

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ ఎఐఎంఎల్ యుగంవరకు మానవ పరిణామక్రమంలో ఊహకందని మార్పు లు ఉప్పెన వలె విశ్వ మానవాళిని చుట్టేస్తూ, జీవన శైలి లో అద్వితీయ మార్పులకు నాంది పలుకుతున్నది. భూమి కుగ్రామమైంది. దేశ సరిహద్దులు వెలవెలబోతున్నాయి. దూరా లు దగ్గరైపోయాయి. క్షణాల్లో ప్రపంచంలో ఏమూల లో ఉన్న వ్యక్తితో అయినా వీడియో కాల్ చేసి ముచ్చట్లలో మునిగి పోయే రోజులు వచ్చాయి. స్మార్ట్‌ఫోన్‌లో విశ్వం ఇమిడి పోయింది. అర చేతిలో వైకుంఠం వెలసింది. స్మార్ట్ చరవాణి మానవ దేహంలో అంర్భాగమైంది. యూ ట్యూబ్, యూపిఐ చెల్లింపులు, ఆన్‌లైన్ వ్యాపారాలు, ఫేస్‌బుక్కుల చిత్రాలు, ట్విట్ట ర్ కూతలు, మెసెంజర్ మాయలు, గూగుల్ విషయ మతలబులు, ఇన్స్టాగ్రామ్ ఇకమతులు, వాట్స్‌అప్ వయ్యారాలు, ఏఐఎంఎల్ అద్భుత మరమనుషులు లాంటి సామాజిక మాద్యమాల్లో తలదూర్చకుండా పొద్దు గడవడం లేదు. సెల్‌ఫోన్ చేతుల్లో లేకపోతే మనసు మనసులో ఉండడం లేదు. సంటోడికి ముద్ద దిగాలంటే స్మార్ట్‌ఫోన్ లేదా టీవీలో వీడియో చూపాల్సిందే. ఈ అత్యద్భుత అసాధ్యాలను సుసాధ్యం చేయడానికి మానవుడు కనిపెట్టిన అపూర్వ ఇంటర్‌నెట్ లేదా అంతర్జాలం అనేదే ఏకైక ఎలక్ట్రానిక్ సాధనంగా ప్రపంచం ముందు నిలిచింది.

29 అక్టోబర్
అంతర్జాతీయ
'అంతర్జాల దినం'

అర్థ శతాబ్దపు అద్భుత అంతర్జాల సేవలు: అంతర్జాల వల భూమిని చుట్టి 850 కోట్ల విశ్వ మానవాళిని ఒకే వలలో కూర్చి ఏకం చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్ వ్యవస్థలను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచార వితరణ చేయడమనే బాధ్యతలను అంతర్జాలం సునాయాసంగా, విజయవంతంగా నిర్వహిస్తున్నది. నేటి 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ లేదా వరల్ వైడ్ వెబ్'ను 1989లో 'టిమ్ బెర్నర్స్ లీ' ద్వయం కనుగొన్నారు. ఇది 1991 నుంచి ప్రజల వినియోగానికి అందుబాటులోకి వచ్చింది.

వరల్డ్ వైడ్ వెబ్, ఇంటర్నెట్ ప్రక్రియలు గత ఐదు దశాబ్దాలుగా పల్లెల నుంచి పట్నా ల వరకు తమ ఉనికితో మానవాళికి ఊపిరిగా నిలుస్తున్నా యి. మానవ జీవితాల్లో పెనుమార్పులకు నాంది పలికాయి. 29 అక్టోబర్ 1969న కాలిఫోర్నియా యూనివర్సిటీలో 'చార్లీ క్లైన్ లియొనార్డ్ క్లీన్‌రాఖ్'ల చొరవతో తొలి సారి 'ఎల్‌ఓ' అనే లాగిన్ పదాన్ని ఎలక్ట్రానిక్ మెసేజ్ ద్వారా విజయవంతంగా పంపించడంతో ఆ అద్భుత ఘట్టానికి పట్టాభిషేకం చేస్తూ ప్రపంచ మానవాళి ప్రతి ఏట 29 అక్టోబర్ రోజున ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే లేదా అంతర్జాతీయ అంతర్జాల దినం పాటించుట 2005 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రారంభంలో 'ఇంటర్నెట్'ను 'ఆర్పనెట్'గా పిలిచే వారు. నేడు ఇంటర్నెట్ వేదికగా వాయువేగాన్ని అధిగమించి క్షణాల్లో 'ఇన్ఫర్మేషన్ సూపర్ హైవే' రూపంలో సమాచారాన్ని వితరణ చేయడం సర్వసాధారణం అయ్యింది. ఇంటర్నెట్‌లో 'సర్ఫింగ్' అనే పదాన్ని 1992లో 'జీన్ ఆర్మర్ పోల్లీ లేదా నెట్ మమ్' ప్రవేశపెట్టారు. 2004లో 'మార్క్ జుకెర్‌బర్గ్' ఫేస్‌బుక్‌ను కనిపెట్టాడు. 1971లో తొలిసారి 'రే టాంలిన్సన్' ద్వారా ఈమేయిల్ పంపడం జరిగింది. 1990లో మైక్రోసాఫ్ట్ విండోస్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998 లో గూగుల్, 2006లో ట్విట్టర్, 2005లో యూట్యూబ్ లాంటి సామాజిక మాద్యమాల ఉప్పెనలు వచ్చి మానవాళిని సమాచార సముద్రంలో ముంచేస్తున్నాయి.

కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్:

ప్రస్తుతం గూగుల్‌ను 'కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్' అని పిలుస్తున్నాం. గూగుల్ అనగా 'గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఓరియంటెడ్ గ్రూప్ లాంగ్వేజ్ ఆఫ్ ఎర్థ్' అని అర్థం చేసుకోవాలి. నేడు ప్రతి ఇంట, వ్యక్తి వెంట, కార్యాలయాల్లో కూడా స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ఐప్యాడ్స్, ల్యాబ్‌లాప్‌లు, కంప్యూటర్లు, కెమెరాలు, టీవీలు లాంటి పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు 'వైఫై' సహాయంతో ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్‌కు పైగా వెబ్ సైట్లు వాడుకలో ఉన్నాయి. నేడు విశ్వవ్యాప్తంగా 50 మిలియన్ హార్స్ పవర్లకు పైగా విద్యు త్తు వినియోగించుతున్నది. నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదు బిలియన్ల (60 శాతం జనాభాకు పైగా) ఇంటర్నెట్ వినియోగదారులు, 4 బిలియన్లకు పైగా చరవాణి వాడకందారులు, ప్రతి రోజు ఒక మిలియన్ల ప్రజలు ఇంటర్నెట్‌కు నూతన వినియోగదారులుగా చేరుతున్నా రు.

ఇంటర్నెట్ వరమా, శాపమా !

నేడు అంతర్జాలం పుణ్యాన ఈమెయిల్స్, పరిశోధనలు, డౌన్‌లోడ్ ఫైల్స్, ఆన్‌లైన్ చర్చలు, ఈవిద్య, వీడియో గేమ్స్, స్నేహితుల ముచ్చట్లు, ప్రింట్ మీడియా, సామాజిక మాద్యమాలు, విజ్ఞాన వినిమయాలు, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నిం గ్, ఆర్థిక లావాదేవీలు, ఓటిటి వేదికలు, సినిమాలు, ఫైల్ ట్రాన్స్‌ఫర్లు, వర్చువల్ మీటింగ్స్, ఈలైబ్రరీలు, బ్యాంకింగ్ సేవలు, రవాణా రంగాలు లాంటి అసంఖ్యాక రంగాలు ఇంటర్నెట్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. మానవాళికి వరంగా మారిన ఇంటర్నెట్ నేడు కొందరికి శాపంగా కూడా మారుతున్నది. ఈ సదుపాయాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రబుద్ధులు రోజు రోజుకు పెరుగుతున్నారు. పోర్న్ సైట్లు, సైబర్ నేరాలు, పిల్లలు ఇంటర్నెట్ దురలవాటుగా మారడం, గంటల తరబడి నెట్ వాడడంతో అనారోగ్యాల పాలు కావడం, దుర్వినియోగాలు పెరగడం, స్థూలకాయ రుగ్మతలు, ఒత్తిడి పెరగడం, ఓపిక తగ్గడం, నిద్రలేమా సమస్య లు, పనిలో ఏకాగ్రత కొరవడడం, ఆన్‌లైన్‌లో అనవసర వస్తువులు సహితం కొనడం, ఆన్‌లైన్ మోసాలు, ఒంటరితనంతో మానసిక రోజులుగా మారడం లాంటి ప్రతికూల ప్రభావాల విషవలలో ఇంటర్నెట్ యూజర్స్ పడిపోవడం చూస్తు న్నాం.

అంతర్జాలాన్ని సదాలోచనలతో సురక్షితంగా వాడుకుంటూ, దుష్ప్రభావాలకు దూరం/అతి జాగ్రత్తగా ఉంటూ, అభివృద్ధికి ఊతం ఇచ్చే విధంగా వాడుకుందాం. ఆరోగ్యకర వసుదైక సమైక్య కుటుంబాన్ని నిర్మించుకుందాం. ఆత్మ సౌందర్యం పెరిగే విధంగా అంతర్జాలాన్ని వినియోగించుకుందాం. 'ఇంటర్నెట్ ఈజ్ ఫర్ బెట్టర్‌మెంట్' అనే నినాదాన్ని నిజం చేసి చూపుదాం.

డా॥ బిఎం.రెడ్డి

లేఖలు

ఆహారపదార్థాల నాణ్యత పరీక్షించాలి

తెలంగాణలో ఇటీవల హైదరాబాద్ మహా నగరం తో పాటు జిల్లాలలోని అనేక ప్రాంతాలలో రెస్టారెంట్లు హోటళ్లలో తయారు చేస్తున్న ఆహార పదార్థాలను అందులో ఉపయోగిస్తున్న వస్తువులను ఫుడ్ సేఫ్టీ స్థానిక సంస్థల అధికారులు పరిశీలిస్తున్నారు. నాసిరకమైన కుళ్ళిపోయిన పదార్థాలను పరిశీలించి ఆయా యజమానుల పై తగు చర్యలు తీసుకోవడం పాటు వాటిని మూసివేస్తు కేసులు కూడా నమోదు చేస్తున్నట్లు దినపత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా చూస్తున్నాము ఇది చాలా హర్షణీయమైన విషయం. ఈ పరిశీలనలు నిరంతర ప్రక్రియ గా కొనసాగిస్తూ రుచి, శుచికరమైన ఆహారం అందించుటకు తోడ్పడి ప్రజల ఆరోగ్యాలను సంరక్షించుటకు మార్గదర్శకంగా నిలవాలి. ఇదే విధంగా వీధులలో నిర్వహిస్తున్న భోజనశాలలు టిఫిన్ సెంటర్లలో కూడా ఫుడ్ సేఫ్టీ మరియు స్థానిక సంస్థల అధికారులు కలిసి తరచుగా వారు ఉపయోగిస్తున్న ఆహార పదార్థాలను వస్తువులను కూడా పరిశీలించాలి. ఈ వ్యాపారులు తక్కువ ధరకు ఆకలితో అలమటిస్తున్న వారికి ఆహారం అందిస్తున్న వాటి నాణ్యతను పరిశీలించాలి. ఇక్కడ ఎలాంటి శుభ్రతకు చర్యలు తీసుకున్నట్టు కనిపించవు. రోడ్డుపైనే నిర్వహించడం వలన వాహనాల రాకపోకలతో కాలుష్య ప్రభావం ఈ వంటకాలపై ఉంటుంది. బహిరంగంగానే వీటిని నిర్వహిస్తున్నారు ఇక్కడి సరఫరా చేసే త్రాగే నీటి స్వచ్ఛత సందేహమే! ముఖ్యంగా సాయంత్రం వేళలో వివిధ రకాల రొట్టెలు రోడ్డు వెంబడి తయారు చేస్తుంటారు. ఇందులో ఉపయోగించే పిండి నాణ్యతను కూడా పరిశీలించాలి. పానీపూరి సెంటర్లు, డ్రైనేజీ చాంబర్ల ప్రక్కన అపరిశుభ్ర స్థలంలో నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా ఏ చోటైనా మనుషులు భుజించే ఆహారం కల్తీ లేకుండా నాణ్యతతో అందించాలి. స్వార్థపూరిత లాభార్జన కోసం మనుషుల జీవితాలతో చెలగాట మాడడం శ్రేయస్కరం అనిపించుకోదు.

దండంరాజు

సామాన్య భక్తుల ఇబ్బందులు తొలగించండి

2024 అక్టోబర్ 23నాడు వైకుంఠం–1 కంప్లెక్స్ 21నంబర్ కంపార్ట్మెంట్ లో రెండున్నర గంటలు కూర్చోబెట్టారు. త్రాగు నీరు, భోజనం లేదు. 300/ ప్రత్యేక దర్శనం 4 గంటలు అయింది. TTD Administration failure. ప్రభుత్వం మారినా అధికారులు మారలేదు. సామాన్య భక్తులకు నరకం చూపుతున్నారు. విఐపిలకు బాగుంది. వరాహ స్వామి దేవాలయం దగ్గర నచ్చిన వారికి అడ్డదారిలో దర్శనం కల్పించి సామాన్య భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక 300/– దర్శనం లైన్ లో గంటలకొద్ది నిలబెడుతున్నారు. ఈ సంప్రదాయం బాగా లేదు.

దర్శనం అయిన తర్వాత బంగారు వాకిలి నుండి బయటకు వెళ్ళడానికి 30 నిముషాలు నిలబెట్టి బయటకు పంపుతున్నారు. భక్తులను నిరాశకు గురి చేస్తున్నారు.

పి.బాలకృష్ణ

సిపిఐ నగర కార్యదర్శి జానిమియాకు మాతృవియోగం

నివాళులర్పించిన పువ్వాడ, బాగం, పోటు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సిపిఐ నగర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా మాతృమూర్తి హుస్సేన్‌బీ (70) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆమె కమ్యూనిస్టు పార్టీలో సీనియర్ సభ్యురాలే కాకుండా పుట్టకోట గ్రామంలో పార్టీలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆమె పెద్ద కుమారుడు ఖాదర్ పుట్టకోట గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. జానిమియా, ఖాదర్‌లను ప్రజా ఉద్యమాల వైపు మల్చడంలో హుస్సేన్‌బీ కృషి ఎనలేనిది. మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, పలువురు సిపిఐ నాయకులు, బిఆర్‌ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చోటాబాబా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కమ్యూనిస్టు పార్టీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై హుస్సేన్‌బీకి నివాళులర్పించారు.

సత్యనారాయణరెడ్డి మాతృమూర్తికి సిపిఐ నాయకుల నివాళి

ప్రజాపక్షం/బోనకల్ : మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మమత హాస్పటల్స్ యూడిసీ చిట్టా సత్యనారాయణరెడ్డి మాతృమూర్తి చిట్టా మంగమ్మ(95) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతదేహన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, ఏనుగు గాంధీలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంగమ్మకు ఒక కుమార్తె, ఏడుగురు కుమారులున్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, గ్రామ శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బోయినపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కరరావు, బోళ్ల ప్రసాదరావు, సిపిఎం నాయకులు షేక్ నజీరు, షేక్ హుస్సేన్ తదితరులుఉన్నారు.

ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలు

జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ సాబీర్‌పాషా పిలుపు

ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరపాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం శేషగిరి భవన్‌లో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ కార్మిక అడ్డాల వద్ద జెండా ఆవిష్కరణలు చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, కడారి వెంకటేశ్వర్లు, ఆర్.లక్ష్మీ నారాయణ, సలిగంటి శ్రీనివాస్, వట్టికొండ మల్లికార్జునరావు, యూసుఫ్, గోనె మణి, విజయలక్ష్మి , వి.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని తనికెళ్ల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకి గత నెలరోజులనుంచి పెద్ద పెద్ద టిప్పర్లు , డంపర్లతో రాత్రింబవళ్లు రోజు వందల ట్రిప్పుల మరంతోలుతుండటంతో గ్రామంలోని తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని దానిని డబుల్ రోడ్డు వేయించాలని కోరుతు సోమవారం సిపిఐ నాయకులు ఖమ్మం జిల్లా కలెక్టర్ మిజుమ్ముల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ , తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోనుంచి ప్రతిరోజు వందల టిప్పర్లు మరంతోలుతుండటంతో తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చర్యలు తీసుకొని గ్రామంలో దెబ్బతిన్న తారురోడ్డును డబుల్ రోడ్డు చేసి కొత్త తారురోడ్డు వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడపా రామకోటయ్య, బాసా నాగరాజు , పెదమళ్ల రత్తమయ్య పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పంచాయతీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన బి.రమణకు, సత్యనారాయపురానికి చెందిన అనుముల పట్టాభిరెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజురయ్యాయి. వీటిని స్థానిక సిపిఐ నాయకులు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి సిఫారస్‌తో చెక్కులు వచ్చాయి. కార్యక్రమంలో మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, బానోత్ రాంకోటి, గూడా బాబురెడ్డి, వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్‌రావు, కొనకటి రామకృష్ణరెడ్డి, మిరియాల నరుణ్‌తేజ్, బుద్ధి రాధాకృష్ణ, బుద్ధి నాగేశ్వరరావు, చిదుముల బాబురెడ్డి, కొలిచలం వెంకటరమణ, మామిళ్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో రహదారి నిర్మాణాలు

మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్ ఏకలవ్య నగర్ నందు టియుఎఫ్ఐడిసి నిధులు రూ.1.55 కోట్లతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈసందర్బంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని, లెవలింగ్ సరిగ్గా ఉండాలని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు ఆర్డర్ ప్రకారం చేపట్టాలని నాణ్యతలో ఎక్కడ రాజీపడవద్దన్నారు. ఖమ్మం నగరాభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని డివిజన్లలో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్‌డిఒ గణేష్, కార్పొరేటర్లు చామకూరి వెంకన్న, కమర్తపు మురళి, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాని ఫైర్ వర్క్స్ దుకాణాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొంది వ్యాపారంలో రాణించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కమర్తపు మురళి, తుపాకుల యలగొండస్వామి, మాజీ ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల మల్లయ్య ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌ను కలిసి పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. ఈసందర్బంగా మల్లయ్య మాట్లాడుతూ పెండింగ్ జీతాలు సిబ్బందికి చెల్లించాలని లేనియెడల విధులు బహిష్కరించి ధర్నా చేపడతామని తెలిపారు. జీతాల సమస్యను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డిపిఒను ఆదేశించారని మల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో కె.మహేష్, గుగులోత్ రాందాస్, బానోత్ మంగీలాల్, వీరయ్య, కృష్ణ పాల్గొన్నారు.

శిక్షణ నైపుణ్యాలతో విద్యార్థులకు గుర్తింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ప్రజాపక్షం/మణుగూరు : శిక్షణ నైపుణ్యాలతో విద్యార్ధులక గుర్తింపు లభిస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఐటిఐ విద్యార్థులు శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. సోమవారం మణుగూరు ప్రభుత్వ ఐటిఐని సందర్శించిన ఆయన ఐటిలో శిక్షణకు సంబంధించిన కోర్సుల వివరాలు, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన మెటీరియల్స్ గురించి తెలుసుకున్నారు. వివిధ ట్రేడ్లకు సంబంధించిన వివరాలను గురించి ఆయన ట్రేడ్ ఇన్స్ట్రక్టర్లతో మాట్లాడి తెలుసుకున్నారు. అన్ని ప్రాక్టికల్స్ ల్యాబ్‌లను పర్యవేక్షించారు. ల్యాబ్ లలో యంత్రాల పనితీరు గురించి, విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నా రు. ఇటీవల విద్యార్థులకు అందజేసిన బుక్స్ విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచిగా చదువుకొని ఒక మంచి టెక్నీషియన్‌గా ఎదగాలన్నారు. ఐటీఐల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామన్నారు. అనంతరం ఐటి ప్రాంగణంలో ఉన్న గ్రంథాలయాన్ని, ఎటిసి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పాటిల్ పరిశీలించారు. ఎటిసి భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఐటిఐ ప్రిన్సిపాల్ బదుగు ప్రభాకర్, ట్రైనింగ్ ఆఫీసర్ జి.రవి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపిఒ వెంకటేశ్వరరావు, ఎటిఒలు ఎం.శ్రీనివాసరావు, జివి కృష్ణారావు, ఎ.నరసయ్య, వేణుగోపాల్, సూపరెంట్ టిఎన్ జ్యోతిరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక సంక్షేమానికి సహకారం

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

ప్రజాపక్షం/పెనుబల్లి : మత్స్యకారుల ఆర్థిక సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లంకాసాగర్ గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో వందశాతం రాయితీపై ఆరు లక్షలు చేప పిల్లలను లంకాసాగర్ ప్రాజెక్ట్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, ఎంపిడిఒ అన్నపూర్ణ, కల్లూరు ఎఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు శివ ప్రసాద్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు, ఎఎంసి వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నీలాల గోపి, కాంగ్రెస్ నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయాలు

కల్లూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులోని పుల్లయ్య బంజర రహదారిలో కల శివాలయంలో సోమవారం ఎమ్మెల్యే రాగమయి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని అమ్మే మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఎంపిఒ సురేష్‌బాబు, ఎఒ రూప, ఎపిఎం వెంకట్రామారావు, సిసి వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

సత్తుపల్లి : పట్టణంలోని ఆయ్యగారిపేటలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. కార్యక్రమంలో డా.మట్టా దయానంద్ విజయ్‌కుమార్, సొసైటీ అధ్యక్షులు చల్లగుండ్ల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, కమల్ పాషా, రైతు సంఘం నాయకులు రాజబాబు, గాదె చెన్నారావు, ఇమ్మనేని ప్రసాద్, వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లాడ : తల్లాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శబరి వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే రాగయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించి ఆదరాభిమానాలు పొందాలని సూచించారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు రవిశంకర్, సరిత దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో దుండేటి వీరారెడ్డి, కటికి కిరణ్‌కుమార్, తాళ్ల జోసెఫ్, నర్సింహారావు పాల్గొన్నారు.

శాంతి నిలయంలో పొంగులేటి జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/బోనకల్ : మండల కేంద్రంలోని శాంతినిలయం మానసిక దివ్యాంగుల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం మానసిక దివ్యాంగులకు స్వీట్లు, పండ్లతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగం నాగేశ్వరరావు మాట్లాడుతూ జనహృదయ నేత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను మానసిక వికలాంగుల వద్ద నిర్వహించామని, నిండు నూరేళ్ల ఆయుఆరోగ్యాలతో పొంగులేటి జీవించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో పొంగులేటి పేరుతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉమ్మినేని కృష్ణ, బోయినపల్లి మురళి, భూక్యా సైదానాయక్, బండి వెంకటేశ్వర్లు, బిరెల్లి కృష్ణ, బిరెల్లి వాసు, గొడుగు కృష్ణ, తన్నీరు సురేష్, రాంబాబు, తిరుపతిరావు, తోటకూర వెంకటేశ్వరరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి : ఐటిడిఎ పిఒ

ప్రజాపక్షం/భద్రాచలం : రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతీ నర్సింగ్ కాలేజీ, లయన్స్ క్లబ్, ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ యూఎస్ఎ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 6న నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ బి.రాహుల్ అన్నారు. ఈ మేరకు సంబంధిత కరపత్రాన్ని ఆయన తన ఛాంబర్లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యశిబిరాన్ని మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా.ఎస్ఎల్ కాంతారావు, డా.సుబ్బరాజు, డా.చైతన్య, వై సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం చేసి బాధితులకు అండగా నిలబడదాం

కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్

ప్రజాపక్షం/భద్రాచలం : రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడదామని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని కొత్తగూడెం సబ్‌డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఐఎంఎ హాల్లో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సహాయసహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమర వీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలకు ప్రతీకగా రక్తదానం శిబిరం నిలుస్తుందన్నారు. పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలకు యువత, విద్యార్థులు, ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందన్నారు. గర్భిణులు, తలసేమియా వ్యాధిగ్రస్తులు, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి రక్తం ఎంతో ఆవసరమని, ఇలాంటి శిబిరాల ద్వారా రక్తం అందిస్తే వారికి ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్‌పి రెహమాన్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం 3టౌన్ సిఐ శివప్రసాద్, జూలురుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐలు సుధాకర్, నర్సింహారావు, కృష్ణారావు, ఎస్ఐలు, ఇదర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జెడ్పి సిఇఒ దీక్షారైనా, డిఆర్‌డిఒ సన్యాసయ్య, కలెక్టరేట్ ఎఒ అరుణ, జిల్లా స్థాయి అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందించాలి

అర్హత గల చిట్టచివరి లబ్ధిదారుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ 2024 అధికారులకు తెలంగాణ డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణా సంస్థ ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులో భాగంగా జిల్లాలో క్షేత్ర పరిశీలనకు వచ్చిన అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తన చాంబర్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో విద్య, వైద్య పరంగా తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ అధికారులకు వివరించారు. ప్రజలకు సేవలు అందించడానికి అధికారులకు అవకాశమున్నదన్నారు. సమాజం నా నుంచి ఏమి ఆశిస్తున్నది, నా పరిధిలో ఏమి చేయగలను అన్నది ఆలోచించాలన్నారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారని ప్రజలకు జవాబుదారిగా ఉన్నప్పుడే విధుల నిర్వహణ చేయగలమని, వృత్తికి న్యాయం చేయగలమని కలెక్టర్ తెలిపారు. ప్రజల్లో నమ్మకాన్ని ఎప్పుడు కోల్పోవద్దని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం ఈనెల 21 నుండి 28 వరకు ఎనిమిది రోజుల పాటు జిల్లాలో క్షేత్ర పరిశీలన చేసినట్లు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి తమ పరిశీలనలో ఎదురైనా అనుభవాలను కలెక్టర్‌తో పంచుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, జెడ్పిసిఈవో దీక్షారైనా, ఎంసిహెచ్ ఆర్ధి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ ఆనంద్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

జిల్లాలో పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 21వ అఖిల భారత పశుగణన 2024 పోస్టర్‌లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్‌శ్రీజతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశు సంపద అత్యంత కీలకమని పశుగణనను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పశువుల వివరాలను సేకరించి పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ దీక్షా రైనా, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.వేణుమనోహర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల సందీప్ కుమార్ ఝా

ప్రజాపక్షం / సిరిసిల్ల : సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులోని చంద్రంపేట జంక్షన్ వద్ద విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల నుండి కోనరావుపేట మార్గంలో చంద్రంపేట జంక్షన్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ రహదారి వెంబడి విద్యుత్ దీపాలకు వెంటనే విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సెస్ అధికారులకు సూచించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ డిఇ వాణి, ఎఇ స్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహం ధ్వంసం

ప్రజాపక్షం/బీర్‌పూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి స్వాగత తోరణంకు కుడివైపు ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం అయి పడి ఉండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఆలయ పూజారి వొద్దిపర్తి సంతోషాచార్య ఫిర్యాదు చేయగా కేసు నమోద చేశారు. ఈ సంఘటన 27వతేదీన సాయంత్రం 6 గంటలకు బీర్‌పూర్ గ్రామానికి చెందిన అల్లెపు సిద్దార్థ్ అనే వ్యక్తి ట్రాక్టర్ నడుపుతుండగా ట్రాక్టర్ ముందు టైర్ పంక్చర్ అయి ట్రాక్టర్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు హనుమాన్ విగ్రహాన్ని ఢీ కొట్టిన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం అయిన అల్లెపు సిద్దార్థ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. విగ్రహ పునః ప్రతిష్ఠకు ఆలయ ఇఒ అర్చకులు గ్రామపెద్దలు ఏర్పాట్లు చేపడుతున్నారు.

మదర్ థెరిసా కళాశాలకు
బిటెక్ ఈవినింగ్ కళాశాలకు అనుమతి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలకు బీటెక్ ఈవినింగ్ కళాశాలకు అనుమతి లభించిందని కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్ కుమార్ డైరెక్టర్ ఎడవల్లి నవత తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తోడుపునూరి శ్రీనివాస్ తమ కళాశాలకు 2024–25 సంవత్సరమునకు గాను బీటెక్ మెకానికల్ బ్రాంచ్‌లో ఈవినింగ్ కళాశాలకు అనుమతి లభించినట్లు తెలిపారు ఎఐసిటిఇ , జేఎన్టీయూ హైదరాబాద్ వారు: కళాశాలకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు డిప్లమా మెకానికల్ చదివి ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఉద్యోగం చేస్తున్న వారు నవంబర్ 7వ తారీఖున జైఎన్టీయూహెచ్ హైదరాబాద్లో పూర్తి సర్టిఫికెట్లు మరియు పనిచేస్తున్న కంపెనీ అనుమతి పత్రంతో కౌన్సిలింగ్ కి హాజరు కావాలని తెలిపారు ఈ అవకాశాన్ని ఈ ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న వారు ఉపయోగించుకొని తమ ఉద్యోగ పురోగతికి ప్రమోషన్ల కోసము ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవచ్చని తెలిపారు.

అప్పు తీసుకోవడం.. ఐపి పంపడం!

ప్రజా పక్షం /వేములవాడ టౌన్: అవసరాల కోసం అప్పులు తీసుకోవడం.. అవసరం తీరాక ఐపీ నోటీస్‌లు పంపించడం.. ఇలాంటి వ్యవహారాలు ఇటీవల జిల్లాలో పెరిగిపోయాయి. పరిచయస్తులు, బంధువుల వద్దే అందినకాడికి అప్పులు తీసుకొని ఆస్తులు కూడగట్టుకుంటున్నారు. తమ టార్గెట్ నిండిందని సంతృప్తి పడ్డ తర్వాత అప్పులు ఇచ్చిన వారందరికీ ఐపీ నోటీస్లు పంపించి.. ఇతర ప్రాంతాలకు పరారవు తున్నారు. ఐపీ నోటీస్లు అందుకున్నవారంతా లబోదిబోమంటూ రోడ్డున పడుతున్నారు. రాజన్న దర్శనం కోసం వేలాది మంది వచ్చే వేములవాడలో చిరువ్యాపారాలు జోరుగా నడుస్తాయి. ఇందుకు చిన్నపాటి మొత్తంలో అప్పులు తీసుకుని వడ్డీలు చెల్లిస్తూ తమ వ్యాపారాలు చేసుకుంటుంటారు. అయితే ఇటీవల వేములవాడతోపాటు జిల్లా లోని ఇతర ప్రాంతాల్లో అప్పులు తీసుకున్న వారంతా కోర్టు నుంచి ఐపీ నోటీస్లు పంపిస్తుండడంతో చిరువ్యాపారులకు అప్పులు దొరకడం లేదు. వేములవాడలో చిరువ్యాపారులకు, ఆపదలో ఉన్న జనాలకు అప్పులు పుట్టడం కష్టంగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇలా ఐపీలు పెట్టిన వారు దర్జాగా అప్పులు ఇచ్చిన వారి ముందే తిరుగుతూ ఉంటే ఏమి చేయలేని పరిస్థితుల్లో బాధితులు న్యాయం జరుగుతుందనే ఆశతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

రామగిరి ఖిల్లాకు నిధుల కేటాయింపు పట్ల మంత్రికి కృతజ్ఞతలు

ప్రజాపక్షం /రామగిరి : రామగిరి మండలంలోని బేగంపేట శివారులో గల రామగిరి ఖిల్లా కు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఐదు కోట్ల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు బేగంపేట వాసులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం రామగిరి మండల కేంద్రంలో నీ పన్నూర్ గ్రామంలో గల ఈకో పార్క్ శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్ బాబు రాగా ఆయనను మర్యాదపూర్వకంగా బేగంపేట కాంగ్రెస్ నాయకులు పన్నూరు చౌరస్తా వద్ద కలిసి రామగిరి ఖిల్లా సీతారామస్వామి చిత్రపటాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రా మగిరి ఖిల్లాను పూర్తి స్థాయిలో పర్యాటక కేంద్రంగా మార్చాలని మంత్రిని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సందెల కుమార్, శ్రీరాముల కుమార్, మాదాసి శ్రీనివాస్, కొత్తూరు మోహన్, నాంపల్లి కుమార్, మాదాసి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేములవాడ మైనార్టీ గురుకుల విద్యార్థి ఎంపిక

ప్రజా పక్షం /వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అక్టోబర్19,2024 అండర్ 17ఇయర్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ లోని కాలేజీ గ్రౌండ్లో జరిగిన టోర్నమెంట్ కం సెలక్షన్ లో అత్యంత ప్రతిభ కనపరిచి మొదటి స్థానం సాధించిన రోమాల శ్యాం కుమార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ, పిఇటి అక్కినపల్లి దేవయ్యలు తెలిపారు. వీరు అక్టోబర్ 28, 29, 30 తేదీలలో పెద్దపల్లి జిల్లాలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీయులు ఉపాధ్యాయయేతర బృందం విద్యార్థిని అభినందించారు.

బాలికలకు మెరుగైన వైద్యం

మంత్రి డి. శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి /రామగిరి: కెజిబివిలో అస్వస్థతకు గురైన బాలికలు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అస్వస్థతకుగురై చికిత్స పొందుతున్న ముత్తారం మండల కేంద్రంలోని కెజిబివి విద్యార్థినులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరామర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ముత్తారం మండలంలోని కెజిబివిలో బాలికలు అస్వస్థతకు గురైతే హాస్టల్ వార్డెన్ సమాచారం అందించడంతో వెంటనే జిల్లా ఆసుపత్రికి 53 మంది చిన్నారి బాలికలను తరలించి 10 మందివైద్యులు, 20మంది స్టాఫ్ నర్సులు ఆధ్వర్యంలో అత్యుత్తమ చికిత్స అందించామన్నారు. 53మంది బాలికలు క్షేమంగా ఉన్నారని ఎవరు ఎ టువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, విద్యార్థులు పూర్తిస్థాయిలో కోలుకునేవరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వైద్యులు, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. కెజిబివి పాఠశాలలో కూడా పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, భవిష్యత్తులోబాలికలకుఎటువంటిఇబ్బందులుఉండవని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సింగరేణి సంస్థ, రామగుండం3 ఏరియా ఆధ్వర్యంలో జీఎం. కార్యాలయ సమీపంలో 9 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు రూ.3 కోట్ల 56 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎకో పార్క్ శంకుస్థాపన కార్యక్రమానికి సోమవారం తెలంగాణ రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులుదుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా భాగస్వాములను చేశామని, గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో 7 శాతం సీట్లు ఉద్యోగుల పిల్లలకు వచ్చేవిధంగా ఏర్పాటు చేస్తామని, మున్ముందు సింగరేణిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఉద్యోగులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఎకో పార్కునందు సుందరీకరణ కోసం వివిధ రకాల మొక్కలు నాటడమే కాకుండా బట్టర్‌ఫ్లై గార్డెన్, లైటింగ్, వాటర్ ఫౌంటేన్లు, పక్షుల సందర్శన కేంద్రం మొదలగు వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ ఎకో పార్క్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఎకో పార్కు నిర్మాణ పనులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.అనంతరం జి.యం. కార్యాలయంనందు మహిళా ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రెచ్ (శిశు సంరక్షణ కేంద్రం) భవనాన్ని ప్రారంభించి, మహిళా ఉద్యోగులతో మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి.రావు, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. రెవిన్యూ 8 ఇతర సమస్యలపై 8 మొత్తం 16 దరఖాస్తు లు వచ్చాయని తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే మిన్న.. రక్తదానం

ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి:పోలీస్ అమరవీరుల వారోత్సవాల (ఫ్లాగ్ డే) సందర్భంగా పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్. ఐజి హాజరై పోలీస్ అధికారులతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అమరవీర జవానులను స్మరించుకుంటూ అక్టోబర్ 21నుండి అక్టోబర్ 31వరకు పోలీస్ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగింది అని తెలిపారు. రక్తదానం చేయడానికి అందరూ ముందుకు రావాలని ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే ప్రాణ దాతలుగా మారాలని అన్నారు. అన్నిటికంటే గొప్పదానమైన రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడాలని సూచించారు. సకాలంలో రక్తం అందించలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయ్యారని రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. రక్తదానం ఇవ్వడానికి వాలంటరీగా వచ్చిన వారి అందరిని సిపి అభినందనలు తెలిపారు. శిబిరంలో పోలీసులతో పాటు స్థానిక యువత 519 మంది పాల్గొని ఉత్సాహంగా రక్తదానం చేయడానికి రావడం ఎంతో అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. సిపి రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన ఐపిఎస్., పెద్దపల్లి ఎసిపి కృష్ణ, ట్రాఫిక్ ఎసిపి నరసింహులు, పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్ సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపెల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు సిబ్బంది, లయన్స్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి, కోమండ్లపల్లి, నీరుకుళ్ళ, గట్టేపల్లి, కదంబాపూర్ గామాల్లో పట్టణంలోని శాస్త్రినగర్, పూసాలలో శనివారం ఐకెపి, సింగిల్ విండో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో, వ్యవసాయ అధికారులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం సన్నవడ్లను పండించాలని చెప్పి రైతులకు బోనస్ ఇవ్వడం ఏమో గాని కనీసం వాటిని కొనుగోలు కూడా చేయలేదని అన్నారు. దీంతో అప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నారని చెప్పారు. రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనిని అన్నారు. రుణమాఫీ చేయడంతో పాటు రైతులకు పంటల పెట్టుబడి తిరిగి రుణాలు ఇస్తున్నట్టు వివరించారు. సాంకేతిక కారణాల వల్ల అక్కడక్కడ రుణమాఫీ కానీ రైతులకు త్వరలోనే మాఫీ చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రుణమాఫీ వడ్డీలకు సైతం సరిపోలేదని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు నిరందీగా ఉండొచ్చని విజయరమణ రావు అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యానికి రైతులు వెంటనే రసీదులు తీసుకుని ఇళ్ళకు వెళ్ళొచ్చని, వడ్ల కటింగ్, రైస్ మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కటింగ్ ల పేరిట గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు నిలువు దోపిడీ చేశారని, రైతులకు జరిగిన అన్యాయం తనను ఎంతగానో కలిసి వేసిందని , రైతులను ఆదుకోవడమే తన జీవిత లక్ష్యమని విజయరమణ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మినుపాల స్వరూప ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీష్, పట్టణ అధ్యక్షుడు ఏగోళం అబ్బయ్య గౌడ్,మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, కలేపల్లి జానీ, కల్వలా శ్రీనివాస్, ఉస్తేం గణేష్, సతీష్ రావు, ఆనంద్ రావు, సతీష్ , రమేష్, చంద్రయ్య, సతీష్, రవి, సిద్ధ తిరుపతి,అజయ్, కనకయ్య, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పశుగణన రూపకల్పనకు సహకరించాలి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : పశువుల సమగ్ర సమాచారం అందించి పశుగణన రంగ పథకాల రూపకల్పన సహకరించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో 21వ అఖిల భారత పశుగణన తెలంగాణ పోస్టర్‌ను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 25 అక్టోబర్ 2024 నుండి ఫిబ్రవరి 2025వరకు 4 నెలలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి పశువుల వివరాలను సేకరిస్తారని ఈ సేకరణలో పశువులతో పాటు గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్ల వివరాలను సేకరిస్తారన్నారు. పశుగణన పూర్తయిన వెంటనే వాటి సంఖ్య ఆధారంగా వ్యాక్సిన్లు, సబ్సిడీ, దాన, ఇతర పథకాల రూపకల్పన ప్రభుత్వానకి సులభమవుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు వారివద్దకు వచ్చే పశుగణన అధికారులు వారి వద్ద గల పశువుల వివరాలు సంపూర్ణంగా అందించి సహకరించాలని కలెక్టర్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగత్ కుమార్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గురువారెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: ఐఎంఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రముఖ డాక్టర్ గురువారెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్2 ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యాక్షుడిగా జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు డా.గురువారెడ్డి ఎన్నిక కాగా ఆయనను పలువురు అభినందించారు. డాక్టర్ గురువారెడ్డిని జగిత్యాల కు చెందిన ఐఎంఎ డాక్టర్లు ఆర్ఎంపి. పిఎంపి డాక్టర్లు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్‌రెడ్డి, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, జగిత్యాల క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్, కౌన్సిలర్ నక్క జీవన్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, అల్లాల సరితా, రమేష్‌రావు, బింగి రవి, రేపల్లె హరికృష్ణ, జగిత్యాల వర్తక సంఘం అధ్యక్షులు కమటాల శ్రీనివాస్, చిట్ల అంజన్న, చిట్ల లత, నాగిరెడ్డి రజిత, కూచన నాగజ్యోతి, ఎన్నం మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులు అదనపు కలెక్టర్ పి.రాంబాబు, గౌతమ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని అధికారులు వారి శాఖల వారికి స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు పి.రాంబాబు. గౌతమ్‌రెడ్డి, ఆర్‌డిఒలు మధు సుధన్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఎఒ హన్మంత రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు ఇసుక రీచ్‌ల నుంచి

రవాణాకు అనుమతులు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతి: వినియోగదారుల అవసరాల నిమిత్తం జిల్లాలోని మూడు ఇసుక రీచ్‌ల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాలప్రకారం ఇసుక రవాణాకు అనుమతులను మంజూరు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్టిక్ లెవెల్ సాండ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షత వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినియోదారుల అవసరాల నిమిత్తం కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి ఇసుక రీచ్ (25వేల క్యూబిక్ మీటర్లు), మానకొండూర్ మండలంలోని లింగాపూర్ (60 వేల క్యూబిక్ మీటర్లు), వెల్దిలోని ఇసుక రీచ్‌లో ఉన్న

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం గన్నేరువరం మండల కేంద్రంతో పాటు మాదాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంటను కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు తప్పు, తాలు లేకుండా చూసుకోవాలన్నారు. అధికారులు, నిర్వాహకులు సైతం రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. తూకంలో కోతలు లేకుండా పర్యవేక్షించాలని సూ చించారు. ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ నరేందర్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బెటాలియన్ కానిస్టేబుల్ డిమాండ్లను నెరవేర్చాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

ప్రజాపక్షం / సిరిసిల్ల : ఒకే పోలీసు విధానాన్ని అమలు చేసి బెటాలియన్ కానిస్టేబుల్ డిమాండ్లను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సోమవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బెటాలియన్ కానిస్టేబుల్ పని భారాన్ని పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్‌తో పాటు కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్న న్యాయమైన కోరికలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండు రోజులుగా బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారని జీవోను తక్షణమే ఉపసంహరించాలని అన్నారు. పక్క రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగానే ఒకే పోలీస్ విధానం ఉండాలని అన్నారు. ఈ జీవో వల్ల పనిభారం పెరిగి ఒత్తిడికి గురి అవుతున్నారని అన్నారు. నిరంతరాయంగా 26 రోజులు పని చేయాల్సి వస్తుందన్నారు. కుటుంబానికి దాదాపు నెల రోజులు దూరంగా ఉంటున్నారని, దీని ఫలితంగా ఇటీవల కాలంలో కొందరు కానిస్టేబుల్స్ ఆత్మహత్య చేసుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి, జిల్లా నాయకులు సోమ నాగరాజు, బాచుపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

ప్రజాపక్షం/సూర్యాపేట: యువత డ్రగ్స్‌తో తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ పార్కు నుండి మినీ ట్యాంక్ బండ్ వరకు పోలీస్ అమరవీరుల స్మరక 2కె రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. విద్యార్థులు, యువత, పౌరులు డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వీటిని నిరోధించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చదువులో వత్తిడికి గురైనవారు డ్రగ్స్ తీసుకుంటే ఉత్సాహం వస్తుందనేది అపోహ మాత్రమేనని, అలవాటుపడితే క్రమేణా యువత ఆరోగ్యం, భవిష్యత్తు అంధాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పి రవి, ఎఆర్ డిఎస్‌పి నరసింహ చారి, సిఐలు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, ఆర్ఐ నారాయణ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కెటిఆర్ బంధువుల టార్గెట్ సరైంది కాదు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: కెటిఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొలేక కాంగ్రెస్ పార్టీ బంధువులను టార్గెట్ చేయడం సరైంది కాదని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడురు. జన్వాడ ఫాంహౌజ్, కెటిఆర్ ఇంట్లో పోలీసులు సోదాలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గృహప్రవేశ వేడుకను రాద్ధాంతం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దాడులకు పాల్పడి అప్రతిష్టపాలు చేయాలని చూస్తుందన్నారు. హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన పాలకులు ఇలాంటి కార్యక్రమాలతో కాలం వెల్లదిస్తున్నారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టిన ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాడుతునే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బిఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జీడి భిక్షం, సవరాల సత్యానారాయణ, నర్సింహ్మారావు, రాజా, మద్దెల వీరస్వామి పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: ఎస్‌సి ఎబిసిడి వర్గీకరణను త్వరగా పూర్తి చేసి అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పడిదల రవికుమార్ మాదిగ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆదేశాలతో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో 2000 నుండి 2004 సంవత్సరం వరకు ఎస్‌సి వర్గీకరణ అమలు చేస్తూ అప్పటి ప్రభుత్వం ఎస్‌సి, ఉపకులాలకు రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు కల్పించడంతో మాదిగలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఎస్‌సి ఎబిసిడి వర్గీకరఅమను త్వరగా అమలు చేస్తే మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెల్లాల మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కనుకు జానయ్య మాదిగ, చింత సైదులు మాదిగ, గూడపురి ఉపేందర్ మాదిగ, చిన్నపంది నాగరాజు, సైదులు, వెంకట్, హన్మయ్య, చంటిబాబు, గురుమూర్తి, పవన్, రాజేష్, తరుణ్, నాని, అబ్బయ్య పాల్గొన్నారు.

బిసి సంక్షేమమే లక్ష్యం

ప్రజాపక్షం/దేవరకొండ : బిసి సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బిసి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య మరియు స్థానిక ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్‌లు మాట్లాడుతూ బిసి సంక్షేమమే మా లక్ష్యం అని బిసిలందరూ రాజకీయంగా సామాజికంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఈడబ్ల్యూఎస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 29ను విరమించుకోవాలని, బిసిలందరూ రాజ్యాధికారం వైపు ముందడుగు వేయాలని, స్థానికంగా బిసి సంక్షేమ భవనాలు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈసమావేశంలో ఎర్ర సత్యనారాయణ, నీలం వెంకటేష్, అంజి, నర్సింహా, సిరాజ్‌ఖాన్, జానీ, కృష్ణయ్య, భాస్కరాచారి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/సూర్యాపేట: చివ్వెంల మండలంలోని కుడకుడ గ్రామ శివారు సర్వే నెంబర్ 126లో గుడిసెలు వేసుకోని జీవనం కొనసాగిస్తున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కలిసి పట్టాలు ఇప్పించేలా ప్రభుత్వంతో సంప్రదింపులు చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా సిపిఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే గతంలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తన అనుచరుడు సత్యనారాయణరెడ్డితో కలిసి అనేక తప్పుడు కేసులు పెట్టించి గుండాలతో దాడులు చేయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోకినపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు సయ్యద్, లింగన్న, రేణుక, జయమ్మ, సంతోషి, బన్ని పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా!

ఎంఎల్‌ఏ కుందూరు జైవీర్ రెడ్డి

ప్రజాపక్షం/హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతానని ఎంఎల్‌ఏ కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. సోమవారం హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో ప్రతి తరగతి గదిని ప్రత్యేకంగా పరిశీలించి కళాశాలలో నెలకొన్న సమస్యలపై అధ్యాపకులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో ప్రధానంగా తాగునీటి సదుపాయం కోసం విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఆర్వో ప్లాంటు పనిచేయడం లేదని వారు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఎంఎల్‌ఏ ట్రాన్స్ కో అధికారులకు ఫోన్ చేసి వెంటనే సంబంధిత కనెక్షన్ కోసం ఆరు విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. దీంతోపాటు కళాశాలకు ప్రహరీ గోడ లేదని చెప్పడంతో వెంటనే జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి ఎంఎల్‌ఏ అభివృద్ధి నిధుల కింద రూ.4.50 లక్షలు నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం కళాశాలకు 150 డెస్క్ బెంచీలు కావాలని అధ్యాపకులు కోరిన వెంటనే రూ.7.50 లక్షల విలువ చేసే బెంచీలను తమ సొంత ఖర్చులతో కొనుగోలు చేసి ఇస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ఏజెన్సీతో మాట్లాడి ఆర్డర్ చేయడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సలహాదారు ఎడవల్లి నరేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ కాకునూరు నారాయణ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా బిసి కుల గణన : కలెక్టర్

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బిసి కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా కాంటాలు వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని సూచించారు. బిసి కుల గణనను పకడ్బంధీగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రానికి శిక్షణకు వెళ్లిన వారి శిక్షణ పూర్తి అయ్యే వరకు మండలాల నుండి కుల గణనకు అవసరమయ్యే ఎన్యూమరేటర్ల జాబితాను సిద్ధం చేసి జిల్లాలో శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఏ ఒక్క ఇంటిని వదలకుండా పూర్తి వివరాలు సేకరించాలని, 150 గృహాలకు ఒక బృందంను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ అప్పారావు, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు, సంక్షేమ శాఖల అధికారులు శంకర్, లత, అనసూర్య, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, డిసిఓ పద్మ, డిపిఓ నారాయణరెడ్డి, ఎఓ సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ పద్మరావు, శ్రీలత, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

కేంద్ర సర్వీస్ అధికారులకు గ్రామాల అధ్యయనం ముఖ్యం

జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ : భవిష్యత్తు పరిపాలనలో అఖిల భారత సర్వీసులు, కేంద్ర సర్వీసుల అధికారులకుగ్రామాల అధ్యయనం బాగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత సేవలు, కేంద్ర సర్వీస్‌లకు సంబంధించిన అధికారుల బృందం ఈనెల 21 నుండి 28 వరకు నల్లగొండ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై అధ్యయనానికి వచ్చిన విషయం తెలిసిందే.కాగా సోమవారంతో వీరి అధ్యయనం ముగియగా, జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వారి అధ్యయన అనుభవాలను కలెక్టర్ తో పంచుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎఎస్, ఐపిఎస్, ఇతర కేంద్ర సర్వీసుల ఉద్యోగాలలో శిక్షణ పొందే అధికారులకు గ్రామస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేయడం వారు సర్వీస్ లో ఉన్నంతకాలం మర్చిపోలేని అనుభూతిగా మిగులుతుందని తెలిపారు. వారి అధ్యయనంలో అనుభవాలను విన్న అనంతరం ఆయన ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు.ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమంలో భాగంగా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని వాటిలో రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వం తరపున ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా దారిద్రరేఖకు దిగనున్న వారికి బియ్యం పంపిణీ చేయడం జరుగుతున్నదని, రాష్ట్ర ప్రభుత్వం రూపాయికే కిలో బియ్యాన్ని ఇస్తున్నదని, జనవరి నుండి సన్నబియ్యాన్ని రేషన్ కార్డు దారులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అతను కలెక్టర్ టి. పూర్ణచంద్ర, జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, నల్గొండ ఇన్చార్జి ఆడియో శ్రీదేవి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రామాల అధ్యయనానికి వచ్చిన అధికారులను జిల్లా కలెక్టర్ శాలువా,జ్ఞాపికలతో సన్మానించారు.

పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు

నవచేతన మొబైల్ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలని, మనిషిని చైతన్యం దిశగా విజ్ఞానవంతులుగా పుస్తకాలు తీర్చిదిద్దుతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు లైబ్రరీ వద్ద నవచేతన బుక్ సమితి వారి మొబైల్ వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు రాజకీయ చైతన్యానిన తీసుకురావడంలో నవచేతన బుక్ సమితి చేస్తున్న కృషి భావితరాలకు చక్కటి మార్గదర్శకత్వమన్నారు. నవచేతన సమితి నేతృత్వంలో వచ్చినటువంటి వేల పుస్తకాలు సమాజ మార్పులో కీలకపాత్ర పోషించిందనడంలో అతిశయోక్తి లేదన్నారు. ప్రతి ఒక్కరు పుస్తకాలను పఠనం చేయాలని, ప్రస్తుత తరం యువత పుస్తకాల కంటే మొబైల్ ఫోన్లకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నారని, సెల్‌ఫోన్ కంటే పుస్తక పఠనం ఎక్కువగా ప్రభావితం చేస్తుందనే విషయాన్ని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, మాజీ సర్పంచ్ చల్లా అంజిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శులు మహ్మద్ సయిద్, ధీరావత్ లింగానాయక్, దళిత సంఘం నాయకులు వల్లంపట్ల వెంకన్న, సీపీఐ నాయకులు పోలెపల్లి ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అర్జీలు పెండింగ్ ఉండొద్దు : కలెక్టర్

ప్రజాపక్షం/యాదాద్రి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 35 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 26, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 3, జిల్లా సంక్షేమ శాఖ 3, విద్య శాఖ, జిల్లా పంచాయతీ, వైద్యశాఖకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శోభారాణి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు : తీర్వారి డిమాండ్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మునుగోడు మండల కేంద్రంలోని వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా స్థానిక తహశీల్దార్, ఎస్ఐ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆరోపించారు. అక్రమంగా ఇసుక తరలింపును ఆపాలని సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు ఫిర్యాదు చేశారు. అభివృద్ధి పనుల పేర్ల తోకాంట్రాక్టర్లతో కుమ్మక్కైన తహశీల్దార్, ఎస్ఐలు ఇసుక అక్రమంగా తరలిస్తున్నా తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.పేదలకు ఇంటి నిర్మాణం, మరుగుదొడ్ల అవసరాలకు కూడా అనుమతి ఇవ్వని అధికారులు కాంట్రాక్టర్లకు మాత్రం కాసులు పుచ్చుకొని వందల ట్రిప్పుల ఇసుకను ఎలా అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు అక్రమ ఇసుక రవాణా పై ఆరా తీసి చర్యలు చేపడతామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బండమీది యాదయ్య, తిరందాసు శ్రీనివాస్, శేఖర్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ పూర్తి చేస్తాం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోదాం ప్రారంభించిన ఎంఎల్‌ఏ బాలునాయక్

ప్రజాపక్షం/డిండి: నాణ్యత ప్రమాణాల పేరుతో రైతులను మోసం చేస్తే సహించేది లేదని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం డిండి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని, ప్రాథమిక సహకార పరపతి సంఘ గోదాం, చెరుకుపల్లిలో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని,మద్దతు ధర రూ. 2320తో పాటు బోనస్ ఇవ్వడం రైతును ఆదుకోవడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, పిఎసిఎస్ చైర్మన్లు శ్రీనివాస్‌రావు, నాగార్జున్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, సిపిఐ నాయకులు వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనోద్దీన్, కనకాచారి, విజేందర్‌రెడ్డి, శైలేష్, మార్కెట్ కమిటి డైరెక్టర్ గోవర్ధన్ పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ పేదలకు వరం : కళ్యాణ లక్ష్మి పథకం పేదలకు వరం అని కళ్యాణలక్ష్మీ పథకాన్ని అర్హులైన వారందరూ ఉపయోగించుకోవాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం డిండి మండలానికి చెందిన 30 మంది కళ్యాణ లక్ష్మీ లబ్దిదారులకు చెక్కులను ఎంఎల్‌ఏ చేతుల మీదుగా అందజేశారు.

పోలీసులు భరోసా ఇవ్వాలి : ఎస్‌పి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, పోలీసులంటే ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించేలా ఉండాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. అధికంగా భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యల పైన ఫిర్యాదులు రావడం జరిగిందని తెలిపారు.

నాణ్యత విషయంలో రాజీపడను

మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : పట్టణంలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం తోపాటు సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనులు మున్సిపల్ ఎన్నికలలోపు పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నల్లగొండ మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో తొందర పడితే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో 186 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, 164 కిలోమీటర్లు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ పనులన్నీ పూర్తి అయితే పట్టణంలో 90 శాతం మేర సీసీ రోడ్లే ఉంటాయని చెప్పారు. మిగిలిపోయిన కొన్ని కాలనీలలో కూడా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. పాలకవర్గ సభ్యులందరి సహకారంతో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అల్కాపురి కాలనీ వెనుక ఉన్న స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడాల్సి వస్తుందని, దీనికి నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు పున్న గణేష్, గోగుల శ్రీనివాస్ కోరారు. దీంతో చైర్మన్ స్పందిస్తూ స్మశాన వాటిక అభివృద్ధికి రెండున్నర కోట్లు కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రసాద్ మాట్లాడుతూ పలు కాలనీలలో యు జి డి మాన్ హోల్స్ పగిలిపోయాయని వాటి స్థానంలో కొత్తవి అమర్చాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ , మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, ఈ. ఈ.రాములు, టిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, వివిధ పార్టీల కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాండ్ ట్యాక్స్ ఉన్నా అక్రమ రవాణా?

అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండీ

స్థానిక అధికారుల కనుసైగల్లోనే గుత్తేదారు ఇష్టారాజ్యం

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : నిర్మాణాలకు ఇసుక అవసరం.. ఇసుక అక్రమంగా ఎవరికి వారు తోడుకపోవడాన్ని అరికట్టేందుకు ప్రభుత్వమే ఆ ప్రాంతంలో సాండ్ ట్యాక్స్ ఏర్పాటు చేసింది. అయినా వాటిని పట్టించుకోకుండా ఓ గుత్తేదారు ట్రాక్టర్లతో తాను పట్టిన పనికి ఇష్టారాజ్యంగ వందల ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తోడుకుపోతున్నారు. ఇదంతా ఓ మారుమూల ప్రాంతమో.. దూరపు గ్రామాలలో కాదు.. మునుగోడు మండల కేంద్రంలోనే గత 4, 5 రోజుల నుంచి ఏక కాలంలో పదుల సంఖ్యల ట్రాక్టర్లతో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న తతంగం. మునుగోడు మండలంలో 25 కోట్లతో సిసి రోడ్లు, ఫుట్‌పాత్, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు ఓ గుత్తేదారు దక్కించుకున్నారు. దానికి కావాల్సినటువంటి ఇసుక మాత్రం సాండ్ ట్యాక్స్ విధానాలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను సమకూర్చుకుంటున్నారు. మునుగోడు మండలంలో గత కొన్నేళ్ల నుంచి అక్రమ ఇసుక రవాణా వందలాది లారీలు, ట్రాక్టర్ల ద్వారా హైదరాబాద్, నల్లగొండ, దేవరకొండ తదితర ప్రాంతాలకు నిత్యం తరలించడంతో ఆ ప్రాంత ప్రజలు ఇసుక అక్రమ రవాణా ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఈ ప్రాంతం ఇప్పటికే ఫ్లోరైడ్ మహామ్మారితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అక్రమ ఇసుక రవాణా ఆపాలంటూ సిపిఐ నేతృత్వంలో అనేక మార్లు ఆందోళన చేశారు. దీనికి స్పందించిన ప్రభుత్వం మునుగోడు, కొరటికల్ ప్రాంతం నుంచే ఇసుకను పరిమితిగా తీసుకెళ్లేందుకు సాండ్‌ట్యాక్స్ విధానాన్ని అమలు చేశారు. అయితే సొంత భవన నిర్మాణాలు, ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకైనా సాండ్‌ట్యాక్స్ విధానం ద్వారానే ఇసుకను తీసుకెళ్లేందుకు నిబంధనలు పెట్టారు. కానీ ఆ గుత్తేదారు నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండీ పెట్టి అక్రమంగా ఇసుకను తీసుకుపోవడంపై ఆ ప్రాంత యువకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మండల కేంద్రంలోనే వందల ట్రాక్టర్ల ఇసుక డంపింగ్ చేస్తున్నా స్థానిక తహశీల్దార్, ఎస్ఐలు పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే ఆ గుత్తేదారు అధికారుల కనుసైగల్లోనే ఇదంతా చేస్తున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంతో పాటు ప్రభుత్వం విధించిన సాండ్‌ట్యాక్స్ విధానం సక్రమంగా అమలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వేగంగా ఫిర్యాదులు పరిష్కారం

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను యంత్రాంగం దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల తహసీల్దారు, ఎంపిడిఓలతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 40 దరఖాస్తులను అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులతో కలిసి స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎండార్స్‌మెంట్ చేసినట్లు తెలిపారు. నిర్ధిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆర్‌డిఓ కె సత్యపాల్‌రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకే ప్రాధాన్యత

జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులపై సత్వర పరిష్కారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి విజ్ఞప్తులు కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ మంగిలాల్,తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాదివస్'కు 23 అర్జీలు

జయశంకర్ ఎస్‌పి కిరణ్ ఖరే

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కారం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం ప్రజాదివాస్‌లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పి మాట్లాడుతూ ప్రజా దివాస్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 23 మంది బాధితుల నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. ప్రజలు నిర్భయంగా,మూడోవ్యక్తి ప్రమేయం లేకుండా, స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు.

నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు

ప్రజాపక్షం / నల్లబెల్లి : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భూములను రిజిస్ట్రేషన్లు చేస్తామని సరైన పత్రాలు లేకుంటే చేయమని వరంగల్ జిల్లా నల్లబెల్లి తహసిల్దార్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ రైతులకు సంబందించిన వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలు సరియైన పత్రాలు కలిగి ఉండి స్లాట్ బుక్ చేసుకున్న వారికే రిజిష్ట్రేషన్లు చేస్తామన్నారు. పైరవీలతో కార్యాలయానికి ప్రజలు రావద్దని సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

Mera Yuva Bharat Warangal (MY Bharat)
WITH THE SPIRIT OF SERVICE!
Traffic volunteering program
Market Cleaning Program
Hospital Volunteering Program
Nehru Yuva Kendra - Warangal
Yeh Diwali, Seva ke Saath!

ప్రజాపక్షం/ఖిలావరంగల్: మేరా యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఏవీవీ కాలేజీకి చెందిన 20 మంది యూత్ సభ్యులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సోమవారం ట్రాఫిక్ నియమాలు, సిబ్బంది విధుల గురించి అవగాహన కల్పించారు.మై భారత్ జిల్లా యూత్ ఆఫీసర్ చింతల అన్వేష్, ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ప్రజాపక్షం/ నర్సంపేట : రక్తదానం చేసి మరోకరి ప్రాణాలను కాపాడాలని వరంగల్ ఈస్ జోన్ డిసిపి రవీందర్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని సిటిజన్ క్లబ్‌లో సోమవారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసిపి ప్రసంగించారు. రక్తదానం మరొకరికి ప్రాణ దానమని అన్నారు. ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ 26 వ సారి రక్తదానం చేశారు. వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి రవీందర్, ఏసిపికిరణ్ కుమార్ అభినందించారు. ఏసిపి కిరణ్ కుమార్, టౌన్ సిఐలు రమణమూర్తి, చంద్రమోహన్, సాయిరాం, ఎస్ఐలు రవికుమార్, మహేందర్, రాజేష్, వెంకటేశ్వర్లు, రఘుపతి, డివిజన్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం ఇబ్బందులు

ప్రజాపక్షం/రాయపర్తి : మంచి నీళ్ళు రావడం లేదని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..గత వారం రోజులుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మంచి నీళ్ళు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీరు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పత్తి ధర ముంచేసింది

ఏనుమాములలో రూ.6,800 పత్తి ధర

ఆందోళన నిర్వహించిన రైతులు

కమిటి
ప్రభుత్వం ప్ర
పాటించవ

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి ధర రూ. 6800 పడిపోయింది. దీంతో రైతులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. పత్తి దిగుబడి మొదలైన ప్రతీసారి ఇదే తంతుఏనుమాములవ్యవసాయ మార్కెట్ జరుగుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి కారణంగా దళారులు, వ్యాపారులు, మార్కెట్ నిర్వాహకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి సిండికేట్‌గామారి పత్తి ధరను వారికి నచ్చినట్లు మార్చుతూ రైతుల పొట్ట కొడుతున్నారని ఆరోపణలు ఉన్నారు. దీంతో పత్తి పండించే రైతు అప్పుల పాలు అవుతున్నారని వాపోతున్నారు. పత్తి మీద వ్యాపారం చేసే వారు మాత్రం కోటేశ్వరులవుతున్నారంటున్నారు.రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోదు. ఎందుకంటే ఆ ప్రభుత్వాలు కూడా ఈ దోపిడీలో భాగస్వాములేనని రైతులు, రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. సోమవారం మార్కెట్‌కు వచ్చిన పత్తి తేమ అధికంగా ఉందని సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారస్థులు ధర ఒక్కసారిగా రూ. 6800 జెండా పాట నిర్ణయించారు. దీంతో రైతులు నిరసన వ్యక్తం చేయడంతో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, సిబ్బంది రైతులకు.. వ్యాపారులకు నచ్చచెప్పి తిరిగి విక్రయాలు సజావుగా జరిగేలా కృషి చేశారు. అనంతరం మార్కెట్‌లో క్రయ విక్రయాలు సవ్యంగా జరిగాయి.

అభివృద్ధి పనుల జాప్యంపై ఎమ్మెల్యే అసహనం

ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి : పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనుల జాప్యంపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం కుడా కార్యాలయం సమావేశ మందిరంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,మేయర్‌గుండుసుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య,జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తనాజీ వాకాడేతో కలిసి సమీక్ష నిర్వహించారు. అన్ని డివిజన్‌ల వారిగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. టెండర్లు వేసి ఇంకా పనులను ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు అందించి మళ్ళీ పనులు చేయకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. పనులపై జరుగుతున్న జాప్యం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భద్రకాళీ బండ్ పనులు దాదాపు పూర్తి కావచ్చునని తెలిపారు. బొంది వాగు పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. పబ్లిక్ గార్డెన్స్ ఆవరణలో నిర్మించిన శంకు చుట్టూ వాహనాలు నిలిపి ఉండటం వలన చూపరులకు ఇబ్బందిగా ఉందని తక్షణమే స్థానిక వాహనాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని లేనిపక్షంలో ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మహా నగరంలో ఉన్న మున్సిపల్ జవాన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని, పనిచేయని ఇన్‌స్పెక్టర్లను, జవాన్ లను తొలగించాలని ఆదేశించారు.కాజిపేట మార్కెట్, బాలసముద్రం ఎల్ఐసి పక్కన, పలు ప్రధాన కూడలిలా వద్ద చిరు వ్యాపారాలు కేటాయించిన స్థలాలలో కాకుండా రోడ్డు మీద వచ్చి వ్యాపారలు చేయడం పట్ల ట్రాఫిక్ కీ, ప్రజా రవాణాకు చాలా ఇబ్బందులు వస్తున్నాయని, కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పోలీస్, ట్రాఫిక్, ఇరిగేషన్, రోడ్లు భవనలు, విద్యుత్తు శాఖ, స్మార్ట్ సిటీ, మున్సిపల్ శాఖ, కుడాఅధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ర్యాలీ, విద్యార్థి నాయకులు అరెస్టు

హనుమకొండ బాలసముద్రంలో ఉద్రిక్తత

ప్రజాపక్షం/హనుమకొండ:హనుమకొండ జిల్లా బాలసముద్రంలోసుమారురూ.100కోట్లతో నిర్మించిన కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక సాధనలో పాలుపంచుకున్నటువంటి కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు సోమవారం తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునిల్, ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు దూడపాక నరేష్ మాట్లాడుతూ తెలంగాణ కళా రూపాలను జానపదాలు, ఒగ్గు కథ, బుర్రకథ లాంటి కళారూపాలతో మన తెలంగాణ గొప్పతనాన్ని భారతదేశ వ్యాప్తంగా చాటిచెప్పి, పద్మశ్రీ అవార్డు సాధించినటువంటి కళాకారుల విగ్రహాలను కళాక్షేత్రం లోపల ఏర్పాటు చేయాలని, గత మూడు నెలలుగా ఉద్యమిస్తున్న ప్రభుత్వంపట్టించుకోవడంలేని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కళలకు సంబంధంలేని, కళాకారులతో సంబంధం లేనటువంటి వ్యక్తుల పేర్లు, అదేవిధంగా వారి విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయడం అనేది తెలంగాణ కళలను, కళాకారులను అవమానించడమేనని విద్యార్థులు ఆరోపించారు. వెంటనే కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేసి కళాకారుల గొప్పతనాన్ని, వాళ్ళ ప్రతిభను భవిష్యత్ తరాలకు తెలియపరిచే విధంగా, కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హన్మకొండలోని చౌరస్తా నుండి బాలసముద్రం కళాక్షేత్రం వరకు జరిగిన భారీ ర్యాలీలో విద్యార్థులు వందలాదిగా పాల్గొని విజయవంతం చేశారు. కళాక్షేత్రం వద్ద పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్ తరలించారు. తెలంగాణకు సంబంధించినటువంటి గద్దర్, చుక్క సత్తయ్య, మిద్దె రాములు, చిందు ఎల్లమ్మ, సాయి చందు, బెల్లి లలిత, నేరెళ్ళ వేణుమాధవ్, వరంగల్ శం కరన్న, సారంగపాణి, గుస్సాడీ నృ త్యంలో ప్రతిభను కనబరిచి పద్మశ్రీ అ వార్డు సాధించినటువంటి కనకరాజు వంటి వారి విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. ప్రభుత్వం కళాకారులను,కళాకారుల యొక్క గొప్పతనాన్ని అవమానించే విధం గా, చిన్న చూపు ఇదే చూసే విధంగా ప్రవర్తిస్తే మాత్రంభవిష్యత్తులోపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులను, కవులను, మేధావులను విద్యార్థులందరినీ ఏకం చేసి కళాకారుల విగ్రహాలు పెట్టేంతవరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.సౌత్ ఇం డియా స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు దూడపాక నరేష్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ఠాగూర్,మణితేజ, కుమార్, కలాం, నదీంపాషా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో వసతులకు ప్రాధాన్యత

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి:ఆరోగ్య కేంద్రాలలో కనీస ప్రమాణాలను పాటించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జాతీయ నాణ్యత ప్రమాణాల కల్పన పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షా, శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికే జిల్లాలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జాతీయ నాణ్యత ప్రమాణాలు గుర్తింపు లభించాయి. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో ఇలాంటి ఇబ్బందులు లేకుండా వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ప్రాథమికఆరోగ్య కేంద్రాలలోతాగునీటిసౌకర్యంతోపాటు విద్యుత్, భవనాల మరమ్మతు పనులు, టాయిలెట్స్, తదితర వసతుల కల్పనకు ఈ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3 బస్తీ దవాఖానాలలో, 10 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లు, సిహెచ్‌సి కమలాపూర్ లను ఈ సర్టిఫికేషన్ కోసం అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విజయ్‌కుమార్, టీఎస్ ఎంఐడీసి అధికారులు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు, ఇళ్లు ఇవ్వండి

ప్రజాపక్షం/ఏటూరునాగారం: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనిప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎండి అఫ్జల్ ప్రభుత్వాన్ని కోరారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రెస్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. జర్నలిస్టు యూనియన్ నాయకులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ మధ్యకాలంలో కొంత మంది వ్యక్తులు జర్నలిస్టుల అవతారం ఎత్తి జర్నలిస్టుల యొక్క ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా అక్రమ దందాలకు పాల్పడుతున్న విషయం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఎవరైనా జర్నలిజం అడ్డుపెట్టుకొని అక్రమ చీకటి దందాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అక్రెడేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులు బాధ్యత వహించి జర్నలిస్టుల విలువలను కాపాడే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులందరూబాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కొంత మంది వ్యక్తులు జర్నలిస్టుల ముసుగుధరించిఇసుకమాఫియా, మూగ జీవాల అక్రమరవాణాకుపాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉందని, అధికార యంత్రాంగం చర్య లు తీసుకోవాలని కోరారు.ఉద్దేశ్యపూర్వకంగా వర్కింగ్ జర్నలిస్టులపై బురద చల్లాలని చూస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనికోరారు. జర్నలిస్టు యూనియన్ టిడబ్ల్యూజెఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిదురాల వాసు, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గంపల శివ కుమార్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి అల్వాల శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు నూక ప్రభాకర్, చింతల పల్లి వెంకటేశ్వర్లు, వసంత రమేష్, లకుమయ్య, ముతేష్, పర్వతాల లాలయ్య, బట్టు గోపి, బోడ సత్యం,జూపాక కృష్ణ,అత్తర్‌పాషా,ప్రవీణ్, వసంత రమేష్, ఎగడ్డి వెంకటేశ్వర్లు, యనమల్ల రాకేష్, సామర్తపు కిరణ్ కుమార్, రాజేష్, శ్రీను, తిరుమల్, గౌరీ శంకర్, శేఖర్, శ్రీను, పిట్టల శివుడు, ప్రతాప్,రాజ్‌కుమార్,గోవర్ధన్ పాల్గొన్నారు.

30న వర్ధన్నపేట ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభం

ప్రజాపక్షం/వర్ధన్నపేట: మండల కేంద్రంలో వర్ధన్నపేట ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) కార్యాలయం ఈ నెల 30న ప్రారంభించనున్నట్లు ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు ఐత ప్రవీణ్‌కుమార్,అధ్యక్షులు మల్లెపాక కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా హన్మకొండలోని స్థానిక శాసన సభ్యులు కే.ఆర్.నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు కొండేటీ శ్రీధర్, వన్నాల శ్రీరాములు, ఈగ మల్లేషం, భాజాపా వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర వెంకటరమణ,నాంపెల్లి మల్లేషం,బండారి విక్రమ్ గౌడ్, పిట్టల భాస్కర్, బిర్రు కరుణాకర్, పసునూరి మురళి, గడ్డం నాగరాజు, గడ్డం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యత

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్‌లో 16, హెల్త్, సానిటేషన్‌లో 10, ప్రాపర్టీ టాక్స్ రెవెన్యూలో 7, టౌన్ ప్లానింగ్‌లో 42, మంచినీటి సరఫరాలో 2 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, హెచ్ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌ఛార్జి సీపీ రవీంద్ర, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పాటిద్దాం..గమ్యానికి చేరుదాం

NORMAL SPEED MEETS EVERY NEED
DRIVE SLOW, GO BACK HOME
Mera Yuva Bharat Warangal (MY Bharat)
CELEBRATE A JOYOUS DIWALI
WITH THE SPIRIT OF SERVICE!

ప్రజాపక్షం/వరంగల్‌టౌన్: ట్రాఫిక్ రూల్స్ పాటించి క్షేమంగా గమ్యానికి చేరుదామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. భారత ప్రభుత్వ యువజనుల, క్రీడా శాఖ ఆదేశానుసారం వరంగల్ ఏవీవీ జూనియర్ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు, సిబ్బంది విధుల గురించి అవగాహన కల్పించారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జంక్షన్లలో ఇద్దరు చొప్పున ట్రాఫిక్ సిబ్బందితో కలిపి జంక్షన్ల వద్ద ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు ట్రాఫిక్ నియమాల మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకె వరంగల్ కోఆర్డినేటర్ అన్వేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు, ఏఎన్‌వైకె సిబ్బంది దేవిలాల్, సురేష్, సీనియర్ వాలంటీర్లు ఫయాజ్, శివరాజ్, దేవిశ్రీ ప్రసాద్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

మంగళపల్లి జనార్ధన్ మృతి సిపిఐకి తీరనిలోటు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/జనగామప్రతినిధి: సిపిఐ సీనియర్ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు, ఎర్రజెండా ముద్దుబిడ్డ మంగళపల్లి జనార్ధన్ అకాల మృతి సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లా, ప్రధానంగా జనగామ జిల్లా ఉద్యమానికి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారంమంగళపల్లి జనార్ధన్ మృతదేహంపై శ్రద్దాంజలి ఘటించారు.అనంతరం పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన సంతాప సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. కమ్యూనిస్టుపార్టీల అనుకూల వాతావరణం ఏర్పడిన రాజకీయ పరిస్థితులలో జనార్ధన్ లేకపోవడం పార్టీ ఉద్యమానికి తీరనిలోటన్నారు. కార్మిక సమస్యలు, అనేక భూ పోరాటాలు, ఇళ్ల స్థలాల వంటి పోరాటాల్లో ఎన్నో పోరాటాలు చేసిన జనార్ధన్ సేవలు కమ్యూనిస్టు పార్టీ ఏనాటికి మరువదని, ఒక ఎర్రజెండా ముద్దుబిడ్డగా, జనగామ జిల్లా సిపిఐ ఉద్యమ నిర్మాణంలో దీర్ఘకాలంగాపనిచేయడమే గాకుండా కుటుంబంలో ఎన్నో కష్టాలు వచ్చిన, చివరి శ్వాస వరకు ఒక కమ్యూనిస్టుగా నిలబడడం మరువలేనివన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే, సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లాపార్టీఉద్యమంలో మంగళపల్లి జనార్ధన్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని, పార్టీ అప్పగించిన పనిని అమలు చేసిన ఏకైక నాయకుడని రాజారెడ్డి అన్నారు. రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు, బీకేఎంయూ జాతీయ కమిషన్ సభ్యులు మోతె లింగారెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి నర్సయ్య, గోప జనగామ జిల్లా గౌరవ అధ్యక్షులు రామ్‌దయాకర్, పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, జిల్లా నాయకులు సొప్పరి సోమయ్య, మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, చింతకింది అరుణ, రావుల సదానందం, యాదగిరి,జువారి రమేష్, చల్లూజి మల్లేశం, పాతూరి ప్రశాంత్, జీడి ఎల్లయ్య, నీల కనకయ్య, ఎండీ యూనస్, సముద్రాల రాజు, బంటు పాండు, సఖి, గోల్కొండ నాగరాజుపాల్గొన్నారు. జనార్ధన్ మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, బూడిద గోపి, రాపర్తి రాజు, చందు నాయక్, సాంబరాజు యాదగిరి, తదితరులుశ్రద్ధాంజలి ఘటించారు. డాక్టర్ రాజమౌళి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్‌తోపాటు బీజేపి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రైతుల రుణమాఫీ పూర్తి చేయాలి

ప్రజాపక్షం/హనుమకొండ : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లాఉపాధ్యక్షుడుకె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి రాజారాం, కొండారెడ్డి, వజ్రాల అరుణ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రంఅందించారు.రుణమాఫీ మొత్తంగా ఒకేసారి చేయాలని, రెండు లక్షలకు పైగా ఉన్న రుణమాఫీ ఎప్పుడు చేస్తారో ప్రకటించాలని, దొడ్డు రకం వడ్లకు కూడా క్యింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు.

చేప పిల్లలను విడుదల చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : దిలవార్ పూర్ మండలంలోని సాంగ్వి గ్రామం వద్ద ఎస్ఆర్ఎస్‌పి జలాశయంలోకి చేప పిల్లలను విడుదల చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మొదట గంగమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ సంవత్సరానికి గాను సుమారు 32 లక్షల చేప పిల్లలను జలాశయంలోకి వదిలారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల బిజెపి ముత్యం రెడ్డి, రమణరెడ్డి, సత్యం చంద్రకాంత్, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

దిలవార్‌పూర్ మండలంలోని బన్సపల్లి గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడి. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్, యండిఓ, ఎంపీ ఓ గోవర్ధన్, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణ, ముత్యం రెడ్డి, విరేష్, ఉదయ్ గౌడ్, మండల బిజెపి నాయకులు కార్యకర్తలు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 65 ఫిర్యాదులు

ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఇన్‌చార్జి డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాదాన్యతనిస్తూ పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంత వల్లూరు అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 66 పిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్ ,మాధురి, డిఆర్ఓ పద్మజ రాణి లకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టేషన్ తనిఖీ… రికార్డులు పరిశీలన

ప్రజాపక్షం/పాపన్నపేట: మండల పరిధిలో నెలకు 5 చొప్పున రోడ్డు ప్రమాదాలు ఆత్మహత్యలు జరుగుతున్నాయని, వీటి నివారణ కు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. పోలీస్ స్టేషన్ పర్యవేక్షణలో భాగంగా సోమవారం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022లో 60, 2023లో 54, 2024 అక్టోబర్ వరకు 47 రోడ్డు ప్రమాదాలు ఆత్మహత్యలకు సంబంధించిన కేసులు నమోదు అయ్యాయన్నారు. ఆత్మహత్యలు, నీటి ప్రమాదాలు తగ్గించడానికి ఏడుపాయల ప్రాంతంలో ప్రత్యేక పోలీసులను రద్దీగా ఉన్న రోజులలో కేటాయిస్తామన్నారు. ముఖ్యంగా నది పరివాహక క్షేత్రంలో నీటి ప్రమాదాలు వివరించడానికి, పోలీస్ శాఖ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖతో సమన్వయం చేసి ప్రత్యేక గజఈ తగాలతో పాటు అందుబాటులో బోట్ ఉండే విధంగా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ప్రతి ఏటా తనిఖీలో భాగంగానే తానాలు తనిఖీ చేసి గత మూడు సంవత్సరాల క్రైమ్ రేటు పరిశీలించి క్రైమ్ తగ్గే విధంగా సిబ్బందికి తగు సూచనలు చేస్తామన్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సిఐ, రాజశేఖర్ రెడ్డి, ఎస్సై సార శ్రీనివాస్, ఏఎస్ఐ సంగయ్య, రైటర్ నర్సింలు, రిసెప్షన్ చింటూ భాయ్, భాగ్యలక్ష్మి నాగలక్ష్మి, హాఫీజ్, నర్సింలు, కృష్ణ, మధు, ప్రవీణ్, శివ తదితరులు ఉన్నారు.

హోమ్ డెలివరీ సర్వీసును ప్రారంభించిన ఆర్‌టిసి కార్గో



HOME DELIVERY TARIFF	
0 TO 1 KG	: Rs.50/-
1 TO 5 KG	: Rs.60/-
5 TO 10 KG	: Rs.65/-
10 TO 20 KG	: Rs.70/-
20 TO 30 KG	: Rs.75/-
ABOVE 30 KG	: Rs.75+ COMBINATION OF SLABS

ప్రజాపక్షం /ఆసిఫాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి కార్గో ద్వారా హోమ్ డెలివరీ సర్వీసును ప్రారంభించినట్లు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ తో పాటు సికింద్రాబాద్ జంట నగరాలలో కార్గో హోమ్ డెలివరీ సర్వీసును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు కార్గో సర్వీస్ ను ప్రారంభించనునట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత వివరాల కోసం 9154298534 సంప్రదించాలని సూచించారు.

బోరంచ ఎత్తి పోతలతో మనూరు, రేగోడ్ మండలాలు సస్యశ్యామలం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా

ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: బొరంచ ఎత్తి పోతలతో మనూరు, రేగోడు మండలాలు సస్యశ్యామలం కానున్నట్లు రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా తెలిపారు. రూ. 430.50లక్షలతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం రెండు ఫీల్డ్ గ్రావిటీ మెయిన్స్‌కి శంకుస్థాపన చేసారు. గ్రావిటీ మెయిల్ ద్వారా మనూరు, మండలంలో 2500 ఎకరాలకు సాగునీరు రూ. 259 లక్షలతో నిర్మించనున్న గ్రావిటీ మెయిన్ ద్వారా రేగోడు మండలంలో 500 ఎకరాలకు సాగునీరు ఆరు మాసల్లో పనులు పూర్తి చేసి చెరువులను నింపాలని ఆదేశించారు. బొరంచ నల్ల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి ఎంపి ఎమ్మెల్యే మారు మూల నారాయణ ఖేడ్ నియోజకవర్గం బొరంచలో నిర్మించనున్న ఎత్తి పోతల పథకం ద్వారా రేగోడు మండలాలు సస్యశ్యామలం అవుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా అన్నారు. సోమవారం బోరంచలో నిర్మించనున్న ఎత్తి పోతల పథకం ఫీల్డ్ గ్రావిట్ మెయిన్స్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్ నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలతో కలిసి శంకుస్థాపను చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోరంచలో మొదటగా మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా, ఎంపి సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలు జిల్లాలోని ప్రధాన దేవాయలమైన బొరంచ నల్ల పోచమ్మ, దేవాలయం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆలయ పూజారులు మంత్రి, ఎమ్మెల్యే, ఎంపిలకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంజీరా నదిపై ఆలయ సమీపంలో నిర్మించనున్న బోరంచ ఎత్తి పోతల పథకం ఫీల్డ్ గ్రావిటీ మెన్స్ కు మంత్రి శంకుస్థాపన చేసారు. రూ430.50 లక్షలతో నిర్మించనున్న ఫీల్డ్ మొయిన్ గ్రావిటీ ద్వారా మనూరు. మండలంలో బొరంచ టీ. లింగంపల్లి, తాటిపల్లి సిందు గ్రామాలలో చెరువులు నింపడం ద్వారా 2900 ఎకరాలకు సాగు నీరు అందుతుందని మంత్రి తెలిపారు. రూ. 259 లక్షలతో నిరిమచంనున్న పీల్డ్ మెయిన్ గ్రావిటీ ద్వారా రేగోడు మండలంలోని రేగోడు చౌటుపల్లి, మరుపల్లి కొత్వాలపల్లి, గ్రామాలలలో చెరువులు నింపడం ద్వారా సుమారు 500 ఎకరాలకు సాగునీరందున్నట్లు తెలిపారు. అనంతరం పంపుహౌస్‌ను పరిశీలించి మోటర్ స్వీచ్ ఆన్ చేసారు. ఈ రెండు ఫీల్డ్ మెయిన్ గ్రావిటీల ద్వారా 3400 ఎకరాలకు సాగునీరు అంది ఈ ప్రాంతం మొత్తం సస్యశ్యామల అవుతుందన్నారు. ఇక్కడి పోలాలకు తగినంత నీరు అందడంతో స్థానిక రైతులకు బంగారు పంటలు పండే అవకాశం కలుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పరిధి గ్రామాల ప్రజల రైతుల ఆర్థిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తియితే ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని మంత్రి తెలిపారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం ద్వారా ఈ ప్రాంత వ్యవసాయ పద్ధతులు మెరుగుపడతాయన్నారు. దీంతో రైతుల ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. తద్వారా రైతుల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఈ పథకం ద్వారా పంటలకు నీటి లభ్యత పెరగడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అశోకచక్రవర్తి , డిఎస్‌పి వెంకట్ రెడ్డి, డీఈ జలేందర్ ఏఈ విద్యావతి తహసీల్దార్ వెంకట స్వామి ఈఈ విజయకుమార్, నారాయణ ఖేడ్ ,అందోల్ నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన గడుపులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజల మళ్లీమళ్లీ దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. దరఖాస్తుదారులను పరిష్కారానికి సంబంధించిన వివరాలు అందజేయాలన్నారు. ఈ ప్రజవాణి లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను కొన్నింటిని పరిశీలిస్తే.. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన గోలెం గంగ చీపూరు దుబ్బా గ్రామ శివారులో గల పట్టా భూమిలో వంశపారంపర్యంగా తనకు రావాల్సిన వాటా భూమిని ఇప్పించాలని, పెంచికల్ పేట మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన అల్లూరి అజయ్ కుమార్ తనకు కంటిచూపు లేనందున సదరం శిబిరంలో పరీక్ష నిర్వహించి ధృవపత్రం మంజూరు చేయాలని. కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన రైతులు తమ భూములకు సాగునీరు అందించాలని, వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన కోరిడా ఓదెలు తన భార్య, కుమారుడు దివ్యాంగులు అయినందున పోషణకు ఇబ్బందిగా ఉందని తనకు ఉపాధి కల్పించాలని, కోరుతూ పలువురు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఒత్తిడివల్ల ఫాంహౌస్ రైడింగ్

ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/నర్సాపూర్: ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజా క్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న టిఆర్ఎస్ వర్కింక్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను అస్తిత్వాన్ని దెబ్బ తీయడం కోసం ఫాంహౌస్ రైడింగ్ చేయించారని ఆమె అన్నారు. కెటిఆర్ బావమరిది గృహ ప్రవేశానికి సంబంధించి ఫాంహౌస్ లో ఏర్పాటు చేసిన విందులో భాగంగా కెటిఆర్‌ను వల్ల కుటుంబ సభ్యులను ఆహ్వానించడం జరిగింది. ఈ ఆహ్వానంలో భాగంగానే కుటుంబసభ్యులు విందుకు హాజరుకావడం జరిగింది. ప్రభుత్వం నుండి పెద్దల వొత్తిడి వల్లే. రైడింగ్ జరిగిందన్నారు. రైడ్ సమయంలో ఎక్సైజ్ అధికారులు బయటకి వచ్చి మీడియా సమావేశంలో ఎటువంటి మాదకద్రవ్యాలు లేవని చెప్పడం జరిగిందన్నారు. ప్రతిపక్షాల నోరు నొక్కడమే ఈ ప్రభుత్వానికి అలవాటైందని దీనిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రం గౌడ్, మాజీ జడ్పిటిసి బభ్య నాయక్, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మండల వైస్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, శివకుమార్, సత్యం గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, హాజీ, సర్పంచ్‌లు జితేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ ఉమ్లు నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రజా ప్రభుత్వం… రైతులు ధైర్యంగా ఉండాలి

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

ప్రజాపక్షం/పాపన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ఈ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ప్రతి ఒక్కరు దైర్యంగా ఉండాలని, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లాపూర్, పొడ్చన్ పల్లి తండా, గాంధారిపల్లి, కొడుపాక, శేరిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాల్లో ఇప్పటివరకు 473 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. కేంద్రాలలోరైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రతి రైతు ధైర్యంగా ఉండాలన్నారు.గత ప్రభుత్వ పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ఇది ప్రజల ప్రభుత్వమని పేర్కొన్నారు. దళారులనునమ్మి మోసపోవద్దన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మండల నాయకులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితంలో రాణించాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: ఆలిండియా సర్వీసెస్ అధికారులు ఉద్యోగ జీవితంలో మంచిగా రాణించి, సమాజ సేవ చెయ్యాలని, ప్రజల మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో 26 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందంతో 08 రోజుల పర్యటన ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలిండియా సర్వీసెస్ అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తగు సూచనలు చేస్తూ ఉద్యోగి జీవితంలో చదువు ఒక భాగం, క్షేత్రస్థాయి అనుభవాలు ఉత్తమ పాలనను అందిస్తాయని, క్షేత్రస్థాయిలో మీరు నేర్చుకున్న ప్రతి అంశాన్ని సరికొత్త అనుభూతినిస్తాయని చెప్పారు. మెదక్ జిల్లాలోని మెదక్ మున్సిపాలిటీ, మనోరాబాద్ మండలంలో కుచారం, తూప్రాన్ మండలంలో మల్కాపూర్ గ్రామం, నర్సాపూర్ పరిధిలో అవెంచ గ్రామం, రామాయంపేట పరిధిలో డి ధర్మారం గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అవగాహన పెంపొందించుకోవడం గురించి జిల్లాకు రావడం జరిగిందని చెప్పారు. జిల్లా పర్యటన ముగిసిందని తెలిపారు. విద్యా, వైద్యం, తాగునీరు, సాగునీరు వ్యవసాయం, ఉద్యానవనం, పథకాల తీరు, ప్రజల జీవన స్థితిగతులు, ఆర్థిక అంశాలు, అవగాహన పెంపొందించుకోవడం చాలా సంతోషమని అన్నారు. మెదక్ జిల్లా క్షేత్రస్థాయి పర్యటన ఎంతో సంతృప్తిని సంతృప్తినిచ్చిందని ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు తెలిపారు.అనంతరం ఆలిండియా సర్వీసెస్ అధికారులను మెమొంటోలు శాలువాలతో జిల్లా కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిసిఈఓ ఎల్లయ్య, శ్రీనివాసరావు, యాదయ్య, శంకర్ ఎంపీడీవోలు అధికారులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. సారంగాపూర్‌కు చెందిన శివాణికి పురిటి నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లటం కోసం హుటాహుటిన 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావటంతో శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి బిడ్డను నగరంలోని జీజీహెచ్‌కు తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండటంతో ఈ సందర్భంగా గర్భిణీ కుటుంబీకులు సహకరించిన 108 సిబ్బంది శివదినేష్, రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పారదర్శకంగా చేపపిల్లల పంపిణీ

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ చేస్తుందని గత ప్రభుత్వం లక్షల్లో చేప పిల్లలు పంపిణీ చేసి కోట్లలో చేశామని గొప్పలు చెప్పుకున్నారని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ భవన్‌లో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 8న చేపల పిల్లల పంపిణీ కార్యక్రమం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. తర్వాత రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేప పిల్లల పంపిణీ చేసిన తర్వాత 15 రోజులుగా పారదర్శకంగా గంగపుత్రులకు నాణ్యతతో కూడిన కౌంటింగ్ పద్ధతి ద్వారా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరుగకుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జిల్లా గంగపుత్రలకు నాణ్యమైన సీడ్ లేదని సగమే ఇస్తున్నారనడం సరికాదన్నారు. గంగపుత్రుల మనోభావాలను కాంగ్రెస్ పార్టీ దెబ్బ తీస్తుందని అబద్ధపు ఆరోపణలు చేస్తూ మాట్లాడటం రిగిందని గతంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన చేప పిల్లల పంపిణీలో గంగపుత్రులు ఆర్థికంగా ఎదగలేదని, కోట్లల్లో చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామని, లక్షల్లో కూడా పంపిణీ చేయలేదని గుర్తు చేశారు. అదేవిధంగా జిల్లాలో ఆర్సపల్లిలోని గంగపుత్రుల భూమి అన్యక్రాంతానికి గురికావటానికి కారణం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అని, దానిని జిల్లా గంగపుత్రులు గ్రహించి హైకోర్టు నుండి స్టే తీసుకరావటం రజిగిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్‌ను కలిస్తే వారు రస్వే చేయించటంతో 4 ఎకరాల 24 గుంటల భూమి మత్స్యకారులకు చెందుతుందని హామీనిచ్చారని అధికారం లేకపోవటంతో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని నిన్న ఆయన చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని లేకుంటే దిష్టిబొమ్మ దహనం చేస్తామని హెచ్చరించారు. గంగాపుత్రులకు ఇతర కులస్తులకు చిచ్చు పెట్టింది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రమోటర్ శ్రీనివాస్, శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవద్దు

పండించిన పంటలను ఐకెపి, ప్యాక్స్, మార్క్ ఫెడ్, సిసిఐ ద్వారా కొనుగోలు

ప్రజాపక్షం/గజ్వేల్: రైతులకు మెరుగైన సేవలు అందించడమే గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి లక్ష్యమని చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఏఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశం గౌడ్, ఎడిఏ బాబు నాయక్, ఏఓ నాగరాజు, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు, వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చిత్తశుద్ధితో వర్తింపజేయనున్నట్లు తెలిపారు. అయితే రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని కోరారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న, వేరు శనగ తదితర పంటలు ఐకెపి, ప్యాక్స్, మార్క్ ఫెడ్, సిసిఐ తదితర సంస్థల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, త్వరలోనే పత్తి కొనుగోళ్లకు సిసిఐ అనుమతి లభించినట్లు పేర్కొన్నారు. కాగా కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం విక్రయించిన రైతులకు రూ.500 బోనస్ ప్రభుత్వం ఇవ్వనుండగా, అవసరమైన ప్రతి చోట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని సమీకృత వెజ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్ సముదాయంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పాలకవర్గం తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కరుణాకర్ రెడ్డి, ఆత్మల్ల శ్రీనివాస్ గుప్త, మహంకాళి శ్రీనివాస్ గుప్త, హరినాథ్ గుప్త, నర్సింలు గౌడ్, డాక్టర్ మహేష్, బుచ్చిరెడ్డి, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, భానుప్రియ, వెంకటస్వామి, రామా గౌడ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి

ప్రజాపక్షం / కాసిపేట: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని బెల్లంపల్లి అటవీ క్షేత్రాధికారి పూర్ణ చందర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి అటవీశాఖ ఆధ్వర్యంలో బుగ్గ ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆలయ సిబ్బంది, భక్తులు, కమిటీ సభ్యులతో కలిసి సేకరించారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్రాధికారి మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్లాస్టిక్ భాగస్వామ్యం అయ్యిందని, దాని వలన మనిషికి, పర్యావరణానికి చాలా ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించినట్లయితే పర్యావరణానికి మేలు చేసిన వారవుతామని తెలిపారు. ఆలయ పరిసరాలలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు అటవీ జంతువులు, గ్రామ పశువులు తిని చాలా తీవ్రమైన జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు లోనై చనిపోయిన సంఘటనలు చూస్తున్నామని అన్నారు. అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ పడేయరాదని, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రానున్న రోజుల్లో పర్యాటక కేంద్రంగా బుగ్గ ఆలయం అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భక్తులు ఆలయ పరిసరాల్లో కోతులకు ఎలాంటి ఆహారం అందజేయరాదని, కోతులకు ఆహారం అందించినట్లయితే నేరమని తెలిపారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని ఆలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, తిరుపతి, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు యుగంధర్, రాజు, శంకర్, శ్రీధర్, గోపి, వెంకటేష్, భాస్కర్, ఆలయ ఈవో బాపురెడ్డి, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

క్రీడ

టీమ్‌ఇండియా కొత్త కోచ్‌గా వివిఎస్ లక్ష్మణ్!

బిసిసిఐ కీలక నిర్ణయం

మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు కోచింగ్ బాధ్యతలను వీవీఎస్ లక్ష్మణ్ అందుకోనున్నాడని తెలుస్తోంది. ఎన్సీఏ డైరెక్టర్‌గా ఉన్న లక్ష్మణ్ గతంలో కూడా టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. జింబాబ్వే పర్యటనలో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టును కోచ్‌గా నడిపించాడు. ఆస్ట్రేలియా పర్యటనతో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బిజీగా ఉండనున్న నేపథ్యంలో బిసిసిఐ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న అయిదు టెస్టుల సిరీస్ కోసం రోహిత్ సేన నవంబర్ 10న బయలుదేరే అవకాశం ఉంది. మరోవైపు దక్షిణాఫ్రికాలో నవంబర్ 8 నుంచి 13వ తేదీ వరకు సౌతాఫ్రికాతో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని జట్టు నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ క్రమంలో సౌతాఫ్రికా సిరీస్‌కు కోచ్‌గా వ్యవహరించడానికి గంభీర్‌కు సాధ్యపడదు. ఈ నేపథ్యంలో లక్ష్మణ్‌కు తాత్కాలిక కోచ్‌గా బిసిసిఐ బాధ్యతలు అప్పగించనుంది. లక్ష్మణ్‌కు సహాయక కోచింగ్ సిబ్బందిగా ఎన్సీఏలో ఇతర కోచ్‌లు, స్టాఫ్ అయిన సాయిరాజ్ బహుతులే, హృషికేష్ కంటికర్, శుభదీప్ ఘోష్ పనిచేయనున్నారు. ఎ మర్జింగ్ ఆసియా టీ20 కప్‌కు భారతప జట్టుకు సాయిరాజ్ బహుతులే ప్రధాన కోచ్‌గా పనిచేశారు.

దక్షిణాఫ్రికాతో నాలుగు టీ20ల షెడ్యూల్

నవంబర్ 08: తొలి టీ20 డర్బన్
నవంబర్ 10: రెండో టీ20 సెయింట్ జార్జ్ పార్క్
నవంబర్ 13: మూడో టీ20 సెంచూరియన్
నవంబర్ 15: నాలుగో టీ20 జొహెన్నెస్‌బర్గ్

ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ షెడ్యూల్

నవంబర్ 22–26: తొలి టెస్టు పెర్త్
డిసెంబర్ 06–10: రెండో టెస్టు అడిలైడ్
డిసెంబర్ 14–18: మూడో టెస్టు బ్రిస్బేన్
డిసెంబర్ 26–31: నాలుగో టెస్టు మెల్‌బోర్న్
జనవరి 03–08: అయిదో టెస్టు సిడ్నీ

సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్ కుమార్ వైశాఖ్, ఆవేశ్ ఖాన్, యశ్ దయాల్.

కెఎల్ రాహుల్‌పై వేటు..

లక్నోకు కొత్త కెప్టెన్ ఖరారు!

ఊహించినట్లుగానే తమ కెప్టెన్ కెఎల్ రాహుల్‌ను లక్నో సూపర్ జెయింట్స్ వదులుకోవడానికి సిద్ధమైంది. కొత్త కెప్టెన్‌ను కూడా ఖరారు చేసిందని తెలుస్తోంది. రిటైన్ లిస్ట్‌ను సమర్పించడానికి మరో మూడు రోజుల మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో లక్నో ఫ్రాంచైజీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లతో పాటు ముగ్గురు స్టార్ ప్లేయర్లను రిటైన్ చేసుకోనుంది. అక్టోబర్ 31వ తేదీలోపు ఫ్రాంచైజీలు తమ రిటైన్ లిస్ట్‌ను సమర్పించాల్సి ఉంది. ఓ ఫ్రాంచైజీ ఆరుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకునే వెసులుబాటును బిసిసిఐ కల్పించింది. అందులో గరిష్టంగా అయిదుగురు క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు ఛాన్స్ ఇచ్చింది.నిబంధనలకు అనుగుణంగా నేరుగా నిర్ణయించిన ధరతో రిటైన్ చేసుకోవచ్చు లేదా ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా ఫ్రాంచైజీ దక్కించుకోవచ్చు. రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు, రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు, అయిదో ఆటగాడిని తీసుకోవాలనుకుంటే తిరిగి రూ.18 కోట్లు, రూ.14 కోట్లు చెల్లించాలి. అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను రిటైన్ చేసుకుంటే మాత్రం రూ.4 కోట్లుగా నిర్ణయించింది. కాగా, లక్నో ఫ్రాంచైజీ ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు మోహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోని రిటైన్ చేసుకోవడానికి నిర్ణయించుకుంది. ఇక నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్‌లను వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు, రూ.11 కోట్లు వెచ్చించి తీసుకోనుంది. అంతేగాక నికోలస్ పూరన్ సారథి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించుకుంది. మార్కస్ స్టొయినిస్‌ను రైట్ టూ మ్యాచ్ కార్డ్ ద్వారా దక్కించుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గత కొంతకాలంలో టీ20ల్లో పూరన్ నిలకడగా పరుగులు సాధిస్తున్నాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డులు కూడా బద్దలుకొడుతున్నాడు. ఈ క్రమంలో వికెట్ కీపర్‌గానూ సత్తాచాటే పూరన్ రిటైన్ లిస్ట్‌లో తమ ప్రథమ ఎంపికగా ఖరారు చేసిందని సమాచారం. కాగా, రాహుల్ వేలంలోకి రానుండటంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ వ్యూహాలు మొదలుపెట్టింది. కర్ణాటకకు చెందిన రాహుల్‌ను దక్కించుకుని కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వాలని ఆర్సీబీ భావిస్తోంది.

పాకిస్థాన్‌కో దండం...

కోచ్ పదవికి గ్యారీ కిర్‌స్టన్ రాజీనామా

పాకిస్థాన్ వైట్ బాల్ జట్లకు కోచ్ పదవి నుంచి గ్యారీ కిర్‌స్టన్ వైదొలిగాడు. కోచ్‌గా బాధ్యతలు అందుకున్న ఆరు నెలలకే తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) వైఖరి, ఆటగాళ్లతో గొడవలు భిన్నాభిప్రాయాల మధ్య కొనసాగలేక కిర్‌స్టన్ పాక్ కోచ్ పదవికి గుడ్ బై చెప్పాడని తెలుస్తోంది. కిర్‌స్టన్ వైదొలగడంతో టెస్టు జట్టు కోచ్ జేసన్ గిలెస్పీని వైట్ బాల్ ఫార్మాట్ బాధ్యతలు కూడా అందుకోవాలని పిసిబి కోరింది. దక్షిణాఫ్రికాకు చెందిన గ్యారీ కిర్‌స్టన్ సక్సెస్‌ఫుల్ కోచ్‌గా పేరు పొందాడు. 2011 వన్డే ప్రపంచకప్ భారత్ విజయం సాధించడంలో కిర్‌స్టన్ పాత్ర కీలకం. అయితే మే నెల మధ్యలో పాకిస్థాన్ వైట్ బాల్ టీమ్ కోచ్‌గా కిర్‌స్టన్ బాధ్యతలు అందుకున్నాడు. ఇంగ్లండ పర్యటనలో పాక్ జట్టుతో కోచ్‌గా తన యాక్షన్ మొదలుపెట్టాడు. అయితే ఆ తర్వాత నెలలోనే జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్ ఘోర పరాజయాలన్ని చవిచూసింది. యూఎస్‌ఏ చేతిలోనూ ఓటమిపాలై టీ20 వరల్డ్ కప్‌లో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. అయితే తన రిక్వెస్ట్‌లను పాక్ బోర్డు పట్టించుకోకపోవడం, ఆటగాళ్లతో భిన్నాభిప్రాయాలతో కిర్‌స్టన్ కోచ్ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడని సమాచారం. అయితే మరో నాలుగు నెలల్లో సొంతగడ్డపై ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న వేళ కోచ్ రాజీనామా చేయడం పాకిస్థాన్‌కు ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, జింబాబ్వే పర్యటనలకు తాత్కాలికంగా బాధ్యతలు అందుకోనున్న గిలెస్పీ ఛాంపియన్స్ ట్రోఫీ వరకు వైట్ బాల్ కోచ్‌గా కొనసాగడంపై స్పష్టత లేదు. ఇటీవల గిలెస్పీ కూడా పాక్ బోర్డుపై బహిరంగంగానే విమర్శలు చేసిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ జట్టు ఎంపికలో తనకు ఎలాంటి అధికారం లేదని, టెస్టు మ్యాచ్‌లో తన వ్యూహాలు పంచుకోవడమే కేవలం తన పని అని తెలిపాడు. కాగా, బాబర్ అజామ్ స్థానంలో మహ్మద్ రిజ్వాన్‌ను వన్డే, టీ20 జట్లకు కెప్టెన్‌గా నియమించిన 24 గంటల్లోనే కోచ్ పదవి నుంచి గ్యారీ కిర్‌స్టన్ తప్పుకోవడం గమనార్హం.

రీల్

" క " సినిమాను జిల్లా ప్రజలు ఆదరించాలి

కరీంనగర్‌లో చిత్ర యూనిట్ సందడి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: విభిన్న కథాంశంతో తెరకెక్కబోతున్న ' క ' సినిమాను కరీంనగర్ జిల్లా ప్రజలు ప్రేక్షకులుగా ఆదరించాలని చిత్ర యూనిట్ సిబ్బంది, నటీనటులు కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లో చిత్ర యూనిట్‌కు సంబంధించిన డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ (డివోపి) సతీష్ రెడ్డి మాసం, క్యారెక్టర్ ఆర్టిస్ట్ శరణ్యా తేజు, కో డైరెక్టర్ శ్రీకాంత్ ఆళ్ల ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను వెల్లడించారు. సస్పెన్స్, థ్రిల్లర్, ఎమోషన్స్ కలయికతో విభిన్నంగా చిత్రీకరించిన 'క' సినిమా ఈ నెల 31న విడుదల కాబోతుందని పేర్కొన్నారు. 1970 కాలంలో ఓ గ్రామంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమా రూపొందించబడిందని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సుల్తానాబాద్‌లోని ఓ గ్రామంలో సాయంత్రం 4 గంటలకే చీకటి అయ్యే పరిస్థితులు ఉన్నట్లే కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం తీర్థహళ్లి ఉందని, అదే గ్రామంలో సినిమా షూటింగ్ జరిగిందన్నారు. ఈ సినిమా క్లైమాక్స్ లోనే 'క ' టైటిల్‌కు గల అర్థం సినిమా చూసిన ప్రేక్షకులకు అర్థమవుతుందన్నారు. హీరో కిరణ్ అబ్బవరం అద్భుత నటనతో ఈ చిత్ర సన్నవేశాలుంటాయన్నారు. హీరో కిరణ్ అబ్బవరంకు కరీంనగర్‌కు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆ దిశలోనే కరీంనగర్ ప్రజలు ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. చింతగోపాలకృష్ణ సమర్పణలో సుజిత్, సందీప్ అన్నదమ్ముల దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కిందని, ప్రముఖ తారాగణం అద్భుతమైన పాత్రలు పోషించారని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పిఆర్‌వో టీం పులి రాకేష్ గౌడ్, మడికంటి రాజమనోహర్, రాజశేఖర్‌రెడ్డి, హీరో కిరణ్ అబ్బవరం అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ సురంగి తదితరులు పాల్గొన్నారు.



చిరు మరో ఠాగూర్

మన మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఇప్పుడు నటిస్తున్న భారీ విజువల్ ట్రీట్ చిత్రం విశ్వంభర కోసం అందరికీ తెలిసిందే. ఈ సినిమా తర్వాత చిరు తన కెరీర్ 157వ సినిమా చేయనున్నారు. అయితే నిజానికి విశ్వంభర ఆ సినిమాగా రావాల్సింది ముందుకు వచ్చింది. ఇక తన నెక్స్ట్ సినిమాగా అయితే చిరు ఓ సబ్జెక్టుని చాలా కాలం తర్వాత టచ్ చేయనున్నట్టుగా కన్ఫర్మ్ అయ్యింది. ప్రముఖ నటుడు అలాగే రచయిత బివిఎస్ రవి రీసెంట్ గా చిరు కోసం తాము ఒక సోషల్ సబ్జెక్టుని రెడీ చేస్తున్నట్టుగా వెల్లడించారు. దీనితో మళ్ళీ ఒక ఠాగూర్, ఒక శంకర్ దాదా ఎంబీబీఎస్ లాంటి ట్రీట్ ని మళ్ళీ చిరు నుంచి ఆశించవచ్చు అని చెప్పాలి. మరి ఈ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ పై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.

శ్రీకృష్ణుడిగా మహేశ్ బాబు..?

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రస్తుతం స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఎస్ఎస్ఎమ్‌బి29 మూవీ కోసం రెడీ అవుతున్నాడు. ఈ సినిమాను అడ్వెంచరస్ చిత్రంగా రాజమౌళి తెరకెక్కించనున్నాడు. దీంతో ఈ సినిమా కోసం మహేశ్ ప్రస్తుతం కొత్త లుక్‌కోసం మేకోవర్ చేస్తున్నాడు. అయితే, ఇప్పుడు మహేశ్, రాజమౌళి సినిమా కంటే ముందే, బిగ్ స్క్రీన్‌పై కనిపించబోతున్నాడని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అశోక్ గల్లా హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ' చిత్రం ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాకు దర్శకుడు ప్రశాంత్ వర్మ కథను అందించగా, అర్జున్ జంధ్యాల డైరెక్ట్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమాను నవంబర్ 14న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. అయితే, ఈ సినిమాలో శ్రీకృష్ణుడి పాత్రలో సూపర్ స్టార్ మహేశ్ బాబు కనిపించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇది కేమియో పాత్ర అని.. అందుకే మహేశ్ బాబు ఈ పాత్రలో కనిపించబోతున్నాడని తెలుస్తోంది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తమ అభిమాన హీరోను మరో 3 ఏళ్ల వరకు వెండితెరపై చూడలేమా అని అనుకుంటున్న అభిమానులకు ఇదొక సర్‌ప్రైజ్ న్యూస్ అని చెప్పాలి. మరి ఈ సినిమాలో నిజంగానే మహేశ్ బాబు శ్రీకృష్ణుడిగా కనిపిస్తాడా లేదా అనేది వేచి చూడాలి.

ఎఎన్నార్ జాతీయ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

నాకు ఎంతో విలువైనవి'' అని చెప్పారు.

అక్కినేని వీరాభిమాని మా అమ్మ : 'ఎఎన్నార్ అభిమానుల్లో సీనియర్ మోస్ట్ ఫ్యాన్ ఎవరన్నా ఉన్నారు అంటే అది అమ్మే. ఎలాంటి ఫ్యాన్ అనేది తెలియాలంటే.. కొన్నేళ్ల క్రితం జరిగిన సంఘటన గురించి చెప్పాలి. అమ్మ మొగల్తూరులో గర్భిణిగా ఉంది. నెలలు నిండి ప్రసవానికి సిద్ధమవుతోంది. ఆమె కడుపులో ఉన్న జీవి.. ఈ చిరంజీవి. ఆ సమయంలో నాన్నను అమ్మ ఓ కోరిక కోరింది. 'నాగేశ్వరరావు సినిమా 'రోజులు మారాయి' రిలీజైంది. నేను వెళ్లి చూడాలి. మళ్లీ తర్వాత అంటే కుదరదు. ప్రసవం అయితే బయటకు పంపరు' అని అంది. బస్సు వసతులు సరిగ్గా లేకపోవడంతో జట్కా బండి ఏర్పాటు చేశారు నాన్న. బండిలో వెళ్తుండగా.. బస్సుకు దారిచ్చే క్రమంలో తిరగబడింది. మొత్తంగా పొలంలో బండి సహా అమ్మ, నాన్న తిరగబడ్డారు. దీంతో తిరిగి ఇంటికి వెళ్లిపోదాం' అని నాన్న అంటే.. 'లేదు లేదు నేను సినిమాకు వెళ్లాల్సిందే' అని పంతం పట్టి సినిమా చూసింది. అంత పిచ్చి అమ్మకు సినిమాలంటే.. అందులోనూ నాగేశ్వరరావు సినిమాలు అంటే మరీ అభిమానం'' అని చిరు చెప్పారు. 'అక్కినేని పురస్కారం నాకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, హేమ మాలిని, కె.బాలచందర్ తదితర సినీ ప్రముఖులకు ఇచ్చిన పురస్కారం నాకు దక్కడం నా పూర్వ జన్మ సుకృతం. ఈ అవార్డు నా సినీ జీవితానికి పరిపూర్ణత ఇచ్చింది. నా జీవితాంతం ఈ అనుభూతిని మనసులో పెట్టుకుంటాను'' అని చిరంజీవి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని నాకు ఇవ్వడం సముచితం అని భావించి నాకు ఇచ్చిన ఏఎన్నార్ అవార్డు కమిటీకి, ఛైర్మన్ సుబ్బరామిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను'' అని చిరంజీవి ప్రసంగం ముగించారు.

కొత్తగా 'పట్టణాభివృద్ధి సంస్థ'ల ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా 20 'పట్టణాభివృద్ధి సంస్థ'లను కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న మరో ఆరు పట్టణాభివృద్ధి సంస్థలను విస్తరించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ) తరహాలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఉన్న ముఖ్యమైన పట్టణాలను వాటి పరిసర ప్రాంతాలతో కలిపి ఈ 'పట్టణాభివృద్ధి సంస్థ'లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆరు పట్టాభివృద్ధి సంస్థలను వాటి పరిసర ప్రాంతాలను కలుపుతూ మరింత విస్తరించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ నీలగిరి, ఆదిలాబాద్, జోగులాంబ గద్వాల, కాగజ్‌నగర్, కామారెడ్డి, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల్, నాగర్‌కర్నూల్ నిర్మల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, జనగామ, నారాయణపేట్, జగిత్యాల్, మెదక్, యాదాద్రి భువనగిరి, జకశంకర్ భూపాల్‌పల్లి పట్టణాభివృద్ధి సంస్థలను కొత్తగా ఏర్పాటు చేసింది. అదే విధంగా ఇప్పటివరకు ఉన్న నిజామాబాద్, శాతవాహన, సిద్దిపేట, స్థంభాద్రి, వేములవాడ టెంపుల్, మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిని మరింత విస్తరించింది. ప్రధాన నగరాలు, పట్టణాల చుట్టూ ప్రణాళికాబద్ధమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు వీటి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు, పరిసర గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సంస్థల ఏర్పాటు ద్వారా అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరుగుతుందని, పట్టణ విస్తరణలో అసమానతలు చోటుచేసుకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. హైదరాబాద్ చుట్టూ పట్టణీకరణను రూపొందించడంలో అథారిటీ హెచ్ఎండిఎ ఒక ఉదాహరణ అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

టిజిసిఎస్‌బి పనితీరును సమీక్షించిన డిజిపి జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) కార్యాలయాన్ని డిజిపి డాక్టర్ జితేందర్ సోమవారం సందర్శించారు. టిజిసిఎస్‌బి డిజి శిఖాగోయేల్, ఇతర అధికారులతో టిజిసిఎస్‌బి పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబర్ బ్యూరో చేధించిన కేసుల వివరాలను ఈ సందర్భంగా తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో తిష్ట వేసిన సైబర్ నేరగాళ్లను ఎలా అరెస్టు చేశామనే విషయంపై ఆరా తీశారు. బ్యూరో కార్యక్రమాల గురించి డైరెక్టర్ శిఖా గోయేల్ చర్చలు జరిపారు. పిటి వారెంట్ ఎగ్జిక్యూషన్స్ కోసం ఆపరేషన్స్ యూనిట్, అలవాటుపై సస్పెక్ట్ షీట్లను తెరవడం, సైబర్ నేరస్తులు నేరాలకు సంబంధించిన వారి కార్యకలాపాలను ట్రాక్ చేయడం, సమస్యలను పరిష్కరించడం, అరెస్టు కోసం ఇతర రాష్ట్రాలకు బృందాలను పంపడంపై అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు. చర్చలో కీలకమైన హైలైట్ రాబోయే సైబర్ జాగ్రత్తలపై తెలుసుకున్నారు. నవంబర్‌లో సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎస్‌పి దేవేందర్‌సింగ్ సైబర్ క్రైమ్స్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు.ఈ చర్చలతో పాటు, సైబర్ సెక్యూరిటీ మరియు అడ్మిన్ ఎస్‌పి హర్షవర్ధన్, కొత్తగా ఏర్పడిన చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ గురించిన డిజిపికి వివరించారు.

తక్షణమే రుణమాఫీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ జిల్లా సంఘం అధ్యక్షులు సాయిలు,వర్కింగ్ ప్రెసిడెంట్ పాష తదితరులు పాల్గొన్నారు.

రీ షెడ్యూల్ కాని రుణాలకు మాఫీ వర్తింపజేయాలి

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బాగం హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల లోపు రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని కానీ, ఆ హామీని అమలు చేయడంలో విఫలం చెందుతుందన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందని, రేషన్ కార్డు లేని వారికి కుటుంబ సభ్యుల గుర్తింపు ప్రక్రియ పూర్తయి నెలలు గడిచినా రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ కాలేదన్నారు. 2018కు ముందు రుణం తీసుకుని రీ షెడ్యూల్ కాని రుణాలకు కూడా మాఫీ వర్తింపజేయాలని ప్రకృతి వైపరీత్యాలు, వ్యవసాయంలో నష్టాల కారణంగా వ్యవసాయ రుణాలను చెల్లించలేకపోయారని వీటిని కూడా పరిగణలోకి తీసుకోవాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. పంటల బీమా, రైతు బీమాను పకడ్బందీగా అమలు చేయాలని పంటల బీమా లేని కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు అపార నష్టం వాటిల్లిందని రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని అదే బీమా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విమానాలు : మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టు కేవలం ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా, 'మేకిన్ ఇం డియా, మేకిన్ వరల్డ్' మిషన్‌కు ఊతమిస్తుందని అన్నారు. ఎయిర్‌బస్, టాటా బృందాలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు రతన్ టాటాకు నివాళి అర్పించారు. సి295 ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీ నవ భారత నూతన పని సంస్కృతికి ప్రతిబింబమని మోదీ అన్నారు. 2022 అక్టోబర్‌లో ఈ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగిందని, ఇప్పు డు అందుబాటులోకి వచ్చిందని, ఇది ఏ ప్రాజెక్టు అయినా ఆలోచన నుంచి అమలులోకి తీసుకురావడంతో భారతదేశ వేగాన్ని సూచిస్తుందన్నారు.వడోదరలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభమైన బంబార్డియర్ ట్రెయిన్ కోచ్ ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి అయిన మెట్రో కోచ్‌లు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, ఇక్కడ ఉత్పత్తి అయ్యే సి295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా అలాగే విదేశాలకు ఎగుమతి కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశా రు. ఈ ఫ్యాక్టరీలో వేలాది ఉద్యోగాలు వస్తాయని, 18 వేల ఎయిర్‌క్రాఫ్ట్ భాగాలు దేశీయంగానే ఉత్ప త్తి అవుతాయని, తద్వా రా దేశవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఇలకు భారీగా అవకాశాలు లభిస్తాయని వివరించారు. భవిష్యత్తులో మేడిన్ ఇండియా పౌర వి మానాల ఉత్పత్తి జరుగుతుందని, ఇప్పటికే 1200 కొత్త విమానాలను వివి ధ భారతీయ ఎయిర్‌లైన్స్ ఆర్డర్ చేశాయన్నారు. కొత్త ఫ్యాక్టరీలో భారత పౌర విమానాల అవసరాలను తీర్చే విధంగా డిజైనింగ్ నుంచి ఉత్పత్తి వర కు జరగడంతో కొత్త ఫ్యాక్టరీ కీలక పాత్ర పోషించబోతుందని అన్నారు.

రెండు రోజుల్లో హాజరవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిందని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, నిబంధనల ప్రకారమే రాజ్ పాకాలకు 41 ఎ నోటీసులు ఇచ్చామని ఏజి వివరించారు. ఈ మేరకు దర్యాప్తులో తీవ్ర నిర్ణయాలేమీ తీసుకోబోమని కోర్టుకు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు పిటిషనర్‌కు రెండు రోజుల గడువు ఇచ్చింది. చట్టప్రకారం ముందుకెళ్లాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. మరో వైపు జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. పార్టీలో పాల్గొన్న రాజ్ పాకాల స్నేహితుడు, కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిన విజయ్ మద్దూరి సోమవారం పోలీసుల ఎదుట విచారణకు హాజరు కాలేదు. ఇప్పటికే వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, ఫామ్‌హౌస్‌లో గేమ్ ఆడినట్లు దర్యాప్తులో తేలితే మరో కేసు నమోదు చేసే ఛాన్స్ ఉంది. ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతోందని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అర్ధరాత్రి అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించిన సమయంలో అక్కడున్న సెల్‌ఫోన్‌ను ఓ మహిళ దాచి పెట్టింది. దానిని ఆదివారం నాడు విజయ్ మద్దూరి పోలీసులకు అప్పగించారు. అందులో ఉన్న డాటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొకైన్ మత్తుపదార్థాలు తీసుకొచ్చి విజయ్ మద్దూరికి ఎవరు ఇచ్చారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ధరల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

'సాలార్‌జంగ్ మ్యూజియం ఫుడ్‌కోర్టు' పేరుతో నిర్వహిస్తున్నారు. ఇదే హోటల్‌లో ఈ కుంభకోణం వెలుగు చూసింది. ఈ హోటల్‌లో సుమారు 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. టూరిజం శాఖ నిర్ణయించిన ధరల పట్టికను నిబంధనల ప్రకారం హోటల్‌లో డిస్‌ప్లే చేయాలి. అంతేకాకుండా ప్రతి వినియోగదారుడికి కంప్యూటర్ రసీదు బిల్ ఇవ్వాలి. ఈ హోటల్‌లో మటన్,చికెన్ బిర్యానీలతో పాటు టిఫిన్స్, స్నాక్స్, జ్యూస్, కూల్‌డ్రింక్స్, టి, కాఫీ తదితర అన్నిరకాల ఫుడ్స్ లభిస్తాయి. అయితే ప్రతి రోజు వచ్చే ఆదాయాన్ని టూరిజం శాఖ బ్యాంక్‌లో జమ చేయడం పరిపాటి. అయితే టూరిజం శాఖ ఈ హోటల్‌లో చికెన్ బిర్యాని ధర రూ.150గా నిర్ణయించగా హటల్ నిర్వాహకులు మాత్రం పర్యటకుల నుంచి రూ.200 వసూలు చేశారు. ఇలా చాలా రకాల ఫుడ్ ఐటంలలో ధరలను పెంచి వచ్చిన కాడికి దండుకున్నారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో మూడు నెలల క్రితం టూరిజం శాఖ డిప్యూటీ మేనేజర్ కట్టి నతన్ తన సిబ్బందితో కలిసి ఈ హోటల్‌లో ఆకస్మిక తనిఖీ జరిపారు. వీరి తనిఖీలో టూరిజం శాఖ నిర్ణయించిన ధరలకు కాకుండా అధిక ధరలకు ఫుడ్‌ను విక్రయిస్తున్నారని తేలింది. అంతేకాకుండా హోటల్‌కు వచ్చే వినియోగదారుడికి కంప్యూటర్ రసీదు ఇవ్వకుండా కేవలం ప్లాస్టిక్ టోకెన్‌లు ఇస్తున్నారని తేలింది. టోకెన్ విధానం అంటూ టూరిజంకు సంబంధించిన ఏ హోటల్‌లో లేదు. టోకెన్‌పై ఫుడ్ ధర ఉండదు. హోటల్ సిబ్బంది ఎంత చెబితే అంత వినియోగదారుడు డబ్బులు కడుతున్నట్లు తేలింది.ఇక్కడి సిబ్బంది కంప్యూటర్ రసీదు బిల్ ఇస్తే పెంచిన ధరల విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో పాటు వచ్చే ఆధాయంలో నొక్కేయడం కష్టమని భావించిన సిబ్బంది టోకెన్ సిస్టంను ప్రవేశపెట్టారు. ప్రతి రోజు హోటల్‌కు ఎంత ఆధాయం వస్తుందనే విషయం శాస్త్రీయంగా తెలియదు. అయితే ఇక్కడి సిబ్బంది ఎన్ని రోజుల నుంచి ఈ దందాకు తెగబడ్డారనే విషయం తెలియదు. అధికారులు వచ్చారు, రెడ్‌హ్యాండెడ్‌గా సాక్ష్యాధారాలతో కుంభకోణాన్ని పట్టుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే హోటల్ నిర్వాహకులు ఎన్ని రోజుల నుంచి ఇలా ధరలు పెంచి విక్రయిస్తున్నారు, ఎంత డబ్బు కాజేశారు, అనే విషయాలు మాత్రం తనిఖీ చేసిన అధికారి బయట పెట్టకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంపై టూరిజం శాఖ అధికారి సూర్యప్రకాష్‌ను వివరణ కోరగా తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాలార్‌జంగ్ మ్యూజియం హోటల్‌లో జరిగిన కుంభకోణం మిగతా హోటళ్లపై కూడా అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State,
Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com